ఆదివారం గతి సారించుకుంటే విలువైన

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం fb.com/vaartha

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

10-1-2025 శుక్రవారం సంపుటి: 30 సంచిక: 343 పేజీలు: 10+4 వెల: 6.50


యుద్ధంతో కాదు.. బౌద్ధంతోనే భవిష్యత్తు: పిఎం

5లో

ఇండియా కూటమిని మూసేయడం మేలు: ఒమర్

# తొక్కిసలాటపై న్యాయ విచారణ

## పదిరోజుల వైకుంఠద్వార దర్శనంపై పునఃసమీక్ష!

### ఆగమ నిపుణులు పరిశీలిస్తారని సిఎం చంద్రబాబు సంచలన ప్రకటన

### భవిష్యత్‌లో ఎఐతో టోకెన్ రహిత దర్శనాలు

**తిరుపతి,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన ధనురాస్మంలో వైకుంఠద్వార దర్శనాల కోసం కోట్లాదిమంది భక్తులు వైకుంఠ ఏకాదశిన శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకోవాలని భావిస్తారని, అలాంటపుడు సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగిన చర్యలు అధికారులు తీసుకోవాలని రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబు సూచించారు. తిరుపతిలో టోకెన్లు జారీచేసే విధానం వల్ల ఈ తోపులాట, తొక్కిసలాట జరగడం, ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. తిరుపతిలో క్షతగాత్రుల నుండి తీసుకున్న అభిప్రాయాలు, సూచనల మేరకు భవిష్యత్తులో టోకెన్లు లేని స్వామివారి దర్శనాలను కృత్రిమమేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)విధానం అమలు చేస్తామన్నారు. తమకూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వచ్చిన తరువాత తిరుమల పవిత్రతను కాపాడటానికి ఒక్కొక్క >>2



గురువారం తిరుపతిలో జరిగిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో సిఎం చంద్రబాబు, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ శ్యామలరావు

**తిరుపతి,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనపై న్యాయవిచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తెలిపారు. అధికారుల బాధ్యతా రాహిత్యం, నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని తేల్చారు. ఎంతో దూరం నుండి వైకుంఠద్వార దర్శన టోకెన్లకోసం వచ్చి తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు కుటుంబాలకు ఒక్కొక్కరికి 25లక్షల రూపాయలు పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు.. తీవ్రంగా క్షతగాత్రులైన వారికి 5లక్షలు రూపాయలు, క్షతగాత్రులైన వారికి 2లక్షల రూపాయలు పరిహారం చెల్లిస్తామన్నారు. తిరుపతి రుయా, స్విమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యచికిత్స లందించేలా వైద్యాధికారులను ఆదేశించినట్లు సిఎం చెప్పారు. రాజకీయాలకు అతీతంగా శ్రీవారి సేవచేస్తున్నామని భావించాలని, తెలిసి చేసినా తెలియక చేసినా తప్పుతప్పేనని చంద్రబాబు స్పష్టం చేశారు. కోట్లాదిమంది భక్తులు పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలు చేసుకోవాలని ఆనుకుంటారని, పవిత్రతకు భంగం కలగకుండా వచ్చిన భక్తులకు ప్రశాంత వాతావరణంలో సేవలందించడం ముఖ్యమన్నారు. ఈవిషయంలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహ

### నేను ఊరుకున్నా... దేవుడు వదిలిపెట్టడు

### మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు పరిహారం, టిటిడిలో కాంట్రాక్టు ఉద్యోగం

### తీవ్ర క్షతగాత్రులకు రూ.5లక్షలు, సాధారణ క్షతగాత్రులకు రూ.2లక్షలు

### అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు..

### చికిత్సపొందుతున్నవారిని పేరుపేరునా పలకరించి ఓదార్చిన సిఎం

### తిరుపతిలో పర్యటించిన సిఎం చంద్రబాబు నాయుడు



గురువారం స్విమ్స్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తున్న సిఎం చంద్రబాబు

రించినా చూస్తూ ఊరుకునేదిలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరు పతిలో జరిగిన విషాదకర ఘటనలో మృతుల కుటుంబాలను ఓదార్చడానికి, తీవ్ర క్షతగాత్రులను పరామర్శించడానికి గురువారంమధ్యాహ్నాం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతికి చేరుకున్నారు. టిటిడి పాలకమండలి చైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అధికారులు, జిల్లా యంత్రాంగంతో కలసి తొలుత తిరుపతిలోని బైరాగిపట్టెడ రామానాయుడు ఉన్నతపాఠశాల, పద్మావతి పార్కు ప్రాంతాలను, అక్కడ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఇక్కడ భక్తులు వేచివుండేందుకు తీసుకున్న చర్యలు, క్యూలైన్ల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ భక్తులను దర్శన టోకెన్లకు విడుదల చేసిన నిన్నరాత్రి 8.30గంటల సమయంలో అక్కడే విధుల్లో ఉన్న తిరుపతి క్రైమ్ డిఎస్పీ రమణకుమార్ తీరుపై ఆయన వివరాలు రాబట్టారు. అక్కడ పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేసిన టిటిడి జెఇఒ గౌతమిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నుండి తిరుపతి స్విమ్స్‌కు చేరుకుని అత్యవసర విభాగంలో >>2

## స్విమ్స్ మహిళా కళాశాలవద్ద ఉద్రిక్తత

### సిఎం, డి.సిఎం, మాజీ సిఎం సందర్శనతో అంతా గందరగోళం

**తిరుపతి హెల్త్, జనవరి 9 ప్రభాతవార్త :** క్షతగాత్రులను గంట ఆలస్యంగా గురువారం మధ్యాహ్నాం పరామర్శించేందుకు సిఎం నారా చంద్రబాబు వచ్చాడు. గంటకు పైగా ఆస్పత్రిలోని క్షతగాత్రులను పరామర్శించి వెంటనే తిరిగి వెళ్లిపోయారు. అటు పిమ్మట డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ఇంతలో మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఆస్పత్రి వద్దకు వస్తున్నారనే విషయం తెలుసుకుని వైసీపీ శ్రేణులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. దాదాపు గంటన్నరకుపైగా ఆస్పత్రిలోని క్షతగాత్రులను పరామర్శించి పవన్ కల్యాణ్ ఆస్పత్రి బయటకు వచ్చారు. ఇక తిరుగు ప్రయాణం అయ్యే సమయంలో పవన్ కల్యాణ్ ఒక్క సారిగా యువత, జనసేన నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పవన్ >>2



టిటిడి జెఇఒ గౌతమి



ఎస్పీ సుబ్బారాయుడు



సివిఎస్ఒ శ్రీధర్

## ముగ్గురు టిటిడి ఉన్నతాధికారులపై వేటు

### టిటిడి జెఇఒ గౌతమి, తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు, టిటిడి సివిఎస్ఒ శ్రీధర్ తక్షణం బదలీ

### తిరుపతి క్రైమ్ డిఎస్పీ రమణకుమార్, గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డి సస్పెన్షన్

**తిరుపతి, జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** దేవుని దర్శనం కోసంవచ్చి జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన విషాదంలో ఉన్నతాధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడమే కారణమని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ విషాద ఘటనకు బాధ్యులైన టిటిడి జెఇఒ గౌతమి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ ఎస్.శ్రీధర్‌పై బదిలీ వేటు వేశారు. ఇంకా ప్రణాళిక లేకుండా బైరాగిపట్టెడ ప్రాంతంలో గేట్లు తెరిచిన తిరుపతి క్రైమ్ డిఎస్పీ రమణ >>2

## తప్పు జరిగింది.. క్షమించండి

### ● టిటిడి ఇఒ, అదనపు ఇఒ మధ్య సమన్వయ లోపం ● అధికారుల తప్పిదంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు ● తిరుపతిలో డిప్యూటీ సిఎం పవన్ ఆగ్రహం

**తిరుపతి, జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వార దర్శన టోకెన్లు జారీలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం, 40మందివరకు క్షతగాత్రులైన ఘటనకు టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి బాధ్యత తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. రద్దీని నియంత్రించడంలో ఆ ఇద్దరూ విఫలమయ్యారని కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ ఇద్దరి ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతమంది టిటిడి సిబ్బంది, పోలీసులు ఉండి ఆరుగురు ప్రాణాలు కోల్పోయినా భక్తుల రద్దీని నియంత్రించడంలో క్రౌడ్ మేనేజ్‌మెంట్ సరిగా జరగలేదని ఆయన అసహనం చెందారు. ఇదీ ఒక బాధాకరమైన ఘటన అన్నారు. తిరుపతిలో జరిగిన విషాదకర ఘటనలో మృతుల కుటుంబాలను ఓదార్చడానికి, తిరుపతి స్విమ్స్,రుయా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించడానికి గురువారం మధ్యాహ్నాం ఉపముఖ్యమంత్రి పవన్ తిరుపతికి చేరుకున్నారు. తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, జనసేననాయకులు ఆరణి మదన్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి,డాక్టర్ హరిప్రసాద్,చిత్తూరు జిల్లా ఎస్పీ మణి కంఠచందోలుతో కలసి ఆయన ఘటన జరిగిన తిరుపతిలోని బైరాగిపట్టెడ రామానాయుడు ఉన్నతపాఠశాల, పద్మావతి పార్కు ప్రాంతాలను,అక్కడ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఇక్కడ భక్తులు వేచివుండేందుకు తీసుకున్న చర్యలు, క్యూలైన్ల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం స్విమ్స్‌కు చేరుకుని క్షతగాత్రులను, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. వైకుంఠద్వార దర్శనం టోకెన్లు జారీ ఘటనలో తప్పిదం జరిగిందని, రాష్ట్రప్రభుత్వం తరపున క్షమాపణలు చెబుతున్నట్లు ఆయన తెలిపారు. తప్పుజరిగిందని, బాధ్యత తీసుకుంటామన్నారు. >>2



గురువారం తిరుపతిలో ఘటన వివరాలు తెలుసుకుంటున్న డి.సిఎం పవన్

## తిరుమలను దివ్యక్షేత్రంగా నిలబెట్టాలన్నదే తపన

### టోకెన్లు ఇవ్వడం సరైంది కాదన్న భక్తులు

### మీడియాతో సిఎం చంద్రబాబు

**తిరుపతి,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** దేవుని దర్శనం కోసం వచ్చి తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం ..ఇదీ తనమనసును కలచి వేసిందని సిఎం చంద్రబాబునాయుడు విషాద వనదంతో తెలిపారు. వేంకటేశ్వరస్వామి పాదాల చెంత మనసా,వాచా ఎప్పుడూ ఎలాంటి అపశృతి జరగకూడదు. పవిత్రమైన దివ్యక్షేత్రంగా ఎప్పుడూ నిలబెట్టాలనేది తన తాపత్రయమని, ఓ భక్తునిగా , ముఖ్యమంత్రిగా కోరుకుంటానని అన్నారు. తిరుమల దివ్యక్షేత్ర పవిత్రతను కాపాడే బాధ్యతను ఎప్పుడో తీసుకున్నానన్నారు. ఇకపైనా తీసుకుంటానని ఆయన పునరుద్ఘాటించారు. దేవుని దర్శన టోకెన్లు జారీచేసిన ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించానని, అక్కడ 2వేలమందికి సరిపడే స్థలం ఉంటే 2,500మందిని ఎలా అనుమతించారనేది ఆశ్చర్యం కలిగించిందన్నారు. లోపాలను సరిదిద్దాల్సిన టిటిడి, పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నాం నుండి సాయంత్రం వరకు తిరుపతిలోని బైరాగిపట్టెడటోకెన్లుజారీ ప్రాంతాన్ని, ఘటనకు కారణాలను, స్విమ్స్ ఆస్పత్రిలో బాధితులందరితో వారి కుటుంబ సభ్యులు >>2

## అది పూర్తిగా ప్రభుత్వ తప్పిదమే



గురువారం పద్మావతి మెడికల్ కాలేజీలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ సిఎం జగన్

### తిరుపతి చరిత్రలో అలాంటి దుర్ఘటన జరగలేదు..

### మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షలివ్వాలి

### బాధితులను పరామర్శించిన మాజీ సిఎం జగన్

**తిరుపతిరూరల్, జనవరి 9 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తప్పిదం, అధికారుల నిర్లక్ష్యం వల్లే తిరుపతిలో 6మంది శ్రీవారి భక్తులు మృతి చెందారని ప్రతిపక్షనేత వైయస్.జగన్మోహాన్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేసారు. తిరుపతి చరిత్రలో ఇలాంటి ఘటన ఎన్నడూ జరగలేదని, అధికారుల భద్రత వైఫల్యం వల్లే ఈ దుర్ఘటన జరిగిందన్నారు. తొక్కిసలాటలో మృతి చెందిన కుటుంబాలకు రూ.50లక్షల రుపాయాలు, గాయపడినవారికి ఉచిత వైద్యంతో పాటు రూ.5లక్షల రుపాయాలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేసారు. ఈ ఘటనకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు హోం మంత్రి, టిటిడి చైర్మెన్, టిటిడి ఇవో, తిరుపతి కలెక్టర్, తిరుపతి ఎస్పీ బాధ్యులేని స్పష్టం చేసారు. బుధవారం తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన కుటుంబాలను, శ్రీపద్మావతి మెడికల్ కాలేజ్‌లలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వైయస్.జగన్ పరామర్శించారు. క్షతగాత్రుల పరామర్శ అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు >>2

## నవ్వుతూ వెళ్లి.. శవాలై ఇంటికి

### పలు కుటుంబాల్లో తీవ్ర విషాదం, స్వామి దర్శనానికి వచ్చి తిరిగిరాని లోకాలకు

**తిరుపతి,జనవరి 9 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా తిరుమలేశుని వైకుంఠ దర్శనం కోసం భక్తి శ్రద్దలతో వచ్చిన భక్తుల్లో కొందరు శవాలుగా మారారు. దూర ప్రాంతాల నుంచి స్వామిని దర్శించుకోవటానికి వచ్చిన వారిలో ఆరుమంది చనిపోగా 40 మంది గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు.ఈ సంఘటన జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. బుధవారం రాత్రి సుమారు 9.30గంటలకు సంఘటన జరిగింది. సంఘటన జరిగిన తరువాత పరుగులు తీసారు. సహాయ కార్యక్రమాలకు పూనుకున్నారు. పరుగులు తీసారు. అయితే ఈ సంఘటనను పాలకులు తీవ్రంగా పరిగణించారు. గురువారంఉదయం ముఖ్యమంత్రి నారాచంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంశాఖ మంత్రి అనిత, సమాచారం శాఖ మంత్రి కొలుసు పార్థసారధి,జలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, స్థానిక ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిలు తిరుపతి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించారు. ముఖ్యమంత్రి రుయా ఆసుపత్రిలో గాయపడిన ప్రతి ఒక్కరిని పరామర్శించారు.

ఇక మృతి చెందిన వారి వద్ద ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చారు. గురువారం తిరుపతి నాయకులతో కిట కిట లాడింది. సంఘటనపై కదలి వచ్చిన ప్రభుత్వం విధి నిర్వహణలో సకాలంలో స్పందించని అధికారులను ఇంటికి సాగనంపారు. ఈ నేపథ్యంలో ఎస్‌సి,టిటిడి జెయిఒ,గోశాల డైరెక్టర్, >>2




## సంక్షేమ హాస్టళ్లలో ఏవీ సౌకర్యాలు?: హైకోర్టు

**విజయవాడ జనవరి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, డాక్టర్ బీఆర్ ఆంబేద్కర్ గురుకుల సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కోసం నామ మాత్రపు నిధులను విడుదల చేయడాన్ని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. 2021-22 లో రూ.24.60 లక్షలు మాత్రమే కేటాయించడంపై విస్మయం వ్యక్తం చేసింది. ఆ సొమ్ముతో వసతి గృహాల్లో సదుపాయాల కల్పన ఏ విధంగా సాధ్యమని ప్రశ్నించింది. కనీసం ఐదు వసతి గృహాల్లోని పరిస్థితులను పరిశీలించి నివేదికలు ఇవ్వాలని జిల్లాల న్యాయ సేవాధికార సంస్థలను ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కొరతను ప్రశ్నిస్తూ కాకినాడకు చెందిన కేఏఎం గురుతేజ 2023లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరపున న్యాయవాది జి.అరుణ్‌శౌరి వాదనలు వినిపించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ విషయంలో నిధుల కేటాయింపును పెంచామన్నారు. మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2024- 25 లో ప్రభుత్వం రూ.143 >>2



స్విమ్స్ వద్ద బాధితులను ఓదార్చుతున్న సిఎం చంద్రబాబు



స్విమ్స్‌లో బాధితులను పరామర్శిస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్



టిటిడి ఉన్నతాధికారులతో సిఎం చంద్రబాబు సమావేశం

# తొక్కిసలాటపై న్యాయ విచారణ

>> చికిత్స పొందుతున్న బాధితులను పేరుపేరునా ఒక్కొక్కరిని పలకరించి ఘటన ఎలా జరిగిందని,కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారినుండి వైద్యసేవలందుతున్న విషయం కూడా అడిగారు. ఇంకా మెరుగైన వైద్యంఅందించాలని స్విమ్స్ క్యాజువాల్టీ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ శివశంకర్‌కు ఆదేశించారు. సుమారు గంటన్నరసమయం పైగా స్విమ్స్‌లో సిఎం చంద్రబాబు బాధితుల వైద్యసేవలపై, వారి రిపోర్టులను పరిశీలించారు.

**నేను ఊరుకున్నా దేవుడు వదలిపెట్టడు:సిఎం**

వైకుంఠద్వార దర్శనం చేసుకునేందుకు అవకాశం ఉన్న భక్తులందరూ రావడం సహజమేనని, అయితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, భక్తులు పెద్దసంఖ్యలో వచ్చినా రద్దీని నియంత్రించలేకపోవడం వంటి తప్పిదాలు జరిగాయని సిఎం చంద్రబాబు తెలిపారు. భారీగా భక్తులు వచ్చినా అరకొరగా భద్రత చర్యలు తీసుకోవడం, పోలీసు,టిటిడి అధికారులు నిర్లక్ష్యంగా, బాధ్యతలేకుండా వ్యవహరించారని మండిపడ్డారు. తిరుపతి పుణ్యక్షేత్రంలో భాదాకరమైన ఘటన చోటుచేసుకుందని, ఈ తొక్కిసలాట ఘటనలో 6మంది చనిపోవడం, 40మంది క్షతగాత్రులవడం తన మనసును కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల పవిత్రతను కాపాడే బాధ్యత అందరిపై ఉందని సిఎం స్పష్టం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించానని, వారితో మాట్లాడితే పలు ఆసక్తికర విషయాలు తెలిశాయన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. తిరుమల పుణ్యక్షేత్రమని, దాని పవిత్రతను కాపాడుతామని ఆయన పునరుద్ఘాటించారు. తొక్కిసలాట ఘటనపై కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని, టిటిడి బోర్డుకు, ఉన్నతాధికారులకు కొన్ని సూచనలు కూడా చేశామని సిఎం తెలిపారు. తిరుపతిలో ఇలాంటి ఘటనలు, రాజకీయం చేయడం ఉండకూడదని ఒక భక్తుడుగా తాను కోరుకుంటున్నానని మనసులోని మాటను మరోసారి బయటపెట్టారు. కొందరి అనాలోచిత నిర్ణయాలతో దేవుడిని అప్రతిష్టపాలు చేయొద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**మృతులకుటుంబాలకు రూ.25లక్షలు పరిహారం:**

తిరుపతిలో బుధవారం రాత్రి వైకుంటదర్శన టోకెన్లకోసం వచ్చి ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు కుటుంబాలకు ఒక్కొక్కరికి 25లక్షల రూపాయలు పరిహారం అందిస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించారు. వారి కుటుంబంలో వారికి టిటిడిలో కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తామని వెల్లడించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన 15మందికి 5లక్షల రూపాయలు పరిహారం, క్షతగాత్రులైన 24మందికి 2లక్షల రూపాయలు పరిహారం అందిస్తామన్నారు. గాయపడిన వారందరికీ శుక్రవారం వైకుంఠద్వార దర్శనం చేయిస్తామని ఆయన అప్పటికప్పుడేప్రకటించారు. ఇందుకు టిటిడి అధికారులు తగిన ఏర్పాట్లుచేస్తారన్నారు. కాగా తిరుపతిలో తొక్కిసలాటలో మృతిచెందినవారిలో విశాఖపట్నం తాటిచెట్లపాలెంకు చెందిన లావణ్యస్వాతి(37), కంచర్లపాలెంకు చెందిన శాంతి(35), మద్దెలపాలెంకు చెందిన రజని(47), నరసరావుపేట రామచంద్రాపురంకు చెందిన బాబునాయుడు(51), తమిళనాడు సేలంజిల్లా మేదారిగ్రామంకు చెందిన మల్లిగ(50), పొల్లాచ్చికి చెందిన నిర్మల(45)ఉన్నారు. వీరి కుటుంబసభ్యులు తిరుపతి రుయా ఆస్పత్రి మార్చురీ వద్ద ఆర్తనాదాలు మిన్నంటాయి.

# ఉన్నతాధికారులపై వేటు

>> కుమార్, టిటిడి గోశాలడైరెక్టర్ డాక్టర్ హరనాథ రెడ్డిని సస్పెండ్ చేశారు. గురువారం మధ్యాహ్నం నుండి రాత్రి వరకు తిరుపతిలో పర్య టించి, ఘటనపై కారణాలను ఆరాతీసిన సిఎం చంద్రబాబు సాయంత్రం టిటిడి పరిపాలన భవ నంలో జరిగిన మీడియాప్రతినిధుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. దేవుని దర్శనానికి అనాలోచిత నిర్ణయాల వల్ల,గతంలో తీసుకున్న విధానాల వల్ల భారీగా భక్తులు తరలివచ్చినపుడు అధికారులు ఆలోచనతో పనిచేయాలన్నారు. అలా గాకుండా నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతో ముగ్గురు ఉన్నతాధికారులను తక్షణం బదిలీ చేసినట్లు, ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయడం జరిగిందని సిఎం ప్రకటిం చారు. ఇంకా టిటిడి ఇఒ శ్యామలరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులపై మండిపడ్డారు. పెద్ద సంఖ్యలో భక్తులు వస్తే రద్దీ పెరుగుతుంటే అధికా రులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అంబులెన్స్‌ల లభ్యత లేకపోవడం, అందుబాటులో వుంచకపోవడం జిల్లా యంత్రాంగం వైఫల్యమ న్నారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు.

# నవ్వుతూ వెళ్లి.. శవాలై ఇంటికి

>> తిరుపతి డివైయస్‌పి,టిటిడి సివి ఎస్‌ఒ లను ఇంటికి సాగనంపారు.కాగా ప్రతి పక్ష నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి తిరుపతి చేరుకున్నారు.

**సంఘటన ఎలా జరిగిందంటే . . .**

వైకుంఠ ఏకాదశి సర్వదర్శనంను పురస్కరించుకొని టిటిడి 9 ప్రాంతాల్లో 90కౌంటర్లు ఏర్పాటు చేసారు. బైరాగి పట్టెడ ప్రాంతంలోని రామానాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో టోకెన్ల జారికి 10కౌంటర్లు ఏర్పాటు చేసారు. ఇక్కడకు మధ్యాహ్నం నుంచే తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల వారు తమిళనాడు నుంచి భారీ ఎత్తున భక్తులు చేరుకున్నారు.రాత్రి 8.50గంటల సమంయలో క్యూలైన్లలోకి అనుమతించటంతో ఒక్కసారిగా ప్రవేశించటానికి ప్రయత్నించారు. ఎవరు ముందు వెళ్లాలన్న అంశంలో ఎవరికి వారు జోరపడ్డారు. దాంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. భక్తుల్లో మహిళలు, వృద్ధులు ఉండటంతో కింద పడ్డారు.పోలీసులు అదుపుచేయటానికి విఫల యత్నం చేసినట్లు తెలిసింది. ఈ తోసులాటలో పలువురు కిందపడ్డారు.వారిని తొక్కేసారు. పలువురు అపస్మారక స్థితికి చేరుకున్నారు. అలాగే శ్రీనివాసంలో కూడా తొక్కిసలాట చోటు చేసుకుంది. భక్తులు గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటనల్లో సుమారు 40 మంది గాయపడ్డారు. తిరుపతిలో బుధవారం రాత్రి జరిగిన తోపులాటలో మృతి చెందిన వారి మృతదేహాలకు పోస్టుమార్టం జరిపి స్వస్థలాలకు పంపటానికి కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, టిటిడి చైర్మెన్ బిఆర్ నాయుడులు కృషి చేసారు.

# స్విమ్స్ మహిళా కళాశాలవద్ద ఉద్రిక్తత

>> కల్యాణ్ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు, కేకలు వేశారు. అప్పటికే మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల వద్దకు చేరుకున్నారు. పవన్ కల్యాణ్ ఆస్పత్రి ఎదుట ఉన్న మీడియా సోదరుల వద్దకు వచ్చి ప్రెస్‌మీట్ ప్రారంభించారు. క్షత గాత్రులను పరామర్శించేందుకు వచ్చాను. ఇప్పటికైనా పోలీసులు తీరు మార్చుకోవాలి. అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఒక్కసారిగా జగన్ ఆస్పత్రి వద్దకు చేరుకోవడంతో వైసీపీ శ్రేణులు కూడా ఆస్పత్రి వద్ద ఆయన వెంట పరుగులు తీశారు. దీంతో అర్ధగంట పాటు పోలీసుల పరిస్థితి అయోమయంగా కనపడింది. ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఒకానొక దశలో వైసీపీ శ్రేణులు, జనసేన నేతలు ఘర్షణకు దిగే పరిస్థితి ఏర్పడింది.

# మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట

**విజయవాడ, జనవరి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** సినీనటుడు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం సినీనటుడు మోహన్‌బాబు ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో మోహన్‌బాబు దాఖలుచేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను గత నెల 23న తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. దాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# అది పూర్తిగా ప్రభుత్వ తప్పిదమే

>> ముఖ్యమంత్రి అయ్యాక టిటిడి ప్రతిష్ట దిగజారుతుందని, చంద్రబాబునాయుడుకి దేవుడంటే భక్తి లేదు...దేవుడంటే భయం లేదన్నారు. గతంలోను గోదావరి పుష్కరాలలో 30మందిని బలికొన్నారని వాపోయారు. ఈ తొక్కిసలాటకు మొదటి ముద్దాయి ముమ్మాటికి సిఎం,చంద్రబాబే అన్నారు. ఈ సంఘటనలో చిన్న చిన్న ఉద్యోగులను బాధ్యులను చేసి, బదిలీ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని, బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. సిఎం కుప్పం పర్యటనలో ఉన్నందున జిల్లా యంత్రాంగ అంతా అక్కడ నిమగ్నం అవ్వడంతో ఈ ఘటనకు ఒక కారణమని తెలిపారు. ప్రతి ఏటా వైకుంఠ ఏకాదశి, ద్వాదశికి శ్రీవారి దర్శన టోకేన్స్ కోసం లక్షల మంది భక్తులు తిరుపతికి వస్తారనే విషయం టిటిడి అధికారులకు తెలిసినప్పటికి భద్రత ఏర్పాట్లు చేయడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని వైయస్.జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. బైరాగిపట్టెడ ఎంజిఎం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌కు భారీగా భక్తులు చేరుకోగా భక్తులను పక్కనే ఉన్న పద్మావతి పార్కులో పంపారని, పార్కులో 2000 మందికి మాత్రమే పరిమితంగా కాగా పరిమితికి మించి 2500మందిని పంపడంతో పాటు ఒక్కసారిగా గేట్ తెరవడంతో సంఘనట జరిగిందన్నారు. భక్తులను క్యూలైన్‌లో కాకుండా అందర్ని ఒకేచోట గుమిగూడేలా చేర్చారని, ఒకే సారికాకుండా ఒక్కొక్కరిగా పంపి ఉంటే ఈ ఘటన జరిగేది కాదన్నారు. టోకేన్స్ జారీ చేసే కేంద్రాలలో భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమైనారని ఆవేదన వ్యక్తం చేసారు. భక్తులకు భద్రత ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్య వైఖరి, 6మంది భక్తుల మృతికి కారకులైనారన్నారు. శ్రీవారి దర్శన టోకేన్స్‌కు జారీ చేసే ప్రాంతాలలో జరిగిన తొక్కిసలాటలో 6మంది మృతితో పాటు 60మంది వరకు గాయాలు బారిన పడ్డారని, గాయపడినవారికి పద్మావతి మెడికల్ కాలేజ్, స్విమ్స్, రుయా ఆసుపత్రులలో చికిత్స పోందుతున్నారని వైయస్.జగన్ వాపోయారు. ఎఫ్.ఐ.ఆర్‌లో 5మంది మాత్రమే మృతి చెందినట్లు పేర్కొనడం బాధాకరం అన్నారు.105 కేసు పెట్టాల్సిందిపోయి, కేసును నీరు గార్చటానికే చిన్న కేసు పెట్టారని, వీరికి మానవత్వం లేదన్నారు.

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, ఆర్కే రోజా, మాజీ ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, విజయానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠద్వార దర్శనంపై పునఃసమీక్ష!

>> మార్పు తీసుకువస్తున్నామన్నారు. భక్తులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకు మార్పులు తీసుకుంటున్నామన్నారు. ఇక తిరుమలలో పురాతన కాలంనుండి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వారాలను వైకుంఠ ఏకాదశి,ద్వాదశిరోజుల్లో 48గంటలపాటు మాత్రమే తెరచివుంచి, టోకెన్లలేకుండా తిరుమలకు వస్తే 40గంటలు కూడా నిరీక్షించి దర్శనం చేసుకుని సురక్షితంగా వెళ్లేవారని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ విధానం గత ఐదేళ్లముందు వైసిపి ప్రభుత్వం, టిటిడి బోర్డు ఇష్టానుసారంగా అమలుచేసిన విషయం తనకు తెలియదన్నారు. పదిరోజులకు టోకెన్లు జారీచేసే విధానం కూడా తనవరకు రాలేదన్నారు. ఇప్పుడు ఈ విధానంపై కూడా ఆగమపండితులతో, ఆగమశాస్త్ర నిపుణులతో సంప్రదించి టిటిడి బోర్డు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటుందని సిఎం వెల్లడించారు. తిరుమలలో పూర్తిస్థాయిలో పవిత్రతను కాపాడటంలో జరుగుతున్న ప్రక్షాళన సమయంలో ఈ దుర్ఘటన జరగడం బాధాకరమన్నారు. టిటిడి బోర్డులో చర్చించి భక్తులకు మెరుగైన సౌకర్యాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటారన్నారు. శ్రీవారి సన్నిధిలో, దేవుని విషయంలో ఎవరు రాజకీయాలు చేయాలని చూసినా ఆ దేవుని లెక్కల నుండి తప్పించుకోలేరన్నారు. క్రైస్తవులకు జెరూసలేం, ముస్లింలకు మక్కాలాగా తిరుమల హిందువులకు పవిత్ర పుణ్యక్షేత్రమమని మరోసారి ఉద్ఘాటించారు. జీవితకాలంలో ఒకసారైనా ఆ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని ప్రతి హిందూ భక్తులు భావిస్తారన్నారు. భక్తుల ఆశయాలకు తగ్గట్లు టిటిడి ఛైర్మన్ బిర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సమిష్టిగా సమన్వయంగా భక్తితో సేవలందించాలని సిఎం సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేని వైకుంఠద్వార దర్శనం కల్పిస్తామన్నారు. ఇంకా ఈ ఘటనలో బాధ్యులైన పోలీసులను బదిలీ చేయాలని సిఎం చంద్రబాబు జిల్లా అధికారులను ఆదేశించారు.

# తప్పు జరిగింది.. క్షమించండి



గురువారం మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

>> క్షతగాత్రులు, రాష్ట్రప్రజలు, శ్రీవారి భక్తులు,హైందవధర్మాన్ని నమ్మిన ప్రతి ఒక్కరూ క్షమించమని రాష్ట్రప్రభుత్వం అడుగుతోందన్నారు. ఈ ఘటన జరగకుండా టిటిడి రద్దీని నియంత్రించే విషయంలో విఫలమైందని మండిపడ్డారు. విఐపిలకు కాదు..సామాన్యభక్తులకు సేవలందించడంలో టిటిడి దృష్టి పెట్టాలన్నారు. మృతుల కుటుంబాల వద్దకు టిటిడి సభ్యులు వెళ్లి క్షమాపణలు చెప్పాలన్నారు. భారీగా భక్తులు వచ్చినా నియంత్రణ, బాధ్యతగా వ్యవహరించడంలో టిటిడి ఇఒ ,అదనపు ఇఒ విఫలమయ్యారని ఆయన మండిపడ్డారు. ఘటనాస్థలిలో ఉన్న పోలీసులు బాధ్యత తీసుకోవాలన్నారు. అధికారులు చేసిన తప్పులకు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి తిట్లుతింటున్నామన్నారు. తొక్కిసలాట జరిగాక సహాయక చర్యలు ఎలా ఉండాలనేది ప్రణాళిక లేదని, వ్యక్తులు చేసిన తప్పులు రాష్ట్రప్రభుత్వంపై పడుతోందన్నారు. పోలీసుల్లో కొందరు కావాలనే చేశారా?అనే అనుమానాలు కూడా ఉన్నాయని సంచలనం వ్యాఖ్యలు చేశారు.ఈ అనుమాలన్నిటిపై విచారణ జరగాలన్నారు. ఇఒ,అదనపు ఇఒ,బోర్డుకు మధ్య సమన్వయలోపం ఉందని ఈ ఘటన తెలియజేస్తుందన్నారు. పోలీసుశాఖ నిర్లక్ష్యంపై సిఎం,డిజిపి దృష్టికి తీసుకెళతానని ఉపముఖ్యమంత్రి తెలిపారు. తిరుమలలో దేవుని దర్శనం కోసం 10గంటల సమయం పట్టేవరకు ఎందుకు ఉందని, ఈ మార్పు జరగాలని ఆయన అన్నారు. సాధ్యమైనంతవరకు గంట,రెండుగంటల్లోనే దర్శనం జరిగేలా చూడాలని పవన్‌కల్యాణ్ తెలిపారు.

# హాస్టళ్లలో ఏవీ సౌకర్యాలు?

>> కోట్లు కేటాయించిందన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేయడానికి సమయం కావాలని కోరారు. కోర్టు ముందు ఉంచిన వివరాలను పరిశీలించిన ధర్మాసనం వసతి గృహాల్లో ఉన్న పిల్లల కులాలను అధికారులు పేర్కొనడాన్ని ఆక్షేపించింది. పిల్లల విషయంలో కులాల ప్రస్తావన ఎందుకని ప్రశ్నించింది. 2021-22కు పూర్వం, ఆ తర్వాత సైతం తూతూ మంత్రంగా నిధుల కేటాయించారని గుర్తుచేసింది. 2019-24 మధ్య కాలంలో వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.20 కోట్లు కూడా ఖర్చుచేయలేదని పేర్కొంది. 90వేల మంది విద్యార్థులు ఉంటున్న వసతి గృహాల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో తాము అర్థం చేసుకోగలమని వ్యాఖ్యానించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.143 కోట్లు కేటాయించినా అవి ఏ విధంగా సరిపోతాయని ప్రశ్నించింది. ప్రాథమికంగా తాగునీరు, బెడ్‌లు, దస్తులు, మరుగుదొడ్లు, పౌష్టికాహారం, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించింది. సంక్షేమ వసతిగృహాలకు ఎంతకేటాయించారు?ఎంత ఖర్చుచేశారు, కేటాయించిన సొమ్ము సరిపోతుందా తదితర వివరాలతో నివేదిక సమర్పించాలని సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణకు సంక్షేమశాఖ కమిషనర్ ఆన్‌లైన్ ద్వారా హాజరుకావాలని ఆదేశించింది.

# సంక్రాంతికి చేనేత వస్త్రాలు ధరిద్దాం

## -మంత్రి సవిత పిలుపు

### నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పో 2004- 25 ను ప్రారంభించిన మంత్రి

**విజయవాడ,జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కలిగించేలా ప్రతి నెలా ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి, బీసీ,ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఎగ్జిబిషన్లు, ఎక్స్ పోలు నిర్వహణతో చేనేత వస్త్రాలు విక్రయాలు పెరిగాయి అని మంత్రి తెలిపారు. గురువారంఆమె విజయవాడ నగరం లోని ఓ కన్వన్షెన్ సెంటర్లో నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పో 2004- 25 ను జ్యోతి ప్రజ్వలనతో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్స్ పో లో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి, ఏ రాష్ట్రం నుంచి వచ్చారు... అమ్మకాలు ఎలా జరుగుతున్నాయి..? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ఎంతో కీలకమైన చేనేతకు సీఎం చంద్రబాబు అండగా ఉంటున్నారన్నారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించడానికి రాష్ట్రంలోనూ, దేశ విదేశాల్లోనూ చేనేత ఎక్స్‌పోలు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి నెలా చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ వీవర్స్ సర్వీస్ సెంటర్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడలో నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పోను నిర్వహిస్తున్నామన్నారు.

# వక్ఫ్ బోర్డుకు 65,783 ఎకరాల ఆస్తి ఉంది

## రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేర్ అబ్దుల్ అజీజ్

**విజయవాడ.జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఉన్న 65,783 ఎకరాల వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడతామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు.. వన్ టౌన్ గల రాష్ట్ర వక్ఫ్ బోర్డు రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఈ సందర్భంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆస్తులు భగవంతుడి కోసం దాతలు ఇచ్చారని, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని ముస్లిం మతానికి చెందిన పేదలకు, వితంతువులకు, అనాథలకు ఖర్చుచేస్తామేకాని ఇతరులు ఆక్రమించుకోవడానికి కుదరదన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తి అంటే దేవుడి ఆస్తి అని దానికి బోర్డు ఛైర్మన్, సభ్యులు ధర్మకర్తలుగా మాత్రమే ఉంటామని అంతేకాకుండా ఆ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడే బాధ్యత మా పై ఉందన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు భగవంతుని కోసం దాతలు ఇచ్చారన్నారు. మసీదులకు మా తాతలు ధర్మకర్తలుగా, ముతావల్లీలుగా వున్నారని, కాభట్టి మేము ఆ ఆస్తిని అమ్ముకోవచ్చు అన్న అపోహలో కొందరు వున్నారన్నారు, అది జరుగదు, జరగనియ్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమల వెంకటేశ్వర స్వామిని భక్తితో చూసినట్టు వక్ఫ్ బోర్డు ఆస్తులను కూడా అలాగే చూస్తారని, ముఖ్యమంత్రి నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ముకానివ్వనని అంతేకాకుండా వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడతానన్నారు.ఎప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల అవసరాల కోసం వక్ఫ్ బోర్డు భూములను నష్ట పరిహారంగా తీసుకోవచ్చని, కాని ప్రైవేట్ వ్యక్తులకు అది వీలుకాదన్నారు. గతంలో 65,783 ఎకరాల భూమి మసీదులు, దర్గాలకు దానంగా ఇచ్చారన్నారు. ఇందులో 31,590 ఎకరాల భూములు ఆక్రమణ లో వున్నాయన్నారు. ఈ భూములను కొందరు తెలిసో, తెలియకో కొన్నారన్నారు. కొన్నవారు ప్రతి అంగుళం భూమిని వెనక్కి ఇవ్వాల్సిందేనన్నారు. వక్ఫ్ భూముల ఆక్రమణలపై సర్వే సంపూర్ణంగా జరగడం లేదన్నారు. ఇప్పటి వరకు జిల్లాల్లో 651 ఎకరాలపై 40 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

# నిలబెట్టాలన్నదే తపన

>> కొందరితో మాట్లాడానన్నారు.కొన్ని విషయాలు తనకు తెలిశాయన్నారు.టిటిడి పరిపాలన భవనంలో అధికారులతో అన్ని కోణాల్లోనూ సమీక్షించిన తరువాత ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సరైన నిర్ణయాలు తీసుకోవాలని టిటిడి బోర్డును ఆదేశించానన్నారు. పవిత్రత దెబ్బతినే పరిస్థితి రాకూడదన్నారు. అందరూ ఇక్కడ దేవునికి సేవచేస్తున్నామనే భావన కలగాలన్నారు. భక్తుల మనోభావాలు గురించి సిఎం వివరిస్తూ తిరుపతిలో టోకెన్లు జారీ మంచిదికాదని, కొండపైకి అనుమతినిస్తే ఎంతసమయం అయినా క్యూలైన్లలోనే ఉంటామని, స్వామివారిని తలచుకుంటూ ఆయన లీలలు గుర్తుచేసుకుంటూ దేవుని సన్నిధిలో సేవలో ఉన్నామనే భావం కలుగుతుందన్నారు. గురువారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, మంత్రులు రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్,టిటిడి ఈఒ శ్యామలరావుతో కలసి మీడియాతో కొన్ని విషయాలు తెలిపారు.

## వారం - వర్జ్యం

తేది : 10-01-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయనం,
హేమంత ఋతువు, శుక్లపక్షం,
ఏకాదశి ఉ.10.20
కృత్తిక మ.1.45
వర్జ్యం : తె.4.54-6.25
దు.ఉ.9.02-9.47, 2) మ.12.45-1.30
శుభసమయం: ఉ.6.30-7.15,
సా.4.15-5.30
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** అనుకున్నదే తడువుగా పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు.

**వృషభం :** గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**మిథునం:** కుటుంబ సభ్యులతో కలిసి ఉల్లాసంగా గడుపుతారు. విహారయాత్రలు చేస్తారు.

**కర్కాటకం :** సహోద్యోగులతో భేదాభిప్రాయాలు చోటు చేసుకుంటాయి. విదేశీ పర్యటనలు.

**సింహం:** మీ మానసికస్థితిని అర్థం చేసుకోగలిగిన వారు నిజంగా ఎవరనేది ఈ రోజు తెలుసుకొంటారు.

**కన్య :** పొదుపు పథకాలపైన దృష్టిని సారిస్తారు. నూతన వ్యాపారాలకు శ్రీకారం చుడతారు.

**తుల :** ఎవరి మీద ఆధారపడరు. మీ పనిని మీరే స్వయంగా చేసుకుంటారు. శుభవార్తలు వింటారు.

**వృశ్చికం:** లలిత కళలో ప్రావీణ్యతను పొందటానికి శిక్షణాతరగతులలో చేరతారు.

**ధనుస్సు:** మంచిమధ్యవర్తిగా వ్యవహరించి ఇరువర్గాల మధ్యనసఖ్యతను సమకూరుస్తారు.

**మకరం:** జీవితాన్ని కొత్తకోణంలో చూస్తారు. చేపట్టిన పనులు నిదానంగా పూర్తిచేస్తారు.

**కుంభం:** వృత్తి, ఉద్యోగ, వ్యాపారాదులు మీరు ఆశించిన స్థాయిలో ఉంటాయి. వస్తులాభం.

**మీనం :** ఆర్థికపరిస్థితి సంతృప్తికరంగా ఉన్నా కుటుంబ, ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## సచివాలయంలో సంక్రాంతి సంబరాలు

**- ఆకట్టుకున్న రంగవల్లులు.. గంగిరెద్దుల ప్రదర్శన**

**సచివాలయం,జనవరి 9,ప్రభాతవార్త :** ఏపి రాష్ట్ర సచివాలయంలో సచివాలయ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు రంగవల్లి పోటీలు, గంగిరెద్దుల ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల వైస్ ప్రెసిడెంట్ సులోచన మాట్లాడుతూ ప్రతి ఏడాది రాష్ట్ర సచివాలయంలో సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. తిరుపతిలో అనుకోని సంఘటన కారణంగా కొన్ని కార్యక్రమాలు రద్దుచేస్తున్నట్లు ఆమె తెలిపారు. సచివాలయ సంఘం ఉద్యోగుల తరపున బాధితులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సంక్రాంతి రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకున్నారు. చంద్రబాబుపై ఉద్యోగులు చాలా ఆశలు పెట్టుకున్నారని వారి ఆశలు, ఆకాంక్షలు ఆయన నెరవేరుస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. రంగవల్లుల్లో మహిళా ఉద్యోగులంతా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 500మంది మహిళలు పోటీల్లో పాల్గొని ముగ్గులు వేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ మనోహర్, జాయింట్ సెక్రటరీ శ్రీను, రమాదేవి మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## సిఎం దార్శనికతకు నిదర్శనం ఆర్టీజిఎస్

**- మంత్రి నాదెండ్ల మనోహర్**



రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ సమావేశంలో మంత్రి నాదెండ్ల

**విజయవాడ,జనవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపు, దార్శనికతకు రియల్ టైమ్ గవర్నెన్స్ ఒక నిదర్శనమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. టెక్నాలజీలో పాలన కొత్త పుంతలు తొక్కించగలమని ఆర్టీజీఎస్ ద్వారా సీఎం నిరూపించారని తెలిపారు. గురువారం ఆయన సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ ని సందర్శించారు. ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె. దినేష్ కుమార్ మంత్రికి స్వాగతం పలికి, ఆర్టీజీఎస్ పనిచేస్తున్న విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నాదేండ్ల మనోహర్ మాట్లాడుతూ ఒక రాష్ట్ర ప్రభుత్వానికి ఇంతమంది వ్యవస్థ కలిగి ఉండటం అద్భుతమన్నారు. ఈ సాంకేతిక సదుపాయంతో ప్రభుత్వంలో మరిన్ని విప్లవాత్మక మార్పులు చేపట్టగలమన్న నమ్మకం ఆర్టీజీఎస్‌ను చూశాక కలుగుతోందన్నారు. టెక్నాలజీ కలిగి ఉండటం ఒక ఎత్తైతే, డాటా కలిగి ఉండటం అనేది చాలా ముఖ్యమన్నారు. డాటా వాస్తవాన్ని చాటుతుందని, డాటాను ఉపయోగించుకుని క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఆస్తులు, పథకాలు అమలు తీరు, లబ్దిదారులకు పథకాలు ఎలా అందుతున్నాయి తదితర అంశాలను సమర్థవంతంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌ను ప్రజలకు ఒక పద్దతి ప్రకారం క్షేత్రస్థాయిలో పంచాయతీ, పురపాలక స్థాయిలో

**- క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి డాటా ముఖ్యం**

**- ప్రభుత్వ పనితీరులో ఆర్టీజి సహకారం ఎంతో అవసరం**

అందించడానికి ఆర్టీజీఎస్ చక్కగా పనిచేస్తోందన్నారు. ఈ సమాచారంలో శాఖల్లో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ఇంకా మెరుగ్గా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, అలాగే కార్యక్రమాల అమలుకు ఒక నిర్దిష్ట కాలపరిమితి పెట్టుకుని ప్రభుత్వంలో జవాబుదారీతనం పెంచేలా ఉపయోగించుకోవచ్చని ఆర్టీజీఎస్‌ను చూశాక నమ్మకం కలుగుతోందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సాంకేతిక సహకారం అందించడంలో అద్భుతంగా పనిచేస్తున్న ఆర్టీజీఎస్ సీఈఓ, ఆ సంస్థ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఒకే ప్రభుత్వం, ఒకే రాష్ట్రం, ఒకే పౌరుడు, ఒకే డాటా విధానంతో స్మార్ట్ గవర్నెన్స్‌ను ప్రజలకు అందించే విధంగా ఆర్టీజీఎస్ పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతున్నాయనేది నిరంతరం పర్యవేక్షిస్తూ ఆర్టీజీఎస్ ఎప్పటికప్పుడు తనవద్ద ఉన్న డాటా ఆధారంగా విశ్లేషిస్తోందన్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో అపారమైన డాటా లభ్యమవుతోందని, అయితే ఇప్పటి వరకు ఈ డాటా అంతా ఒకే చోట అనుసంధానం కాలేదని, ఆర్టీజీఎస్ ఇప్పుడు అన్ని శాఖల్లో లభ్యమవుతున్న డాటాను సేకరించి ఒక పెద్ద డాటా లేక్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సు, డీప్‌టెక్ సాంకేతిక సదుపాయాలను ఉపయోగించుకుని ఈ డాను విశ్లేషించి ప్రజలకు మరింత మెరుగైన సేవలను ప్రభుత్వం అందించడానికి ఆర్టీజీఎస్ సహకారం అందిస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ, ప్రతి పల్లెకు ఒక ప్రత్యేక ప్రొఫైల్ రూపొందిస్తామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా పథకాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.

## తిరుమల సమాచారం

### 1.20లక్షల వైకుంఠద్వారం దర్శన టోకెన్లు జారీ

**- ఆఫ్‌లైన్‌లో భక్తులకు కేటాయింపు**



**తిరుమల,జనవరి 9పభాత వార్త ప్రతినిధి:** తిరుమలేశుని ఆలయంలో వైకుంఠఏకాదశి, ద్వాదశి ఘడియల్లో వైకుంఠద్వార దర్శనం కోసం తిరుపతిలోని 8ప్రాంతాల్లో ఆఫ్‌లైన్‌లో జారీచేసిన టోకెన్లు గురువారం ఉదయం 10గంటలకు 1.20లక్షలు భక్తులు అందుకున్నారు. ఈ టోకెన్ల కోసం బుధవారం మధ్యాహ్నానికే తిరుపతిలోని ప్రత్యేక కౌంటర్ల వద్ద తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల భక్తులతో బాటు తిరుపతి పరిసరాల్లోని భక్తులు, తెలుగురాష్ట్రాల నుండి భక్తులు భారీగా తోపులాటలు జరిగాయి. కొన్ని విషాద ఘటనలతో భారీ భద్రత, ఏర్పాట్లు మధ్య 12వతేదీ వరకు మూడురోజుల టోకెన్లు కేటాయించారు. గురువారం రాత్రికి తిరుమల కొండ సామాన్యభక్తులతో నిండిపోయింది. గదులు దొరకని భక్తులు ఆలయం ముందు భాగంలో, ప్రత్యేక షెడ్లలో వసతిపొందారు. కాగా 13వతేదీ నుండి 19వరకు ఆయారోజుల్లోనే టోకెన్లు జారీచేస్తారు.

## రేషన్‌బియ్యం మాయం కేసు.. నిందితుల కస్టడీ కోరుతూ పోలీసుల పిటిషన్

**విజయవాడ జనవరి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** పేర్ని నాని కుటుంబ సభ్యులకు చెందిన గిడ్డంగిలో రేషన్ బియ్యం మాయంపై కేసు నమోదైంది ఈ కేసులో నిందితులను 5 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ మచిలీపట్నం కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఏ2 మానస్ తేజ్, ఏ4 మంగారావు , ఏ5 ఆంజనేయులను కస్టడీకి ఇవ్వాలని కోరారు. ఇప్పటికే కోర్టు అనుమతిలో పోలీసులు ఒకరోజు వారిని విచారించారు. ఏ1 గా ఉన్న పేర్ని జయసుధను మరోసారి విచారణకు రావాలని నోటీసులు ఇచ్చే అవకాశముంది.

## అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

### కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇంచార్జి మాణికం ఠాకూర్

**- అమిత్ షా వ్యాఖ్యలపై నెల్లిమర్లలో నిరసన**

**నెల్లిమర్ల (విజయనగరం జిల్లా) జనవరి 9 ప్రభాతవార్త :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా ను మంత్రి పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జ మాణిక్యం ఠాకూర్ డిమాండ్ చేశారు. పార్లమెంటును అంబేద్కర్‌ను అవ మానిస్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నవ సత్యాగ్రహం పేరుతో విజయనగరం జిల్లా నియోజక వర్గ కేంద్రం నెల్లిమర్ల రామతీర్థం జంక్షన్‌లో డిసిసి అధ్యక్షుడు విద్యాసాగర్, నెల్లిమర్ల నియోజక వర్గ సమన్వయ కర్త గంటా సతీష్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిరసన కార్యక్రమం జరిగింది. తొలుత రామతర్ధం జంక్షన్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఇందిరా కాలనీకి వెళ్లి అక్కడ ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానికులను ఉద్దేశించి ఠాకూర్ మాట్లాడారు. పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌ను అవమానిస్తూ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని అన్నారు. రాజ్యాంగ నిర్మాత గా పేరుగాంచిన అంబేద్కర్ భారత జాతికి దేవుడని కొనియాడారు. ప్రపంచ మేధావిగా గుర్తింపును పొందారని అన్నారు. అటువంటి మహనీయుడు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా తీరుపై రాష్ట్ర పెద్దలు ఖండించక పోవడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ అధ్యక్షుడు , సిడబ్ల్యుసి సభ్యుడు గిడుగు రుద్రరాజు, మస్తాన్ వలి తదితరులు మాటాడుతూ రాజ్యాంగ పదవులు అనుభవిస్తున్న వ్యక్తులు అంబేద్కర్‌ను అవమానించడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. నవ సత్యాగ్రహం పేరిట కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో దేశమంతా ఆందోళన చేపడు తున్నట్లు చెప్పారు. అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పకపోతే 26నుంచి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.




ఈ కార్యక్రమంలో డిసిసి అద్యక్షుడు విద్యాసాగర్, నెల్లిమర్ల, గజపతినగరం, ఎస్.కోట నియోజక వర్గాల సమన్వయ కర్తలు గంటా సతీష్, డాక్టర్ చిత్రాడ దుర్గాప్రసాద్, డాక్టర్ గేదెల తిరుపతి, ఓబిసి జిల్లా చైర్మన్ తారకేశ్వరరావు, నియోజక వర్గ చైర్మన్ రాయల సురేష్, యూత్ కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## విషాదంలో తిరుపతి

**- భక్తుల నిరసన**

**తిరుమల,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ వెంకన్న ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార మోక్షమార్గం తెరచుకోవడానికి 48గంటల ముందే తిరుపతిలో విషాదం అలముకుంది. ఆధ్యాత్మికనగరంలో దర్శన టోకెన్లుకోసం వచ్చిన 50వేలమంది యాత్రికులను 8ప్రాంతాల్లో నియంత్రించలేని పోలీసు, టిటిడి అధికారులు విఫలమయ్యారు. దీంతో కొన్నిగంటల్లోపే ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం, 40మందివరకు భక్తులు క్షతగాత్రులవడంతో తిరుపతిలో విషాదం అలముకుంది. ఒకచోట, రెండుచోట్ల కాదు....ఏకంగా నాలుగు చోట్ల టోకెన్లు జారీచేసే కేంద్రాల వద్ద ఒక్కసారిగా బుధవారం రాత్రి జరిగిన తోపులాట, తొక్కిసలాట ఘటనలు తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఒరిస్సా, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నలుమూలల నుండి భారీగా తరలి వచ్చిన భక్తుల హృదయాలను కలచివేసింది. ఈ ఘటనలతో పలుచోట్ల తిరుపతిలో సామాన్య భక్తులు నిరసనకు దిగారు. గురువారం ఉదయం తిరుమలకు చేరుకున్న భక్తులను సర్వదర్శనానికి వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లోనికి అనుమతించక పోవడంతో ఏటిసి, ఎంబిసి ప్రాంతాల్లో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నఫళంగా దర్శనాలను నిలిపివేస్తే తమ పరిస్థితి ఏంటనే ఆందోళన చెందారు. టోకెన్లు లేని భక్తులను దర్శనానికి అనుమతించబోమని టిటిడి అధికారులు విజ్ఞప్తి చేసినా భక్తులు ససేమిరా వినిపించుకోలేదు. శుక్రవారం నేడు వైకుంఠ ఏకాదశి, శనివారం వైకుంఠ ద్వాదశి పర్వదినాలు కావడంతో నేటి వేకువజామున 2గంటలకు ఆలయంలోని వైకుంఠద్వారాలను తెరుస్తారు. ఇందుకు సామాన్యభక్తులు భారీగా చేరుకున్నారు. గురువారం సాయంత్రానికి కొండపై విపరీతంగా రద్దీ కనిపించింది. కొండపై వైకుంఠద్వార దర్శనం కోసం విఐపిలు తాకిడి కూడా ఎక్కువైంది. ప్రముఖులు భారీసంఖ్యలో తిరుమలకు రావడంతో వసతి కోసం టిటిడి వసతికల్పన విభాగం అధికారులు తలలుపట్టుకొంటున్నారు.

## సోలార్ పవర్ కార్పొరేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి



సోలార్ పవర్ కార్పోరేషన్ 2025 డైరీ, క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటిరవికుమార్

**విజయవాడ, జనవరి9, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ సోలార్ పవర్ కార్పోరేషన్ 2025 డైరీ, క్యాలెండర్ ను చీఫ్ సెక్రటరీ కే. విజయానంద్ తో కలిసి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సచివాలయంలోని మూడో బ్లాక్ లోని మంత్రి ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడారు. పునరుత్పాదక రంగానికి ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ని రూపొందించినట్లు పేర్కొన్నారు. గతంలో రాష్ట్రాన్ని విడిచి వెళ్లిన పునరుత్పాదక రంగం పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలో సోలార్ పవర్ కార్పోరేషన్ పనితీరును మంత్రి గొట్టిపాటి అభినందించారు. నాణ్యమైన విద్యుత్ ను అందించడంలో కార్పోరేషన్ కృషి అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్ కె.విజయానంద్ , ఏపీ జెన్కో ఎండీ చక్రధర్ బాబు, ట్రాన్స్ కో జేఎండీ కీర్తి చెకూరి, సీపీడీసీఎల్ సీఎండీ పఠాన్ శెట్టి రవి సుభాష్ , సోలార్ పవర్ కార్పోరేషన్ ఎండీ కమలాకర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## గేమ్‌ఛేంజరు, డాకు మహారాజ్ సినిమాల టికెట్ ధరల పెంపు 10 రోజులే

**విజయవాడ జనవరి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్ సినిమాల టికెట్ విషయంలో పెంచిన ధరలను పది రోజులకే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. గతంలోనూ ఇదే తరహా ఉత్తర్వులిచ్చామని, అవి ప్రస్తుత సినిమాల విషయంలోనూ వర్తిస్తాయని తెలిపింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. గేమ్ చేంజర్ డాకు మహారాజ్ సినిమాల అధిక షోల ప్రదర్శన టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ గుంటూరుకు చెందిన అరిగెల శ్రీనివాసుల హైకోర్టులో పిల్ వేశారు. న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ టికెట్ ధరలను 14 రోజులు పెంచుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చిందన్నారు. ఆ సినిమాల కథానాయకులు, ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి బంధువుల కావడంతో అధిక షోలకు, ధరల పెంపునకు అనుమతి ఇచ్చారన్నారు. గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ వేడుకకు వెళ్లి వస్తూ ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో చనిపోయారని చెప్పారు. అర్ధరాత్రి వేళల్లో సినిమా ప్రీమియర్ షోల ప్రదర్శనను నిలిపివేసేలా ఆదేశాల జారీ చేయాలని కోరారు.

## మైనార్టీ వర్గాల పిల్లలు చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలి: మంత్రి ఫరూక్



కొండపల్లి దర్గా వద్ద ఉర్సూ కార్యక్రమంలో మంత్రి ఫరూక్

**విజయవాడ.జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** జీవన మార్గంలో ఏ రంగంలో రాణించాలన్నా , చదువుకోవడం ద్వారానే అది సాధ్యమవుతుందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. గురువారం అమరావతి లోని తన క్యాంపు కార్యాలయంలో భారతదేశ తొలి ముస్లిం ఉపాధ్యాయురాలిగా, ఆదర్శప్రాయురాలిగా నిలిచిన షేక్ ఫాతిమా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. షేక్ ఫాతిమా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే లతో కలిసి షేక్ ఫాతిమా కలిసి పని చేశారని అన్నారు. బాలికా విద్య కోసం అహర్నిశలు కృషిచేసిన భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలిగా షేక్ ఫాతిమా కార్యాచరణ అమలు లో ఎన్నో ఇబ్బందులకు, భౌతిక దాడులకు కూడా గురైనప్పటికీ తాను అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసిన ఘనత సొంతం చేసుకుని భావితరాలకు ఆదర్శప్రాయురాలిగా నిలిచిందని అన్నారు. మైనారిటీ వర్గాలు, ప్రజలందరూ చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. చదువు తోనే తాము అనుకున్న రంగంలో ఉన్నత స్థాయిలోకి చేరేందుకు మార్గం సులభ తరం అవుతుందని అన్నారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి , అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. బాలిక విద్య కోసం ఎంతో కృషి చేసిన షేక్ ఫాతిమా సేవలను ప్రభుత్వం 8వ తరగతి పాఠ్యపుస్తకాల్లో ఆమె జీవిత చరిత్రను, సేవలు, పడిన కష్టాలను సవివరంగా పేర్కొంటూ తెలుగు పాఠ్యపుస్తకంలో చేర్చి తగిన గౌరవం కల్పించడం జరిగిందని మంత్రి ఫరూక్ అన్నారు. అనంతరం విజయవాడ సమీపంలోని కొండపల్లి గ్రామంలో జరిగిన హజరత్ సయ్యద్ షా బొఖారి వారి 428 వ ఉరుసు ముబారక్ ఉరుసు మహోత్సవం తొలి రోజు కార్యక్రమానికి న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ హాజరయ్యారు. మూడు రోజులపాటు ఉరుసు మహోత్సవాన్ని నిర్వాహకులు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. పురాతన దర్గాను సందర్శించిన మంత్రి ఫరూక్ చాదర్ ను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ, పలువురు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు... ఎన్ఎండి ఫరూక్ ఉమ్రా యాత్రకు ఆంధ్రప్రదేశ్ న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఈనెల 10వ తేదీ శుక్రవారం రాత్రి బయలుదేరి వెళ్లనున్నారు. ఉమ్రా యాత్రలో భాగంగా మక్కా, మదీనా ప్రార్థన మందిరాల సందర్శన అనంతరం 18వ తేదీన మంత్రి ఫరూక్ తిరిగి రానున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్రా యాత్రకు బయలుదేరుతున్న మంత్రి ఫరూక్ ను మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య అధికారులు, ఇంకా పలువురు ముఖ్యులు అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉమ్రా యాత్ర విజయవంతంగా పూర్తి చేసుకొని రావాలని ఆకాంక్షిస్తూ దువా చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం, శాంతి సౌభాగ్యాల కోసం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఉమ్రా యాత్రలో ప్రార్థిస్తానని పేర్కొన్నారు.

## టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రజా వేదిక అర్జీలు స్వీకరించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**విజయవాడ,.జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా సమస్యలపై వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తున్నామని రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేసారు. తప్వేకొద్ది గత ప్రభుత్వ వైఫల్యాలు బయటపడుతున్నాయన్నారు. గత ప్రభుత్వ నిరక్ష్యంగా కారణంగానే సమస్యలు పెరిగాయన్నారు. వాటిపై లెక్కకు మించిన ఫిర్యాదులు తమ పార్టీకి అందుతున్నాయన్నారు. తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నాడు నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖ మంత్రివర్యులు రాంప్రసాద్ రెడ్డి గారు పాల్గొని పలు అర్జీలను స్వీకరించారు. పలు దూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను శాఖల వారిగా పరిష్కారానికి మంత్రి ఎండర్స్ చేసి పరిష్కారానికిచొరవ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ప్రభుత్వ విప్ పంచమర్తి అనురాధ, కవాలి గిరిష్మా పాల్గొన్నారు. భూములు నష్టపరిహారం ఇప్పించండి. పల్నాడు జిల్లా నడికుడి గ్రామానికి చెందిన కే. శ్రీనివాసరావు సహా మరో ఏడుగురు రైతులకు సంబంధించిన 2 ఎకరాల పొలాలు గత వైకాపా ప్రభుత్వ హయంలో బైపాస్ రోడ్డు విస్తరణలో కోల్పోయామని , రెండు సంవత్సరాల నుండి అధికారులు చుట్టూ తిరిగిన కాలయాపన చేస్తున్నారని మంత్రికి అర్జీ సమర్పించారు. వైకాపా కక్షసాధింపుతో ఇళ్లు కోల్పోయాం 201419 టిడిపి హయాంలో మంజూరైన డబుల్ బెడ్ రూమ్ టిడ్కో గృహాలు తమకు మంజూరై, వాటికి 25000/ డిడి కట్టిన కానీ గత వైసిపి పాలకుల కక్ష సాధింపు చర్యలో భాగంగా తమకు గృహాలు ఇవ్వలేదని కడప జిల్లా ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన ఎం చక్రవర్తి టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డికి అర్జీ అందజేశారు. సాంకేతిక సమస్యల పరిష్కారానికి వినతి ఏపీ టూవీలర్స్ అసోసియేషన్ తరపున వాహన సైట్ లో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి గారికి



అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. వల్లభనేని వంశీ నిర్వాకంతో తీరని నష్టం కృష్ణాజిల్లా మల్లవల్లి గ్రామానికి చెందిన ఆర్సీ నెంబర్ 11 లో గల 1400 ఎకరాల భూమిని ఎకరాకు ఏడున్నర లక్షలు నష్టపరిహారంతో వారికి కంపెనీల నిర్మాణం రెవెన్యూ వారు అందజేసారని మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రొత్బలం తో బాధితులకు తీరని అన్యాయం జరిగిందని, సమస్యను పరిష్కరించాలని మాజీ ఎంపీటీసీ బి. సాంబశివ రావు ప్రజా వేదికలో మంత్రికి అర్జీ సమర్పించారు. శాసనమండలిలో ప్రభుత్వ విప్ పంచమర్తి అనురాధ, కావాలి గిరిష్మా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేటి నుంచి సంక్రాంతికి మరికొన్ని అదనపు ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,జనవరి 9,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల ప్రజలు నూతన సంవత్సరంలో ఆనందోత్సాహాలతో జరుపుకునే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే అదనంగా మరికొన్ని సంక్రాంతి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. హైదరాబాద్ నుంచి కాకినాడ టౌన్ వెళ్లే నెంబర్ 07209ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10వ తేదీ రాత్రి 8.15గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కాకినాడ టౌన్ నుంచి హైదరాబాద్ వెళ్లే నెంబర్ 07210ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5.40గంటలకు కాకినాడ టౌన్ నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.30గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 07211 ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12న రాత్రి 9.45గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.25గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్లే నెంబర్ 07212ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13వ తేదీ సాయంత్రం 4.35గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.50గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు సర్వీసులు సికింద్రాబాద్, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, కర్నూలు, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట రైల్వేస్టేషన్లలో నిలుస్తాయి. చర్లపల్లి నుంచి కాకినాడ టౌన్ వెళ్లే నెంబర్ 07213ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11వ తేదీన రాత్రి 8గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7గంటలకు కాకినాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కాకినాడ టౌన్ నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07214ఎక్స్‌ప్రెస్

ఈ నెల 12వ తేదీన సాయంత్రం 7.40గంటలకు కాకినాడ టౌనన నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.30గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. శ్రీకాకుళం నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07208ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11వ తేదీన మధ్యాహ్నం 2.45గంటలకు శ్రీకాకుళం నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.50గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో చర్లపల్లి నుంచి శ్రీకాకుళం వెళ్లే నెంబర్ 07206ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12వ తేదీన ఉదయం 9.30గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి అదేరోజు సాయంత్రం 7.10గంటలకు శ్రీకాకుళం చేరుకుంటుంది.

## దుర్గమ్మను దర్శించుకున్న రెవెన్యూ, ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి

**ఇంద్రకీలాద్రి, జనవరి 9, ప్రభాతవార్త :** దుర్గమ్మను గురువారం రాష్ట్ర రెవెన్యూ ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా దర్శించుకున్నారు. ఆయనకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసి , ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి గుంటూరు వాస్తవ్యులు సి వేంకటేశ్వర్లు, కుటుంబసభ్యులతో కలిసి



రెవెన్యూ, ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరికి దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

రు.1,11,116 ల విరాళాన్ని గురువారం అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసి , ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు. దుర్గమ్మవారికి గురువారం కామారెడ్డికి చెందిన మాలోతు నవీన్‌కుమార్ ఆలపించిన భక్తిసంగీత నీరాజనం భక్తులను అలరించింది. శుక్లాంబరదరం, అదివో అల్లదివో, నిగమ నిగమాంతరంగ, చూడరమ్మ సతులారా, కనకదుర్గాంభిక

వార్త

మనం ఉన్నత లక్షణాలు కలిగి ఉంటే సరిపోదు. వాటిని నిలబెట్టుకోవడానికి తగిన సామర్థ్యం కూడా కలిగి ఉండాలి.

న-సెయింట్ థెరిస్సా

# సమన్వయ లోపానికి బాధ్యులెవరు?

వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ నిర్వహణతో అధికారుల వైఫల్యంతో ఆరుగురి భక్తుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. సందర్భమేదైనా అనుకోని సంఘటన జరిగిపోయింది. తిరుపతి పట్టణంలో బైరాగి పట్టెడ, విష్ణునివాసం, రామానాయుడు స్కూళ్ల వద్ద వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ కోసం కౌంటర్‌లు ఏర్పాటు చేశారు తప్ప వేలాది భక్తులు వస్తారన్న అంచనాలున్నా అనుభవలేమి వలనో సమన్వయం లేకనో తగినంత భద్రతా సిబ్బందిని నియమించలేదు. టిటిడి సెక్యూరిటీ కానీ పోలీసు సిబ్బంది కాని ఈ కేంద్రాలవద్ద రద్దీని అదుపు చేయలేక పోయారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు లేవు. బుధవారం నాటి తొక్కిసలాట ఘటనలో ఆరుగురు దుర్మరణం చెందగా, 44 మంది క్షతగాత్రులయ్యారు. ముక్కోటి ఏకాదశి నాడు వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని అంచనాలు ఉన్నా అధికారుల నిర్ణయ వైఫల్యంతో జరగరాని ప్రాణనష్టం జరిగింది. సరైన పోలీసు బందోబస్తు చేయలేకపోవడం టోకెన్ల జారీ సమయం పట్ల సరైన అవగాహన లేకపోవడమూ ఈ సంఘటనకు కారణాలుగా కనపడుతున్నాయి. దీనికి తోడు పాత పద్ధతులు, భక్తుల రద్దీ అంచనాలను పరిగణనలోకి తీసుకోకపోవడమూ తప్పిదమే. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి స్వీయ పరిశీలనలోకి వచ్చింది. తిరుపతిలో టోకెన్ల జారీకి ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల వద్ద విశేషమైన రద్దీ ఏర్పడింది. కొత్త కేంద్రాలు, కొత్తఏర్పాట్ల పర్యవేక్షణలో లోపం ఉందని స్పష్టంగా తెలుస్తోంది. టోకెన్ల జారీ సమయాలను కూడా ముందుకు ప్రకటించినట్లు జరుగక పోవడమూ రద్దీకి కారణంగా గుర్తించారు. టిక్కెట్ల జారీ సమయంలో క్యూలోకి వెళ్లకముందే గుమిగూడిన జనం తొక్కిసలాటలో ప్రాణాలు వదలడమనేది తిరుపతి చరిత్రలోనే ఇది ప్రథమం. నాలుగు దశాబ్దాల నాడు శ్రీవారి దర్శన సందర్భంగా క్యూలైన్‌లో తొక్కిసలాటకు గురై కొంత మంది మరణించిన విషయం విదితమే. ఇలాంటి సంఘటనలు, సందర్భాలలో రోజుకి లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసినా అందుకు తగ్గట్లు భద్రతా సిబ్బందిని సమకూర్చుకోలేకపోయారు. ఏమయినా బుధవారం నాటి ఘటనకు దేవాలయ అధికారులదే బాధ్యత. సరైన సమాచారం లేకుండా ఉన్నట్టుండి ఒక్కసారిగా క్యూలైన్లలోకి భక్తులను వదలడంతో తొక్కిసలాట చోటు చేసుకుందని భక్తులు టిటిడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలకాలంలో దేవాలయాల్లో అంతరాలయ దర్శనాలు, ప్రముఖులకు ప్రత్యేక ఏర్పాట్లు, గంటల తరబడి క్యూలైన్ల నిలిపివేత వంటి కారణాలచేత భక్తుల రద్దీ బాగా పెరిగి పోతుంది. వాటిని అదుపులో పెట్టగలిగిన యంత్రాంగాన్ని టిటిడి ఇంతవరకు ఏర్పాటు చేసుకోలేకపోయింది. తొలుత క్యూలైన్‌లు అందుబాటులో ఉన్నా భక్తులను ఆ క్యూల్లోకి ప్రవేశించకుండా బయట రోడ్డుమీదనే ఉంచారు. బుధవారం రాత్రి 9 గంటలకు అస్వస్థురాలైన మహిళ కోసం పద్మావతి పార్కు తలుపుతెరవగా ఒక్కసారిగా ఆ క్యూలోని జనం తోసుకువెళ్లారు. ఇలా క్యూలైన్ల వద్ద ఊపిరాడక చాలా మంది అస్వస్థులైనారు. గాయపడిన వారికి టిటిడి సెక్యూరిటీ సిబ్బంది సిపిఆర్ చేసి వారిని ఆపదనుంచి గట్టెక్కించడంవలన కొన్ని ప్రాణాలైనా ఉపశమించినందుకు వారు అభినందనీయులు. వైద్యచికిత్సలకు రూయా ఆస్పత్రికి తరలించిన క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందలేదు. డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది డ్యూటీ మారే సమయం అని సరిపెట్టుకోలేం. ఇలాంటి జాప్యాలకు ఎవరు బాధ్యత వహిస్తారు. రాత్రి 9 గంటలకు 'క్యూ' తలుపులు ఎలాంటి నోటీసులు లేకుండా తెరవడం దుస్సంఘటన జరిగిన తర్వాత 11 గంటలకు టోకెన్ల జారీకి ఉపక్రమించడమంటే నిర్ణీత సమయాల విషయంలో సిబ్బందికి సరైన మార్గదర్శకత్వం లేదన్నవిషయం విశదమౌతోంది. ఆఖరుకు ఈ దుర్ఘటనకు డిఎస్‌పి తొందరపాటు, ఇంటిలిజెన్స్ వైఫల్యం పేరిట విశ్లేషించడం అధికారులు తమతమ బాధ్యతల నుంచి పలాయనం చిత్తగించడమే. ఇంతకు ముందు దేశంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన తొక్కిసలాట దుర్ఘటనలు చూస్తే ప్రతీదీ వేర్వేరు పరిస్థితులలో జరిగినవే. 2003 ఆగస్టు 27న మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో కుంభమేళా పవిత్రస్నానాల సమయంలో జరిగిన తొక్కిసలాటలో 39 మంది, 2005లో ఆ రాష్ట్రంలోని సతారాం జిల్లాలో మంథర్‌దేవి ఆలయంలో జరిగినతొక్కిసలాటలో 350మంది భక్తులు, రాజస్థాన్‌లోనిచాముండా ఆలయంలో 2008 సెప్టెంబరు 30న జరిగిన తొక్కిసలాటలో 250 మంది మృతిచెందారు. అదే సంవత్సరం హిమాచల్‌ప్రదేశ్‌లోని నైనాదేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 162మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంత కన్నా దారుణమై తొక్కిసలాట వంతెన కూలిపోతోందన్న ఓ వదంతిని నమ్మిభక్తులు వంతెన మీద నుంచి ఇటూ అటూ పరుగెత్తడంతో 115 మందిని బలితీసుకొంది. మన రాష్ట్రంలోనే గోదావరి పుష్కర సమయంలో జరిగిన తొక్కిసలాటలో 27 మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2015జులై 14న పుష్కరాలప్రారంభం రోజున గోదావరి ఘాట్‌వద్దకు చేరిన సమయంలో ఈసంఘటన జరిగింది. ఇప్పుడు మళ్లీ ఆయన పాలనలోనే ఈ తొక్కిసలాట దుర్ఘటన జరిగింది. కారణాలేవైనా, కారకులెవరైనా అన్నెంపున్నెం ఎరుగని భక్తులు అమాయకంగా బలైపోయారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై పటిష్ట చర్యలు తీసుకొని మాటల్లో కాకుండా చేతల్లో చూపాలి.



ఇతరులపై నీ ముందు నిందలు వేసేవాడు, పరుల వద్ద నీపై నిందలు వేయకుండా ఉండలేడు.

సోక్రటీస్



చేతను మాటగా మార్చడం కంటే మాటను చేతగా మార్చడమే కష్టమని అందరికీ తెలుసు.

మార్టిన్ లూథర్‌కింగ్

## ప్రజావాక్కు



### ఎక్కడ వేసిన గొంగడి అక్కడే

నేరస్తులకేసులగురించి మాట్లాడేటప్పుడురాజకీయ నాయకులు తప్పించుకునే పదం ఏమంటే చట్టం తన పని తాను చేసుకుంటూపోతుందని. నిజంగా అలా జరుగుతోందా అని ప్రశ్నిస్తే ద్వంద సమాధానాలు వస్తున్నాయి. ఉదహారణకు ఏనేరం నిరూపించకుండావట్టినే చంద్రబాబు నాయుడు గారిని 53రోజులు కారాగారం పాలు చేసారు. అదే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీద అనేక అవినీతి కేసులున్నా, పదిసంవత్సరాల పైగా బెయిల్ మీద ఉన్నా, వేల మీద కోర్టులలో వాయిదాలు పడుతున్నా కేసుల పరిష్కారానికి తీవ్ర జాప్యం జరుగుతుండడాన్ని ఏమనాలి? చట్టం దాని పని అది చేసుకుపోతోందనాలా? కోట్లకొలది కేసులు దేశంలోని అన్ని కోర్టుల లోనూ దశాబ్దాల తరబడి పరిష్కారం కాకుండా పేరుకు పోయిన్నాయంటే ఏమనాలి?

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### సమాన విద్య అందించాలి

తెలంగాణ రాష్ట్రంలో 40 శాతం మంది పేదలు బ్రతుకులు ఛిద్ర స్థితిలోనే ఉన్నాయని ఇందిరమ్మ ఇండ్ల సర్వే తెలిపింది. వారి బాగోగుల కోసం ప్రయత్నం చేయవలసి ఉంది. అందుకు సామాజిక భద్రత లేదా సామాజికతతో కూడినఆర్థికభద్రత అందించవలసినఅవసరంఉంది. అయితే ఇందుకు మానవాభివృద్ధి నివేదికను లెక్కలోకి తీసుకోవాల్సినఅవసరంఉంది. తెలంగాణ ఉద్యమం ప్రారంభంలో ఒక స్వేచ్ఛాయుత తెలంగాణకావాలి అని ఒక ప్రజాస్వామిక తెలంగాణ కావాలి అని మాట్లాడుకున్నాం. ఆ దిశగా ప్రయాణం సాగించాం. ఇప్పుడు పరిపూర్ణ హక్కులు కలిగిన తెలంగాణకోసం కొట్లాడుతున్నాం. అందరికి సమానత్వం కలిగిన విద్యను అందించాలి.

-భారత అవినాష్, జనగామ

### ప్రణాళికలు రూపొందించాలి

విపత్కర పరిస్థితులు ఏర్పడడానికి పర్యావరణంలో కలుగుతున్న పెనుమార్పులే ప్రధానకారణం. పట్టణాలు, నగరాలు అతివేగంగా విస్తరిస్తున్నాయి. చెట్లను ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారు. పర్యావరణానికి నష్టం కలుగుతుంది. పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చట్టాలను రూపొందించి, అమలు చేయాలి. ఈదిశగా ప్రభుత్వాలు చట్టాలు రూపకల్పన చేయాలి.

- ఎన్.కృష్ణమోహన్, కర్నూలు జిల్లా

### విశ్వవిద్యాలయ ప్రక్షాళన అవసరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం నగరాల్లో తమిళనాడు, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కొన్ని యూనివర్సిటీల పేర్లతోయధేచ్ఛగా కోర్సులు నిర్వహిస్తున్నారు. వన్ సిట్టింగ్‌లోనే డిగ్రీ సర్టిఫికెట్లు ఇస్తామంటూ అమాయక ప్రజాలను బురిడీ కొట్టిస్తున్నారు. పగలు ఉద్యోగం చెసుకుంటూ రాత్రిళ్లుయూనివర్సిటీలకు హాజరై, పరీక్షలు రాస్తే సర్టిఫికెట్లు ఇస్తామని, క్యాంపస్ ఇంటర్వ్యూలను కూడా ఏర్పాటు చేసి ఉద్యోగాలను పొందేందుకు సహాయం చేస్తామని, ఈ నకిలీ విద్యాసంస్థలు ఆకర్షణీయమైన ప్రకటనలతో అమాయకులైన విద్యార్థులనుఆకట్టుకుంటున్నాయి. అవి నకిలీ యూనివర్సిటీలని తెలియని చాలామంది విద్యార్థులు వాటిల్లో ప్రవేశాలు పొందుతున్నారు. తీరా డబ్బు, సమయం వెచ్చించి చదివిన తర్వాత ఆ ధ్రువపత్రాలు చెల్లవని చెబుతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యా మండలి నకిలీ విశ్వవిద్యాలయాలపై దృష్టి పెట్టాలి.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### పెరుగుతున్న వైద్యం ఖర్చులు

దేశంలో నానాటికీ పెరుగుతున్న వైద్యం ఖర్చులపట్ల సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వైద్యం పేరిట జరిగే వ్యాపారానికి కళ్ళెం వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈనేపథ్యంలో ఆస్పత్రిఫీజులు అందుబాటులో ఉండే విధంగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ నిబంధనలను కఠినంగా అమలుచేయాల్సిందిగా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం శుభపరిణామం. అయితే, దేశంలోని కార్పొరేట్ ఆస్పత్రులేవీ ఈనిబంధనలను పాటించడం లేదు. ఆరోగ్యంపై పెరుగుతున్న వ్యయం కారణంగా ప్రభుత్వం ఏదైనా కఠినమైన నిబంధనలను రూపొందించినట్లయితే ఆరోగ్య సంరక్షణలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించవచ్చు.

-సి. సాయిరుత్విక్, నల్గొండజిల్లా

### అన్ని పథకాలకు డిజిటల్ కార్డులు

తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు నూతనంగా డిజిటల్ కార్డును అందిస్తుంది. దీనివల్ల ఎంతోమంది ప్రజలు లబ్ధిపొందుతారు. అంతేకాదు వారి ఆరోగ్యసంరక్షణకు, అన్నివిధాల ప్రభుత్వ పథకాలకుకూడా ఈడిజిటల్‌కార్డు ఉపకరించడంహర్షణీయం. అయితే దీన్ని అర్హులకే అందేలా చూడాలి. వీటి జారీ పారదర్శకంగా ఉండాలి. కుల మతాలకు వర్ణాలకు అతీతంగా ఉండాలి.

-పి. అశోక్, జగిత్యాలజిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మళ్లీ మాస్కులే శరణ్యమా?

**కోవిడ్ సోకిన సమయంలో జాగ్రత్తలు పాటించడంలో జాప్యం, కొంతలో కొంత నిర్లక్ష్యం, ఆనక ప్రాణభయం కారణంగా లక్షలాది మంది కరోనా వ్యాధిగ్రస్తులయ్యారు. పుష్కర కాలం నాడే హెచ్‌ఎంపివిని కనిపెట్టినా ఇప్పటికీ దాని నిరోధానికి, నయం చేయడానికి కానీ వాక్సిన్ కనిపెట్టలేకపోవడం తీరా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందన ప్రభుత్వ ఉదాసీనత వైఖరి కనపడుతోంది. హెచ్‌ఎంపివి చైనా వైరస్ కానేకాదని స్పష్టమైంది. కనుక కాస్తంత ఊరట. అంతే తప్ప ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా అనారోగ్య సమస్యలే.**

వరిగొండ కాశీ విశ్వేశ్వరరావు

సృష్టిలో కనపడిన ప్రతి వైరస్ ప్రమాద భరితం కాక పోయినా తెలిసీ తెలియని పరిజ్ఞానంతో రేకెత్తించే అనుమానాల వల్లనే ప్రజలు ఆందోళన పడుతున్నారనేది జగద్విదితం. అలా అని ఏ వైరస్ వ్యాప్తినీ కొట్టిపారేయలేం. దాదాపు పుష్కరం నాడు నైజీరియాలో 28 మందిని వ్యాధిగ్రస్తులను చేసిన వైరస్ హెచ్‌ఎంపివి ఇన్నాళ్లకు మళ్లీ కనపడి మరోసారి హెచ్చరిస్తోంది. నిజానికి ఈ వైరస్ 2008 నాటికే ఉన్నా అప్పుడప్పుడు కనిపించి వెళ్లిపోతుంటుంది. పెద్ద ప్రమాదకారి కాదు. ఎన్నడూ ప్రాణహానిలేదని, ఇమ్యూనిటీ లేనివారు, బాలలు, వృద్ధులు మాత్రమే ఈ వైరస్ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ వైరస్ చరిత్రను చూస్తే తెలుస్తుంది. వైరస్‌లన్నీ వ్యాధి కారకాలే అయినా వాటి విజృంభణ తీవ్రతల స్థాయిలో తేడా గోచరిస్తుంది. ఇన్‌ఫ్లూయెంజా, స్పానిష్ ఫ్లూ, ఆసియన్‌ఫ్లూ, సార్స్, మెర్స్ వంటి వైరస్, కొంతకాలం ఉండి కనుమరుగైపోతాయి. ఆ తర్వాత వచ్చిన హైపటైటిస్ వైరస్ ఇప్పటికీ మనుషుల మీద దాడి చేస్తోంది. అయితే ఆ వైరస్ నిరోధానికి వాక్సిన్ కనిపెట్టినందున పెద్ద ప్రమాదం లేనట్లే. కాగా 2019లో చైనా నుంచి దిగుమతి అయిన కొవిడ్ -19 వైరస్ మాత్రం ప్రపంచంలో మానవాళికి తీవ్రప్రాణ నష్టం కలిగించింది. ఎప్పుడు ఏ వైరస్ ప్రవేశించినా వాటి నుండి గట్టెక్కిన సందర్భాలే ఎక్కువ. కాగా కరోనా మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా 68లక్షల మందిని, భారత్‌లో 5.3 లక్షలమందిని పొట్టన పెట్టుకుంది. దాని ప్రభావం కోలుకున్న కరోనా రోగుల మీద పడడం దురదృష్టకరం. ఇంటిగ్రేటెడ్ డీసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (ఐడిఎస్‌పి) డాటా ప్రకారం చూస్తే దేశంలో ఇన్‌ఫ్లుయెంజా లాంటి అనారోగ్య సమస్యల (ఐఎల్‌ఐ) లేదా తీవ్రశ్వాసకోశ సమస్య (ఎస్ఎఆర్ఐ) కేసుల సంఖ్య అసంఖ్యాకంగా పెరిగిన జాడ ఏదీలేదు. ఒక్కకరోనా వైరస్ మాత్రమే మానవాళిని ఇబ్బంది పెట్టింది. కోవిడ్ 19తో హెచ్‌ఎంపివిని పోల్చవద్దని అది పూర్తిగా కొత్త వైరస్ కనుక నిరోధక శక్తి లేని మానవుల ప్రాణాలతో ఆటలాడుకుని విజృంభించిందని ఢిల్లీ ఎయిమ్స్ ఇంటర్నల్ మెడిసిన్ అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ నీరజ్ నిశ్చల్ వివరించారు. తాజా హెచ్‌ఎంపివి వైరస్ గూర్చి చెప్పాల్సి వస్తే పదేళ్ల వయసు వచ్చేనాటికి చాలామంది హెచ్‌ఎంపివిని తట్టుకోగల రోగనిరోధక శక్తి అభివృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. దీనికి ప్రత్యేకించి వ్యాక్సిన్ లేకపోయినా కోవిడ్ వ్యాక్సిన్ మూడు డోసులు లేదా ఫ్లూ వ్యాక్సిన్ మూడు డోసులు లేదా ఫ్లూవాక్సిన్ గతంలో తీసుకుని ఉంటే హెచ్‌ఎంపివిని ఎదుర్కొనే రోగనిరోధక శక్తి దానంతటదే వృద్ధి చేసుకుంటుందని బెంగళూరు హెచ్‌సిజి హాస్పిటల్ ఆంకాల జిస్ట్ విశాల్ రోగులకు భరోసానిస్తున్నారు. కోవిడ్ విషాద ఛాయలనుంచి బయటపడక ముందే అంతకన్నా వేగంగా ప్రవేశిస్తున్న హెచ్‌ఎంపివి గురించి కంగారు పడే పరిస్థితి ఇప్పుడు భారతీయుల ఆందోళనకు కారణమైంది. అదీగాక చైనా నుంచి వస్తోందనగానే మరో ఆవేదన. 2001లోనే హ్యూమన్ మెటానిమో వైరస్(హెచ్‌ఎంపివి) ప్రస్తుతం డ్రాగన్ దేశాన్ని ఆందోళనలో ముంచెత్తుతోంది. ఈ వైరస్ వ్యాప్తి చాలా వేగవంతంగా ఉంటుందని, దగ్గుతో వచ్చే తుంపర్లు చాలా ప్రమాదకారియని సబ్బుతో కనీసం 20 సెకండ్లపాటు చేతులు శుభ్రపరుచుకోవాలని తొలి సూచన తప్పక పాటించాలని వైద్య నిపుణులు చెప్పడం చూస్తేమళ్లీ మాస్క్ ధరించడం తప్పని సరిగా అనిపిస్తోంది. గతంలో కోవిడ్ సమయంలో దాని తీవ్రత గుర్తించినా జాగ్రత్తలు పాటించడంలో కాస్త జాప్యం జరిగిందన్నది అందరూ అంగీకరించే విషయమే. లేదు లేదంటూనే కొత్త వైరస్ ఇద్దరికీ సోకింది. నాగ్‌పూర్‌లో రెండు, బెంగుళూరు, గుజరాత్, ఢిల్లీలలో ఒక్కొక్కరికి వెరశి ఇలా మొత్తం ఏడుగురు ఈ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రభుత్వాలు అప్రమత్తమౌతున్న తరుణంలో కేంద్ర ప్రభు



త్వం మార్గదర్శకాలను సూచించింది. వీటిలో ప్రధానంగా 15 సంవత్సరాల లోపు పిల్లలు, వృద్ధులు దీర్ఘకాలిక రోగులు అప్రమత్తంగా ఉండాలి. శ్వాసకోస సంబంధిత ఇన్‌ఫెక్షన్ల నుంచి మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. వేగంగా వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. అయినా కోవిడ్ అనుభవాలతో జనం తల్లడిల్లిపోతున్నారు. కేవలం దగ్గు, జ్వరం, ముక్కుదిబ్బడంగా ఉండడం సాధారణంగా ఇప్పుడున్న శీతల వాతావరణానికి ఉండే లక్షణాలే. కొత్త వైరస్‌కు కూడా ఇవే లక్షణాలు చెబుతున్నందున, ప్రచార మాధ్యమాల్లో గమనిస్తున్న యావత్ ప్రజానీకం తమ ఆరోగ్యం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఈ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో చలిగాలులకు దూరంగా ఉండడం, దూరప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిదనే సూచనలు కూడా వినవస్తున్నాయి. ఇంత విస్తృతంగా వ్యాప్తి చెందబోతుందన్న అంచనాలున్నా కూడా ఇది మామూలు వైరస్సే కనుకభయపడాల్సిన అవసరమేమి లేదని ఐసి ఎంఆర్ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ రామన్ గంగా ఖేడ్కర్ ఊరట కలిగించే మాటలు చెబుతున్నారు. కాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ మాత్రం మరో జన్యు పరివర్తన జరిగిందని నమ్మబలుకుతోంది. దీని వలన ఏ మేరకు ప్రజారోగ్యం కలిగిస్తుందో స్పష్టంగా ఎవరూ చెప్పలేకున్నా వారి వారి మాటల్లో నర్మగర్భంగా దాగివున్న ఆందోళనలు గురించి విశ్లేషించడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. గతంలో కోవిడ్ సమయంలో ఇదే జరిగింది. చివరకు ప్రాణాంతకమైంది. ఆనాటి చేదు అనుభవాలు దేశ ప్రజల్ని వెన్నాడుతూనే ఉన్నాయి. హ్యూమన్ మెటానిమో వైరస్ గతంలో మానవాళికి పరిచయమున్న వైరస్సేనని, ప్రపంచ వ్యాప్తంగా పిల్లల్లో సంభవించే శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లలో 12శాతం ఇలాంటివేనని, డాక్టర్లు వివరిస్తున్నారు. ఈ వైరస్ రెస్పిరేల్ వైరస్‌ను పోలి ఉంటుందని నిర్ధారించారు. కాగా చైనాలో ఎంతో మంది ఆసుపత్రుల పాలయ్యారన్న వార్తల నేపథ్యంలో భారత్‌లోనూ ఆసుపత్రులన్నీ సిద్ధమైపోయాయి. ఈ వైరస్ వ్యాప్తి గురించి ఎలాంటి సమాచారం వస్తుందోనని జనమంతా వేచి చూస్తున్నారు. విశేషమేమిటంటే ఈ వైరస్‌పట్ల వైద్య సమాజంలోనూ కలకలం ఉన్నందున తెలంగాణలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ 'నమస్కారం ముద్దు -హ్యాండేషేక్ వద్దు' అనే నినాదంతో ఈ వైరస్ పట్ల అప్రమత్తం చేసే ఆలోచనలో ఉంది. వైరస్ తీవ్రత ఎక్కువైతే బ్రాంకైటిస్, నమోనియాకు దారి తీస్తుందని ఇవి సోకినా కూడా శ్వాసకోస రోగులు బాగా ఇబ్బంది పడతారన్న విషయం తెలిసిందే. శ్వాసకోశ రోగాలైనా న్యూమోనియా వంటి జబ్బులైనా వాటి బారిన పడి ఊపిరాడక తనువు చాలించనివారు లేకపోలేదు. అందుకే శ్వాసకు సంబంధించి వైద్యం ఏ మేరకు మనిషిని బతికిస్తుందోనని భయాందోళనలు వ్యక్తం చేసే పరిస్థితులు తలెత్తాయి. ఐదేళ్ల క్రితం కరోనా బారినపడి ఎంతో మంది మరణించారు. కాని ఆనాడు బతికి బయటపడ్డవారు కూడా అనంతర కాలంలో హృద్రోగం వల్లనో, మరెందు చేతనో మరణించారన్న సమాచారం వినని విన్నాము. శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధుల బారిన పడడం సహజమే అయినప్పటికీ రోగనిరోధకత తక్కువగా ఉండేపిల్లలు, వృద్ధులను చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. కోవిడ్ సోకిన సమయంలో జాగ్రత్తలు పాటించడంలో జాప్యం, కొంతలో కొంత నిర్లక్ష్యం, ఆనక ప్రాణభయం కారణంగా లక్షలాది మంది కరోనా వ్యాధిగ్రస్తులయ్యారు. పుష్కర కాలం నాడే హెచ్‌ఎంపివిని కనిపెట్టినా ఇప్పటికీ దాని నిరోధానికి, నయం చేయడానికి కానీ వాక్సిన్ కనిపెట్టలేకపోవడం తీరా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందన ప్రభుత్వ ఉదాసీనత వైఖరి కనపడుతోంది. హెచ్‌ఎంపివి చైనా వైరస్ కానేకాదని స్పష్టమైంది. కనుక కాస్తంత ఊరట. అంతే తప్ప ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా అనారోగ్య సమస్యలే. ఇదిలాఉండగా చైనా వైరస్ హెచ్‌ఎంపివి కేసుల గుబులు ఆసియా మార్కెట్లకు తాకింది. మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, విదేశీమదుపరుల అమ్మకాల సూచీలను ఒక్కసారిగా నేల చూపులు చూసాయి. సూచీలపతనం ప్రారంభమైంది. మార్కెట్ విలువ దాదాపు రూ.12 లక్షల కోట్ల మేర క్షీణించింది. జనవరి 12నుంచి జరిగే కుంభమేళాకు 40కోట్ల మంది భక్తులు, యాత్రికులు రాగలరని అంచనా. అటువంటి పరిస్థితుల్లో జనం ఎక్కడ గుమికూడడం, జలకాలుష్యం వలన ఇలాంటి వైరస్‌లు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వానిదే. ●

# మానవాళిని ఏకం చేసే ప్రధాన సాధనం భాష

బి.మధుపాళి

హిందీ భాష ఒక్క హిందుస్థాన్‌కే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా 610 మిలియన్ల ప్రజలు మాట్లాడుతున్నారు. ఇంగ్లీష్ (1,456 మిలియన్లు), మాండరిన్ చైనీస్ (1,138 మిలియన్లు) తర్వాత అందరూ మాట్లాడే 'ప్రపంచ భాష'గా హిందీకి ప్రత్యేకత ఉన్నది. హిందీ భాష వ్యాప్తిలో సినిమా పాత్ర వెలకట్టలేనిది. ప్రపంచంలోనే అతి పెద్ద బాలీవుడ్ ఫిలిమ్ ఇండస్ట్రీ విడుదల చేస్తున్న హిందీ సినిమాలతో ప్రపంచ దేశాలన్నింటిలో హిందీ విస్తృత ప్రచారం, ఆదరణ, మక్కువ క్రమంగా పెరుగుతున్నది. తొలిసారిగా 10 జనవరి 1975న హిందీభాష ప్రాధాన్యం, మాధుర్యాలు, భాషాభిమానాల ఏకీకరణ, ప్రముఖ రచయితల ప్రస్తావనల లక్ష్యాలతో కూడిన "ప్రపంచ హిందీ మహాసభలు పెద్ద ఎత్తున విజయవంతంగా నిర్వహించారు. ఈ రోజుకు గుర్తుగా 2006 నుంచి ప్రతి ఏటా 10 జనవరిన "ప్రపంచ హిందీ దినోత్సవం లేదా విశ్వ హిందీ దివస్" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ హిందీ దినం సందర్భంగా హిందీ భాషమాట్లాడడం, రచనలు, సాహిత్యం, హిందీ భాషను మాట్లాడే ప్రపంచ మానవాళిని ఏకం చేయడం, సంస్కృతులను ప్రచారం చేయడానికి ఈ వేదికలను ఉపయోగిస్తున్నారు. అంతర్జాతీయ వేదికల్లో హిందీ భాషకు పట్టం కట్టడం, సాహిత్య వారసత్వాల పరిరక్షణ, విద్యాలయాల్లో హిందీ భాష బోధనలను ప్రోత్సహించడం, హిందీ అందాన్ని ఆదరణను తీసుకు వచ్చిన సాహితీవేత్తలను సముచితంగా గౌరవించడం ఈవేదికలో విధిగాజరగాలి. ప్రపంచ హిందీ దినం2025 థీమ్‌గా ఏకత, సాంస్కృతిక ఆత్మగౌరవ ప్రపంచ గొంతుకహిందీ"అనబడే అంశాన్ని తీసు





కొని ప్రచారం చేస్తున్నారు. డిజిటల్ అంతర్జాల సాంకేతిక ప్రపంచ ఏకీకరణలో హిందీకూడా ప్రధాన భూమిక నిర్వహించే విధంగా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని భాషాభిమానులు కోరుకుంటున్నారు. సంస్కృత భాష నుండి జనించిన ఇండో ఆర్యన్ భాషగానే కాకుండా ఇండోయూరోపియన్ భాషగా కూడా హిందీకి పేరుంది. ఈ కారణంగానే యూరోపియన్ భాషలతో, ముఖ్యంగా ఆంగ్లభాషతో హిందీకి పలు సారూప్యతలు కనిపిస్తాయి. భారత దేశంలో అధికారిక భాషగా హిందీకి ప్రత్యేకస్థానం ఇవ్వబడింది. మన దేశంలో 345మిలియన్ల ప్రజలు హిందీమాట్లాడితే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 610 మిలియన్ల జనులు హిందీభాషలో సంభాషిస్తున్నారు. ఆసియాఖండంలో అధిక జనులు హిందీ మాట్లాడుతుండగా దక్షిణ ఆఫ్రికా, అమెరికా, ఫిజీ, మారిషస్, బంగ్లాదేశ్, యెమన్, ఉగాండా లాంటి దేశాల్లో కూడా భాషపోషణ కనిపిస్తుంది. నేడు మేధో వలసలు పెరగడంతో ప్రపంచ దేశాలకు కూడా హిందీవిస్తరించడం క్రమంగా పెరుగుతున్నది. దేవనగరి లిపిలో ప్రకటించే హిందీకి మృదుభాషగా కీర్తిఉన్నది. ఉత్తరభారతంలోని రాష్ట్రాల ప్రజలు హిందీ భాషను అధికంగా వినియోగిస్తున్నారు. 14సెప్టెంబర్ 1949 రోజున హిందీని అధికారిక భారత భాషగా తీర్మానించిన కారణంగా 14సెప్టెంబర్ రోజున జాతీయ హిందీ దినం కూడా ప్రతి ఏటానిర్వహించుకుంటున్నారు. హిందీభాషను విశ్వవ్యాప్తంగా ప్రచారం చేయడం, హిందీభాష సంస్కృతులను కాపాడడం, విద్యాపరంగా ప్రోత్సహించడం, భాషను కాపాడుకోవడం, సాంస్కృతిక వినియమ మాధ్యమాల, అంతర్జాతీయ ఏకీకరణ సాధనంగా వినియోగించడానికి ప్రతిఒక్క భాషాభిమాని కృషిచేయాలి. హిందీభాష విద్యాబోధనలు, సాంస్కృతిక వేడుకలు, ప్రచార మాధ్యమాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించే వేదికగా ఉపయోగపడాలి. ●

# భారత్‌ను పీడిస్తున్న రుణభారం, రూపాయి పతనం



మేకిరి దామోదర్

మన దేశం రుణభారంలో కూరుకపోవడంతో ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. సంపన్న, పెట్టుబడిదారి దేశాలు లాభార్జనే ధ్యేయంగా పెట్టుబడి పెడుతున్నవేళ, రుణభారం నానాటికీ కొండగా పెరిగిపోతోంది. పాలకులకు ముందుచూపు ఆర్థిక క్రమశిక్షణ లేని విధానాలు అవలంభించడంతో మన దేశంలోని పెట్టుబడులకు భద్రత కరువవుతుందని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు భావిస్తున్నా దరిమిలా పెట్టుబడులు ఇతర దేశాలకు తరలిపోతాయి. అప్పుల ఊబిలో చిక్కుకున్న దేశంలో వాటికి వడ్డీలకే సర్కారీ ఆదాయం కరిగిపోతుంది. అభివృద్ధి అనేది అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది. ఇలాంటి విధానాల మూలంగానే సమాజంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. ఒక్కశాతం జనాభా చేతిలోనే దేశ ఆర్థిక సంపద కేంద్రీకృతం అవుతుంది. దీనితో సమ్మిళిత అభివృద్ధి అనేది సాధ్యం కావడం లేదు. మన ప్రజాస్వామ్య దేశంలో ఐదేళ్లకు ఓసారి ఎన్నికల్లో అధికారం చేపట్టడానికి దేశం, రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితులపై అవగాహన లేకుండా పార్టీలు అమలు చేయలేని హామీలను ఇస్తుంటారు. ఆ తర్వాత వాటి అమలుకు అప్పులు చేసే కాలం గడిపేస్తారు. ఇలాంటి ప్రభుత్వాల విధానాలతో అప్పులు పెరిగిపోతున్నాయి. వాటి వడ్డీలకు మళ్లీ అప్పులు చేస్తున్నారు. అంతర్జాతీయ ఆర్థిక పరపతి తగ్గిపోతుంది. అప్పులు, పెట్టుబడులు పుట్టని తీరుకు దారితీస్తుంది. ఆమేరకు 2025 మార్చి కల్లా మొత్తం రుణభారం రూ,181.6 లక్షల కోట్లకు చేరుతుందన్న అంచనాలు ఉన్నాయి. భారతదేశంలో ప్రభుత్వం చేసిన అప్పుల్లో 67శాతం కేంద్రం ఖాతాలోనిదే. మిగిలింది రాష్ట్రాలు చేసినవి. దేశం, రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణ, బడ్జెట్ నిర్వహణ నిబంధనలు విస్మరిస్తూ ఆర్థిక నిపుణుల సూచనలు పాటించకుండా మరీ పరిమితికి మించి అప్పులు చేస్తున్నాయి. ఇలా తెలుగు రాష్ట్రాల్లో గత ప్రభుత్వాలు చేసిన అప్పులు గుదిబండగా మారాయి. మరోవైపు ఆదాయం మెరుగు కాకపోవడంతో సంక్షేమ పథకాల అమలు కోసం తరచూ అప్పులు చేయవలసి వస్తుంది. కేంద్రం, రాష్ట్రా ప్రభుత్వాలు ఖర్చులు (దుబారాను)తగ్గించుకొని ఆదాయం పెంచే మార్గాలను చిత్తశుద్ధితో అమలు చేయాలి. సంపన్న, పెట్టుబడిదారుల సంపదపై అదనపు పన్నులు వేసి, పనుల ఎగవేతను కఠినంగా అరికట్టాలి. ఆర్థిక క్రమశిక్షణ పాటించక, ఆర్థిక నిపుణుల సూచనలను లెక్కచేయని పొరుగు దేశాలైన పాకిస్థాన్, శ్రీలంక దేశాల్లోని దుర్భర పరిస్థితి నుంచి గుణ



పాఠం నేర్చుకోవాలి. లేదంటే? దేశం ఆర్థిక విపత్తును (సంక్షోభాన్ని)ఎదుర్కోవాల్సి వస్తుంది. అధికారమే ధ్యేయంగా దేశ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణలోకి తీసుకోకుండా, ఆర్థిక నిపుణుల సూచనలు పాటించకుండా ఇలానే ప్రభుత్వాలు పాలనా విధానాలు కొనసాగితే ఆర్థిక ఎమర్జెన్సీకి దారితీస్తుంది. ఆ తర్వాత ఎన్ని ప్రయత్నాలు చేసిన మరణానంతరం మందు (ఔషధం) ఇవ్వడం లాంటిదే అవుతుంది. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్లో రూపాయి విలువ భారత కరెన్సీ చరిత్రలోనే అత్యంత కనిష్ట (క్షీణ) దశకు పతనమవుతోంది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే 85.79 కనిష్ట స్థాయికి దిగజారింది. 'రూపాయి పతనం గత పది ఏళ్లలో మారకపు విలువ ఎంతగా తగ్గిందంటే? ఇలా.. 2015లో 66.15, 2016లో 67.93, 2017లో 63.87, 2018లో69.77 2019లో 71.38, 2020లో73.07, 2021లో 74.34 2022లో 82.74, 2023లో 83.21 2024లో 84.70 డిసెంబర్ 3దాకా. ఆధారం లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు. రూపాయి పతనానికి కారణాలు ఎగుమతులకన్నా దిగుమతులు ఎక్కువగా ఉండడం, కరెంటు ఖాతా లోటు, ముడి చమురు ధరలు పెరుగుదల తదితర అంతర్జాతీయ దేశీయంగా, ఆర్థిక క్రమశిక్షణ లేమి, దుబారా పెరిగిపోవడం, ఎగుమతులు పెంచి, దిగుబతులు తగ్గించుకోవడంలో పాలన విధానంలో చిత్తశుద్ధి లేకపోవడం లాంటి తదితర విధానాల మూలంగా రూపాయి పతనానికి దారితీస్తుంది. మన దేశ జనాభాలో 60శాతం 35ఏళ్ల లోపువారే. ఈ యువశక్తిని జనాభాలో సగభాగమైన మహిళా శక్తిని నిపుణ వనరులుగా తీర్చిదిద్ది ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించబడాలి. అలా దేశ ఉత్పాదక శక్తి పెంచుకోవడంవల్ల ప్రగతికి దారులు పడతాయి. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతుందన్న సర్కారీ ప్రచారంతోడు జీడీపీ మెరుపులకు సమాంతరంగా జనం బతుకుల్లో వెలుగులు నింపాలి. అంటే ఉపాధి సహిత అభివృద్ధి జరగాలి. మన దేశం వ్యవసాయ ఆధారిత జనాభా 60శాతంకు పైగా ఉంటారు. అందువల్ల వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో సంపన్న దేశాలతో పోటీపడి అభివృద్ధిని సాధించాలి. అతి ప్రధానంగా దిగుమతులపై దృష్టిసారించి, ఆయా దిగుమతుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించి ఎగుమతులు చేసే స్థాయికి చేరుకునే విధానాలు రూపొందించాలి. మన దేశంలో అవినీతి, నిర్లక్ష్యం సమూలంగా నిర్మూలించబడాలి. దేశ సంపద గుప్పెడు మంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా చేస్తూ, సమంగా పంచబడినప్పుడే సమ్మిళిత ప్రగతి సాధ్యపడుతుంది. అలాంటి చిత్తశుద్ధితో కూడిన విధానాలు అమలు చేయాలి. ప్రజాస్వామ్య దేశంలో బహుళ పార్టీల పాలన విధానం లో అధికార దాహంతో దేశ ఆర్థిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా ఓటుబ్యాంకు పథకాలకు చరమగీతం పాడాలి. ప్రపంచంలోనే అతి గొప్ప ప్రజాస్వామ్యం దేశంగా వెలుగొందుతున్న వేళ ఆ కీర్తికి కళంకం రాకుండా సమ్మిళిత అభివృద్ధికి పాటుపడండి. ●

# యుద్ధంతోకాదు బౌద్ధంతోనే భవిష్యత్తు

## ఒడిశా ప్రవాసీ దివస్‌లో ప్రధానిమోడీ




**భువనేశ్వర్, జనవరి 9:** మానవాళి భవిష్యత్తు యుద్ధంలో లేదని బుద్ధుడిలో ఉందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. గురువారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరుగుతున్న 18వ ప్రవాస భారతీయ దినోత్సవకార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఒడిశాలో అడుగడుగునా సంస్కృతి సాంప్రదాయాల వారసత్వం కనిపిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడినుంచి వ్యాపారులు సుమత్రా, బాలి, జావా వంటి ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసేవారని గుర్తుచేసారు. భారత్‌ప్రజాస్వామ్యానికికేవలం తల్లి వంటిది మాత్రమే కాదని మన జీవితాల్లో భాగం అన్నారు. విదేశాల్లో జీవించేవారు భారత్‌కు రాయబారులుగా నేనుచూస్తానని, భారత్‌నుంచి యువత పూర్తి నైపుణ్యాలతో విదేశాలకు వెళ్లేలాచేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. జీ20 సందర్భంగా దేశవ్యాప్తంగా సదస్సులు నిర్వహించి భారత్ వైవిధ్యాన్ని ప్రపంచానికి తెలియజేసామని మన వారసత్వ విభిన్న సంస్కృతులను ప్రపంచం గమనిస్తోందని భారత్‌స్వాతంత్ర్యం సాధించడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులుకూడా తోడ్పాటునిచ్చారని మోడీ అన్నారు. వచ్చే ఏడాది ప్రవాసీ దివస్‌కు వచ్చే భారతీయులు కనీసం ఐదుగురు విదేశీ మిత్రులను తమతో తీసుకురావాలని, భారత్‌కేవలం యువదేశమే కాదు నిపుణులైన యువకుల దేశం అని భారత్‌కు విశ్వబంధుగా గుర్తింపు ఉందన్నారు. దానిని మరింత బలోపేతం చేయాలని ప్రధానిమోడీ ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు.

మహాకుంభ్, సంక్రాంతి, లోహిర్, మాగ్ బిహు వంటి పండుగల సీజన్‌లోప్రవాస భారతీయ వేడుకలు జరగడం సంతోషంగా ఉంద న్నారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షురాలు క్రిస్టీనే కార్ల్ విడియోసందేశం పంపించారు. ఆమె భారత్‌పురోగతిని కొనియాడారు. రష్యా, ఇజ్రాయెల్ పేర్లను ప్రస్తావించకుండా భవిష్యత్తు అంతా యుద్ధం కాదని బుద్ధుడిబోధనలతోనే శాంతి సామరస్య ప్రపంచం ఏర్పడుతుందని ప్రధాని అన్నారు. అశోకుడు ఖడ్గంతో సామ్రాజ్య విస్తరణకు అవకాశం ఉన్నా బౌద్ధం స్వీకరించారని గుర్తుచేసారు. మోడీ ప్రవాసిభారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును భువనేశ్వర్‌లో జెండా ఊపి ప్రారంభించారు. విదేశాంగమంత్రి జైశంకర్, ఒడిశా సీఎం మోహన్‌చరణ్‌మాఝీ తదితరులు పాల్గొన్నారు.



## భారత్ ప్రజాస్వామ్య విలువలు విశ్వసిస్తున్న బ్రిటన్

### లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

**లండన్, జనవరి 9:** భారత దేశప్రజాస్వామ్య విలువలను, అభివృద్ధిని యుకే బలంగా విశ్వసిస్తోందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. యూకే పర్యటనకువెళ్లిన ఆయన లండన్‌లోని హైకమిషన్‌లో జరిగిన సమావేశంలో ప్రవాస భారతీయులనుద్దేశించి ప్రసంగించారు. ప్రముఖ యుకె పార్లమెంటేరియన్లతో సంభాషించారు. వారికి భారత ప్రజాస్వామ్య విలువలు వృద్ధిపై వలమైన నమ్మకం ఉంది. ఇటీవల భారత్‌లో జరిగిన ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని మరింత బలోపేతంచేసేందుకు దోహదంచేసిందని అన్నారు. ప్రపంచంలోని అతిపెద్దప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారత్‌ను ప్రజాస్వామ్య మాతృమూర్తిగా కీర్తిస్తున్నందుకు గర్వంగా ఉందని అన్నారు.రానున్న రోజుల్లో అభివృద్ధిలో భారత్ ఇతర దేశాలను అధిగమిస్తుందని,ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న భారతీయులు వికసిత్ భారత్‌కోసం సహకారం అందిస్తున్నారన్నారు. ప్రధానిమోడీ నిర్దేశించిన ఈ లక్ష్యం దిశగాప్రవాసులుచేస్తున్న కృషి కీలక పాత్రపోషిస్తుందన్నారు. యుకెభారత్ ద్వైపాక్షిక సంబందాలు మరింత బలోపేతం కావాలని ఓం బిర్లా అన్నారు. సుమారు 17 ఏళ్లతర్వాత లోక్ సభ స్పీకర్ యునైటెడ్ కింగ్‌డమ్‌లోపర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనలోభాగంగా యుకె హౌస్‌ఆఫ్‌కామన్స్ స్పీకర్ లిండ్సే హోయ్‌లతో ఆయన సమావేశం అయి చర్చలుజరిపారు.



## మా 'ఎమర్జెన్సీ' సినిమా చూడాలని ప్రియాంకను కోరా..

### నటి కంగనా రనౌత్

**న్యూఢిల్లీ, జనవరి 9:** కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలో తాను గమనించిన విషయాలను కంగనా రనౌత్ వెల్లడించారు. తాను నటించిన ఎమర్జెన్సీ చిత్రాన్ని వీక్షించాలని ఈ ఇద్దరు నేతలను కంగన కలిసిన సంగతి తెలిసిందే. తొలినుంచి రాహుల్‌గాంధీని కంగన విమర్శిస్తూనే ఉన్నారు. ఇక తన సినిమాను వీక్షించేందుకు రాహుల్‌ను ఆహ్వానించేందుకు వెళ్లగా ఆయన అంత మర్యాదగా వ్యవహరించలేదని వ్యాఖ్యానిం చారు. అదే ప్రియాంక విషయంలో మాత్రం భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆమె చిరునవ్వుతో పలకరించి మాట్లాడారు. ఆ సంభాషణ నాకు గుర్తుండిపోతుంది. ఆమె తన సోదరుడిలా కాదు. తెలివైనది. ప్రియాంకతో మాట్లాడటాన్ని నేను ఎంజాయ్ చేశాను అని మీడియాతో మాట్లాడారు. ఇంతకుముందు కూడా ఇదే విషయమై కంగన మాట్లాడిన సంగతి తెలిసిందే. పార్లమెంట్‌లో ప్రియాంకని కలిసినప్పుడు మా ఎమర్జెన్సీ చిత్రాన్ని తప్పకుండా వీక్షించాలని కోరగా, ప్రయత్నిస్తానని ఆమె బదులిచ్చారు. ఈ సినిమా ఆమెకు తప్పకుండా నచ్చుతుందని తెలియజేశా. ఎమర్జెన్సీ అనేది ఎంతో సున్నితమైన అంశం. ఇందిరాగాంధీ పాత్రను ఎంతో మర్యాదపూర్వకంగా చూపించా. రీసెర్చ్ సమయంలో ఎన్నో విషయాలు గ్రహించా. ఇందిరాగాంధీకి తన భర్త, పిల్లలు, స్నేహితులతో ఉన్న అనుబంధం గురించి తెలుసుకున్నా. శత్రువులతో ఎలా వ్యవహరించేవారో అర్థం చేసుకున్నా. ఆ విషయాలను ఎక్కడా టచ్ చేయకుండా ఉండేందుకు కావాల్సిని అన్న జాగ్రత్తలు తీసుకున్నా అని కంగనా తెలిపారు. తాజాగా ఆ పార్లమెంట్ సంభాషణే మరోసారి ప్రస్తావించారు. ఎమర్జెన్సీ చిత్రాన్ని థియేటర్‌లో విడుదల చేయాలనుకోవడం తన పొరపాటని, డైరెక్ట్‌గా ఓటిటిలో విడుదల చేసుంటే పరిస్థితి మరోలా ఉండేదని కంగనా అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం ఎమర్జెన్సీ. కంగనా రనౌత్ కథానాయిక. అనుపమ్ ఖేర్, మహిమా చౌదరి కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో తమని తక్కువగా చూపించారని విడుదలను అడ్డుకోవాలని ఒక వర్గం మధ్యప్రదేశ్ న్యాయస్థానాన్ని సంప్రదించింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు వారి వాదనలను పరిగణనలోకి తీసుకోవాలని సెన్సార్ బోర్డుకు సూచించింది.

## ఇండియా కూటమిని మూసేయడం మేలు!

### జమ్ముకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా



**న్యూఢిల్లీ, జనవరి 9:** అజెండాలో స్పష్టతలేని విధంగా ఎవరికివారు వ్యవహరిస్తున్నట్లయితే ఇండియా కూటమిని రద్దుచేయడం మేలు అని జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై మీడియా సంధించిన ప్రశ్నలపై ఆయన జవాబిస్తూ ఢిల్లీ ఎన్నికల్లో ముక్కోణపు పోటీ ఉన్నదని ఆసక్తికరంగా ఆప్ కాంగ్రెస్ పార్టీలు గత లోక్‌సభ ఎన్నికలకు టై అప్ పెట్టుకున్నాయని, అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఎవరికి వారు పోటీచేస్తున్నారని అన్నారు. ఇలాంటి పరిణామాల్లో అసలు ఇండియా కూటమి దేనికున్నట్లు రద్దుచేయడమే మేలని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీ ఎన్నికలకు సంబంధించి నాపాత్ర ఏమీ ఉండదని, ఆప్ కాంగ్రెస్ ఇతర పార్టీలు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్నాయని బిజెపిని తుదముట్టించే ప్రక్రియలో ఇండియా కూటమి ఢిల్లీలో కీలక పాత్రలో లేదనే తెలుస్తోందని అన్నారు. దురదృష్టంకొద్దీ ఇండియా కూటమి నిర్వహించినా నాయకత్వం,అ జెండా మనుగడపై ఎలాంటి స్పష్టత లేదని కేవలం పార్లమెంటు ఎన్నికల కోసమే అయితే ఆ కూటమిని రద్దుచేయడం మేలు అని ఒమర్ వ్యాఖ్యలుచేసారు. గడచిన కొన్ని వారాలుగా ఆప్ కాంగ్రెస్‌లు ఒకరిపై ఒకరు విమర్శలుచేసుకుంటున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ నాయకులు అరవింద్ కేజ్రీవాల్ పార్టీ అవినీతి, అధ్వాన్నపరిపాలనతో కొనసాగుతోందని విమర్శిస్తే ఆప్ కాంగ్రెస్ బిజెపిచేతిలో పావుగా మారిందని విమర్శించింది. ఇండియా కూటమి నాయకత్వం భవిష్యత్తుపై ఇపుడు తీవ్ర స్థాయిలో సందిగ్ధత నెలకన్నదని సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి కార్యకలాపాలు పూర్తిగా స్పష్టత లేకుండా పోయాయని ఒమర్ అన్నారు. ప్రధాన ప్రతిపక్షం మాత్రమే ఇండియా కూటమికి నేతృత్వం వహించాలని, టిఎంసి నాయకురాలు మమతా బెనర్జీ ఇప్పటికే స్వచ్ఛందంగా ఆఫర్ ఇచ్చినందున కూటమిలోని ఎక్కువ పార్టీలు ఆమెకే మద్దతు పలికినందున ఆమెకు అవకావం ఇవ్వాలన్న డిమాండ్‌కూడా వచ్చింది. ఒమర్ కూడా ఆమెకే వత్తాసుపలికారు. అంతకుముందు అబ్దుల్లా మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకత్వం తమకే ఉండాలన్న మంకుపట్టుతో ఉండకూడదని అన్నారు. పార్లమెంటులో ఏకైక అతిపెద్ద పార్టీగా ఉన్నందున రాజ్యసభ, లోక్ సభల్లో కూడా ప్రతిపక్ష నేత బాధ్యతలు కూడా స్వీకరిస్తున్నందున కూటమికివేరొకరి నాయకత్వం అవసరం అవుతుందని, స్వచ్ఛందంగా మరొకరికి పదవిని అప్పగించడమే సముచితమని ఆయన అన్నారు. ఢిల్లీఎన్నికల్లోనే కూటమి వైఖరి స్పష్టం అవుతున్నందున ఏది ఎలాసాగాలో అలా సాగుతుందని భావించడంకంటే కూటమిని రద్దుచేయడమేమేలని, పార్లమెంటు ఎన్నికలవరకే పరిమితమా లేక కొనసాగుతుందా అన్నది స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఒమర్ అన్నారు.

## కోటలో ఆగని విద్యార్థుల ఆత్మహత్యలు

### తాజాగా ఎంపికి చెందిన గుణ విద్యార్థి గదిలో ఆత్మహత్య

### పరీక్షల ఒత్తిడే ఆత్మహత్యలకు కారణమంటున్న పోలీసులు

**కోట(రాజస్థాన్), జనవరి 9:** కోచింగ్ కేంద్రాల హబ్‌గా నిలిచిన రాజస్థాన్‌లోని కోటలో మరో 20 ఏళ్ల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. జెఇఇకి సన్నద్ధం అయ్యేందుకు వచ్చిన ఈ విద్యార్థి తన గదిలోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. రెండురోజుల ముందే జెఇఇ అభ్యర్థి మరొకరు 19 ఏళ్ల విద్యార్థి హాస్టల్ గదిలోనే ఉరివేసుకుని చనిపోయినట్లు తేల్చారు. 20 ఏళ్ల అభిషేక్ లోధా తనవద్ద ఒక లేఖను ఉంచి మరీ చనిపోయాడు. జెఇఇని తాను క్లియర్ చేయలేనని ఆలేఖలో తననిస్సహాయతను వ్యక్తం చేసాడు. దేశంలోని టాప్ ఇంజినీరింగ్ కళాశాలల్లో చదవాలంటే జెఇఇని క్లియర్‌చేసుకోవాలన్నది తెలిసిందే. తాను చదవలేకపోతున్నానని, జెఇఇ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నా తన వల్ల కావడంలేదని సారీఅని ఆ నోట్‌లో స్పష్టంచేసాడు. మధ్యప్రదేశ్‌లోని గుణ ప్రాంతా నికి చెందిన లోథా గత మేనెలలోనే జెఇఇకి సిద్ధం అయ్యేందుకు వచ్చాడు. చదువుపరంగా టాపర్ అయిన లోథా తనంతతానే కోటకు కోచింగ్‌కోసం వచ్చాడని చాలా బాగుందని, తాను నిరంతరం శ్రమిస్తున్నానని చెప్పేవాడని ముందు రోజు సాయంత్రమే తాను వాడితో మాట్లాడానని లోథా మేనమామ చెప్పాడు. పరీక్షల ఒత్తిడికి తట్టుకోలేకనే ఆత్మహత్యచేసుకున్నట్లుగా పోలీసులు కూడా అనుమానిస్తున్నారు. పిజి అకామిడేషన్ రూమ్‌లలో యాంటిహ్యాంగింగ్ ఫరికరాలను ఫ్యాన్‌కు అమర్చలేదని ఇదేవిషయమై యాజమాన్యాన్ని కూడా పిలుస్తున్నట్లు విజ్ఞాన్‌నగర్ ఇన్‌ఛార్జి ముకేష్ మీనా అన్నారు. అలాగే హర్యానాలోని మహేంద్రఘర్‌కు చెందిన నీరజ్ అనే విద్యార్థికూడా గదిలోని సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయాడు. అందువల్లనే యాంటి హ్యాంగింగ్ డివైస్‌లు ఏర్పాటుచేయాలనిముందే చెప్పామని ఎస్‌హెచ్‌ఓ చెపుతున్నారు. నీరజ్ తండ్రి బబ్లూప్రజాపత్ మాట్లాడుతూ మధ్యాహ్నమే తనకొడుకుతో మాట్లాడానని సాయంత్రం ట్రైన్‌కు వస్తానని కూడా నీరజ్ చెప్పాడని తన చిన్నకొడుకు కూడా నీట్ సన్నద్ధంకోసం కోటలోనే ఉన్నాడని ఆతడు మెడికల్ ఎంట్రన్స్‌కోసం చదువుతున్నట్లు చెప్పాడు. కేసులో నిష్పాక్షిక విచారణ చేయాలని ప్రజాపత్ డిమాండ్‌చేసారు.

## ఢిల్లీ జాట్‌లను కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చాల్సిందే: కేజ్రీవాల్ డిమాండ్

**న్యూఢిల్లీ, జనవరి 9:** ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న కొద్దీ రాజకీయపార్టీలు పలు డిమాండ్లు పెడుతున్నాయి. పలు హామీలు కూడా కుమ్మరిస్తున్నాయి. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ గురువారం తన ప్రచారంలో భాగంగా ఢిల్లీలో నివసిస్తున్న జాట్ కులస్తులకు రిజర్వేషన్ అమలుచేయాలని కేంద్రం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్‌చేసారు. ప్రధాని మోడీకి ఇదే విషయమై లేఖను రాస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ఒబిసి కులాల జాబితాలో ఢిల్లీ జాట్‌కులాన్ని కూడా చేర్చాలని ఆయన డిమాండ్ చేసారు. 2015లో బిజెపి జాట్ నేతలను ప్రధానినివాసానికి పిలిపించుకుని వారిని ఒబిసి జాబితాలో చేరుస్తామని కూడా హామీ ఇచ్చారని గుర్తుచేసారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇదే మాటను 2019నుంచి చెపుతూనే వస్తున్నారని ఇప్పటివరకూ ఎలాంటి హామీ నిలబెట్టుకోలేదని అన్నారు. రాజస్థాన్‌లోని జాట్ విద్యార్థులు రిజర్వేషన్లనుంచి లబ్ధిపొందుతున్నారని, ఢిల్లీలో ఉన్న జాట్ విద్యార్థులు మాత్రం లబ్ధిపొందలేకపోతున్నారన్నారు. వేలాదిగా ఢిల్లీలోని జాట్ పిల్లలు ఢిల్లీయూనివర్సిటీలో అడ్మిషన్ పొందలేకపోతున్నారని, ఇతర రాష్ట్రాల్లో ఒబిసి కేటగిరీ కింద లబ్ధిపొందుతున్నవిద్యార్థులు అదే ఢిల్లీలోని జాట్ విద్యార్థులకు మాత్రం కేంద్రం తిరస్కరిస్తోందని ఆరోపించారు.

## ఇంటికి ఆహ్వానించి తాళం చెవి మరిచిన మహిళ..

### కాఫీషాప్‌లో రాహుల్‌కు ఎదురైన ఆసక్తికర ఘటన..

**న్యూఢిల్లీ, జనవరి 9:** కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ప్రజలతో మమేకమయ్యే ఏ సందర్భాన్ని వదులుకోరు. ఇటీవల ఆయన ఓ ప్రముఖ కాఫీ షాప్‌కు వెళ్లి యాజమాన్యంతో ముచ్చటించారు. వారి వ్యాపారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కష్టమర్లను పలకరించారు. ఇందుకు సంబంధించి రాహుల్ చేసిన దృశ్యాల్లో ఓ సన్నివేశం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ షాప్‌లో రాహుల్ స్వయంగా కోల్డ్ కాఫీ తయారుచేశారు. తర్వాత అక్కడున్న ఓ వృద్ధురాలు రాహుల్‌ను ఇంటికి ఆహ్వానించింది. ఆమె అదే భవనంలో నివాసం ఉంటున్నారు.

ఆమె ఆహ్వానంతో రాహుల్ ఇంటివద్దకు వెళ్లగా సదరు మహిళ ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొన్నారు. రాహుల్‌నైతే పిలిచారు కానీ ఇంటి తాళం చెవిలేదన్న విషయాన్ని మరిచిపోయారు. తాళం చెవి కోసం హైరానా పడ్డారు. ఆమె పరిస్థితి అర్థం చేసుకుని రాహుల్ వారితో ఫొటోలు దిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## లెబనాన్ అంతర్జాతీయ విమానాశ్రయంపై బాంబింగ్‌కు ఇజ్రాయెల్ ప్రణాళిక!




**బీరుట్, జనవరి 9:** ఇరాన్‌కు చెందిన ఖుద్స్ ఫోర్స్ నుంచి హెజ్‌బొల్లాకు మిలియన్‌ల డాలర్లు అందకుండా చేసేందుకు ఇజ్రాయెల్ దళాలు ఏకంగా బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రయంపైనే బాంబింగ్ చేసేందుకు ప్రణాళిక రూపొందించారట. ఈ విషయాన్ని సౌదీ అరేబియా ప్రభుత్వరంగ ఛానల్ 'అల్ అరేబియా' కథనంలో పేర్కొంది. వాస్తవానికి గత గురువారం ఇరాన్ మిలియన్ల డాలర్ల సొమ్మును హెజ్‌బొల్లాకు అందజేసేందుకు ప్లాన్ చేసినట్లు సౌదీ ప్రతిక అల్ హదాత్ పేర్కొంది. టెహ్రాన్ నుంచి డబ్బు తీసుకెళ్లేందుకు 'మహన్ ఎయిర్' విమానం వినియోగించాలని వ్యూహరచన చేసింది. ఈ విషయం లెబనాన్‌కు తెలిసింది. ఆ మర్నాడే కొందరు ఇరాన్ అధికారులు మహన్ ఎయిర్ ఫ్లయిట్‌లో బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యారు. వెంటనే విమానం మొత్తాన్ని భద్రతా సిబ్బంది తనిఖీ చేశారు. వారి లగేజీని తనిఖీ చేయడానికి లెబనాన్ భద్రతాధికారులు ప్రయత్నించగా.. ఇరాన్ అధికారులు ప్రతిఘటించారు. కానీ, లెబనాన్ సిబ్బంది మాత్రం తనిఖీలు చేసి కొన్ని అనుమానాస్పదమైనవి, సొమ్ములను స్వాధీనం చేసుకొన్నారు. దీనిపై ఆ విమానంలో వచ్చిన ఇరాన్ దౌత్య ప్రతినిధి మాట్లాడుతూ.. తమ బ్యాగుల్లో కొన్ని పత్రాలు, ఎంబసీ నిర్వహణ ఖర్చులకు చెల్లించేందుకు సొమ్ములు ఉన్నాయని పేర్కొన్నారు. మరోవైపు లెబనాన్ మంత్రి బస్సమ్ మలావి మాత్రం ఆ రోజుసాయంత్రం వరకు ఎయిర్‌పోర్టు నుంచి వచ్చే ప్రతి ఒక్కరికి తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. నగదు లేకపోవడంతో ఎయిర్‌పోర్టుపై బాంబింగ్ ప్లాన్‌ను ఇజ్రాయెల్ పక్కనపెట్టినట్లు తెలుస్తోంది.

అక్టోబరు 2024 నుంచి లెబనాన్ సైన్యమే స్వయంగా బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో తనిఖీలు చేస్తోంది. గతంలో ఈ ఎయిర్‌పోర్టును హెజ్‌బొల్లా అధీనంలో పెట్టుకుని ఆయుధాలు, నగదు స్మగ్లింగ్‌కు వాడుకొంటోందని చాలామంది రాజకీయ నాయకులు కొన్నేళ్లుగా అసంతృప్తితో ఉన్నారు.

**లెబనాన్‌లో అధ్యక్ష ఎన్నిక..**

లెబనాన్ పార్లమెంట్‌లో అధ్యక్ష ఎన్నిక ప్రయత్నాలు జోరందుకొన్నాయి. మాజీ అధ్యక్షుడు మైఖేల్ ఔన్ స్థానంలో కొత్త వ్యక్తిని ఎన్నుకోవడానికి గత రెండేళ్లలో 12 సార్లు యత్నించినప్పటికీ సాధ్యపడలేదు. ప్రస్తుతం అధ్యక్ష రేసులో ఆర్మీ కమాండర్ జోసఫ్ ఔన్ ముందంజలో ఉన్నారు. అమెరికా, సౌదీకి అత్యంత సన్నిహితుడిగా అతడికి పేరుంది. ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య జరుగుతున్న యుద్ధం నుంచి కోలుకొని దేశ పునర్నిర్మాణం చేయాలంటే అతడి ఎంపిక చాలా అవసరం ఉంది.




## మేము కూడా 'మెక్సిన్ అమెరికా' అనొచ్చు కదా!

### డొనాల్డ్ ట్రంప్‌కు మెక్సికో అధ్యక్షురాలి కౌంటర్

**మెక్సికో సిటీ, జనవరి 9:** అగ్రరాజ్య అధ్యక్ష బాధ్యతలను రెండోసారి చేపట్టేందుకు సిద్ధమవుతున్న డొనాల్డ్ ట్రంప్.. ప్రమాణస్వీరానికి ముందే పొరుగు దేశాలతో కయ్యానికి కాలు దువ్వుతున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కెనడా, గ్రాన్‌లాండ్, పనామా కాలువలను విలీనం చేకుంటామన్న ట్రంప్.. గల్ఫ్ ఆఫ్ మెక్సికోను 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మారుస్తానని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ స్పందిస్తూ.. అమెరికాకు కాబోయే అధ్యక్షుడికి గట్టి కౌంటర్ ఇచ్చారు. యుఎస్‌ను తామెందుకు 'మెక్సికన్ అమెరికా' అని పిలవకూడదంటూ చురకలంటించారు.

బుధవారం (స్థానిక కాలమానం ప్రకారం) మీడియా సమావేశంలో మాట్లాడిన క్లాడియా.. 17వ శతాబ్దం నాటి ప్రపంచపటాన్ని చూపించారు. అప్పట్లో ఉత్తర అమెరికాను 'మెక్సికన్ అమెరికా' అని పేర్కొనే వారనే విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. 'గల్ఫ్ ఆఫ్ మెక్సికోను ఐక్యరాజ్య సమితి గుర్తించిందన్న విషయాన్ని మర్చిపోవద్దు (పరోక్షంగా ట్రంప్‌ను ఉద్దేశిస్తూ) మనమెందుకు యునైటెడ్ స్టేట్స్‌ను 'మెక్సికన్ అమెరికా' అని పిలవకూడదు. ఇది వినడానికి చాలా బాగుంది కదా..? ఆయన (ట్రంప్) పేరు గురించి మాట్లాడారు. మేమూ దాని గురించే చెబుతున్నాం' అని మెక్సికో అధ్యక్షురాలు వ్యాఖ్యానించారు. అమెరికాకు కొత్త అధ్యక్షుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు ఉండాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు.

జనవరి 20న ట్రంప్ నూతన అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్న సంగతి తెలిసిందే. అయితే, గత కొద్ది రోజులగా ఆయన తనలోని విస్తరణ కాంక్షను కాంక్షను బయటపెడుతున్నారు.

ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లా డుతూ.. 'గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చాలని అనుకుంటున్నా. అదే సరైంది కూడా..! లక్షలాది మంది మా దేశంలోకి అక్రమంగా ప్రవేశించకుండా మెక్సికో అడ్డుకోవాలి. ఆ దేశాన్ని మాదకద్రవ్యాల ముఠాలు నడిపిస్తున్నాయి' అని దుయ్యబట్టారు. అంతకు ముందు కూడా ఈ అంశంపై ట్రంప్ మాట్లాడుతూ.. అక్రమవలసదారులు, డ్రగ్స్ రవాణాను అడ్డుకోకపోతే.. మెక్సికోపై టారిఫ్‌లు కఠినంగా విధిస్తామని హెచ్చరించారు.

## బీహార్‌లో సంక్రాంతి తర్వాత కేబినెట్ విస్తరణ

### ఆరుగురికి చోటు కల్పించేందుకు సిఎం నితీశ్ కసరత్తు

**పాట్నా, జనవరి 9:** సంక్రాంతి తర్వాతకేబినెట్ విస్తరణ ఉంటుందని బీహార్ సిఎం నితీశ్‌కుమార్ సంకేతాలు వదిలారు. దీనితో ఆశావహుల్లో మరింతగా ఉత్కంఠపెరిగింది. పార్టీలోను, కూటమిలోను పెరుగుతున్న అసంతృప్తిని అధిగమించేందుకు నితీశ్ కేబినెట్‌ను విస్తరించాలని చూస్తున్నారు. వచ్చే ఏడాది ఎటూ ఎన్నికలకు వెళ్లాల్సి ఉన్నందున ఈలోపే కేబినెట్‌ను విస్తరించే అవకాశం ఉందని ఆయన పార్టీనేతలు చెపుతున్నారు. కూటమిలో బిజెపికిసైతం స్థానాలు కల్పించాల్సిన అవసరం ఉంది. బిజెపి కోటానుంచిఉన్న నలుగురు ఎమ్మెల్యేలనుమంత్రులుగా కేబినెట్‌లోకి చేర్చుకోవచ్చు. ప్రస్తుతం 50 మంది మంత్రులుగా ఉన్నారు. ముఖ్యమంత్రి, ఇద్దరు డిప్యూటీ సీఎంలతో సహా కేబినెట్ 30కి పరిమితం అయింది. గత కేబినెట్ 2024 మార్చి 15న ఏర్పాటయింది. 21 మంది మంత్రులతో ఏర్పాటయింది. తొమ్మిది మంది జెడియు, 12 మంది బిజెపినుంచి ఎన్నికయ్యారు. కొత్త ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన 46 రోజుల తర్వాత మంత్రివర్గం ఏర్పాటయింది. 243 మందిసభ్యులున్న అసెంబ్లీలో మొత్తం 36 మందివరకూ మంత్రివర్గ సభ్యులు ఉండవచ్చని రాజ్యాంగం చెపుతోంది. అనేక మంత్రి బిజెపి మంత్రులు ఇప్పటికే అదనపుబాధ్యతలు నిర్వహిస్తున్నారు. కొత్తకేబినెట్‌కూర్పుతో వీరందరికీ కొంత విరామం ఇవ్వడంతోపాటు కొత్తవారికి ఛాన్స్ ఇచ్చినట్లవుతుందని అంచనా. వచ్చే ఏడాది అక్టోబరు,నవంబరు మాసాల్లోనే అసెంబ్లీ ఎన్నికలకు వెళుతున్న సందర్భంలో కొత్తవారిని చేర్చుకోవడంద్వారా వారికి శాఖలను కేటాయించి అసంతృప్తిని బుజ్జగించవచ్చని నితీశ్‌కుమార్ యోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈనెల 30వ తేదీలోపు కేబినెట్ విస్తరణ చేపట్టాలని ప్రతిపాదిస్తామని బిజెపినేతలు చెపుతున్నారు. గరిష్టంగా ఆరుగురు కొత్తమంత్రులు కేబినెట్‌లోకి వస్తున్నారు. కొత్తముఖాలుకూడా ఉంటాయన్న అంచనాలున్నాయి. అలాగే మంత్రివర్గ శాఖలను కూడా ప్రక్షాళన చేస్తారని మరో బిజెపినేత చెపుతున్నారు. కొంతమందిమంత్రులను కేబినెట్ నుంచి తప్పించే అవకాశం కూడా లేకపోలేదని, మంత్రుల పనితీరు అధ్వాన్నంగా ఉన్నందున వారిని తప్పించి కొత్తవారికి అవకాశం ఇస్తారని బిజెపినేతలు పేర్కొంటున్నారు. మార్చిన మంత్రులను వారి సామాజికవర్గాలనేతలతోనే భర్తీచేస్తారని అంచనా. జనవరి 15లోపే కేబినెట్ విస్తరించేందుకు నితీష్ ఆలోచనచేస్తున్నట్లు జెడియు నేతలు స్పష్టంచేస్తున్నారు. 30వ తేదీలోపు కేబినెట్ విస్తరిస్తే ఫిబ్రవరిలో ఎటూ బడ్జెట్ సమావేశాలు ఉంటాయి. సారన్, తిర్హట్, పాట్నా డివిజన్లనుంచి ఎమ్మెల్యేలు ఇప్పటికే తమ లాబీయింగ్‌ను ముమ్మరంచేసారు. కేబినెట్ బెర్తులు కావాలంటూ రాయబేరాలు పంపిస్తున్నట్లు పార్టీనేతల్లోనే గుసగుసలు పెరిగిపోయాయి.

## చెన్నై జాతీయ రహదారిపై ప్రమాదం

### 4గురు మృతి, 44 మందికి తీవ్రగాయాలు

**చెన్నై,జనవరి 9:** చెన్నై బెంగళూరు హైవేపై ప్రయాణీకులతో వెళుతున్న కర్ణాటక బస్సు ప్రైవేటు టిప్పర్ లారీని ఢీకొనడంతో నలుగురు వ్యక్తులు చనిపోగా బస్సులో ఉన్న 44 మందికి తీవ్ర గాయాలయ్యాయి. రాణిపేట్ జిల్లాలోని సిప్‌కాట్ ఎమరాల్డ్ నగర్‌వద్ద ఉన్న జాతీయ రహదారిపై గురువారం తెల్లవారు ఝామున ప్రమాదం జరిగింది. మృతులు ఎన్‌సోమశేఖరన్(30), వి.మంజునాథ్(31), సి.శంకర(32), వి.కృష్ణప్ప(65)లు కోలార్ జిల్లాకు చెందినవారని వీరంతా బస్సులో మేలమరువత్తూరులో ఉన్న ఆదిపరాశక్తి దేవాలయంలో అమ్మదర్శనం అనంతరం తిరిగి వెళుతున్న సందర్భంగా ఈ ప్రమాదంలోచనిపోయారు. హైవేపై బస్సులు ఓవర్‌టేక్‌చేసుకుంటూ ఒకదానికి మించి ఒకటి వెళ్లాయని, ఈక్రమంలో అటుగా వస్తున్న ప్రైవేటు టిప్పర్ లారీని ఢీకొనడంతో నలుగురు మృతిచెందిన 44 మంది గాయాలపాలయ్యారన్నరు. క్షతగాత్రులను వలాజా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరందరినీ వెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, క్రిస్టియన్‌మెడికల్ కళాశాల ఆసుపత్రిలోకూడా కొందరికి చికిత్స జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# కోడి పందేలను, జూద క్రీడలను అడ్డుకోండి

## - హైకోర్టు ఉత్తర్వులు కచ్ఛితంగా అందరూ పాటించాలి.

## -జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.



**ఏలూరు టౌన్,జనవరి 09,ప్రభాత వార్త :** సంక్రాంతి సంబరాల పేరిట కోడిపందేలు, జంతుహింస జరుగకుండా నియంత్రణా చర్యలు చేపట్టాలని హైకోర్టు ఉత్తర్వులు మేరకు జిల్లాలో రెవిన్యూ, పోలీస్ యంత్రాంగం, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిదులతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీలను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. సంక్రాంతి సంబరాల పేరిట కోడిపందేలు, జూదాలు జరుగకుండా చూసేందుకు జిల్లాలో అన్ని మండలాల్లో 28 సంయుక్త తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు గట్టినిఘాతో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఈ కమిటీల్లో ఆయా మండల తహశీల్దారు, ఎస్ హెచ్ఓ, ఎన్ జివో ప్రతినిధి, ఇద్దరు కానిస్టేబుల్స్, ఇద్దరు వీడియో గ్రాఫర్లతో కూడిన బృందాలను ఏర్పాటు చేశారు. కోడిపందేలు, బెట్టింగులు, జూదాలు తదితర సామాజిక దురాచారాల నియంత్రణకు ఈ కమిటీలు పనిచేస్తాయి. అదే విధంగా ఈ సమన్వయ కమిటీలు ప్రజల్లో కోడిపందేలు నియంత్రణపై అవగాహన కల్పిస్తారు. కోడిపందేలతోపాటు ఇతర నిషిద్ధ ఆటలను ఆడటాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదన్నారు. కోడిపందేలు నిషేదంపై గ్రామాల్లో టాం టాం వేయడం, మైక్ ప్రచారం, తదితర విస్తృత ప్రచారం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదే విధంగా సంయుక్త తనిఖీ బృందాలు నిర్వర్తించాల్సిన విధి విధానాలను ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పాఠశాలల్లో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

**-అదరహో అనిపించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

**- భోగి పూలతో చిన్నారులను ఆశీర్వదించిన స్కూలు ఉపాధ్యాయునిలు**

**- భోగి మంటలు, రంగవల్లులు, పొంగలు, అరిసెలు, డెకరేషన్లతో అదరగొట్టిన చిన్నారులు**






**వేలేరుపాడు, ప్రభాత వార్త :** వేలేరుపాడు మండలంలో సంక్రాంతి సంబరాలలో శివకాశి పురం గ్రామంలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల సంక్రాంతి సంబరాలకు వేదికయింది,సంక్రాంతి సెలవులను ప్రభుత్వం జనవరి 10 నుండి 19వ తారీఖు వరకు ప్రకటించడంతో గురువారం పాఠశాలల ఆఖరి రోజు కావడంతో చిన్నారులు సంతోషంగా కోలాహాలంగా ఇంటి దారి పట్టారు, శివకాశీ పురం లోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయురాలు మరియు సిబ్బంది వినూత్న రీతిలో సంక్రాంతి సంబరాలను నిర్వహించి,విద్యార్థులకు సంక్రాంతి గొప్పదనం సంక్రాంతి జరుపుకునే విధానం సంస్కృతి సంప్రదాయాల్లోని గొప్పదనం వివరించారు, విద్యార్థులు గీసిన రంగవల్లులు భోగి మంటలు పచ్చని కళా తోరణాలు చూపరులను బాగా ఆకట్టుకున్నాయి, పాఠశాల ఆఖరి రోజు కావడంతో తమ చిన్నారులను తీసుకొని వెళ్లడానికి వచ్చిన తల్లిదండ్రులు సైతం కార్యక్రమాన్ని తిలకించి ఆనంద వ్యక్తం చేశారు, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం ఎం నాగమణి సంక్రాంతి సంబరాలను సంస్కృతి ఉట్టిపడేలా అరిసెలు,భోగి మంటలు గొబ్బెమ్మలు, రంగులు,రంగవల్లులు రేగి పళ్ళు పూలూ పండ్లు పొంగళ్లతో నిర్వహించడం బాగా ఆకట్టుకున్నాయి,పూలు భోగిపళ్ళతో చిన్నారులను ఉపాధ్యాయునులు ఆశీర్వదించిన విధానం తల్లిదండ్రులకు సంతోషాన్ని ఇచ్చింది,ఆకట్టుకునే చీరకట్టులో ఉపాధ్యాయునిలు అలరించారు, భోగి మంటలు చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ కోలాటం ఆడారు. సంక్రాంతి పండగ సందర్భంగా చిన్నారులకు నిర్వహించిన క్రీడలు యందు గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు తదుపరి డాన్సులు పాటలతో చిన్నారులు అలరించారు. సంతోషంతో స్కూల్ ని వదిలి సంక్రాంతి సెలవులకు చిన్నారులు ఇంటిదారి పట్టారు వీక్షించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయురాలను అభినందించారు, ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన వారిలో శివకాశి పురం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. నాగమణి,వార్డెన్ ఎం.సీతమ్మ పిడి ఎం. రమ్య మరియు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు

# ప్లాటినం వేడుకకు వై ఎన్ ఎం.సిద్ధం

## - నేడు మంత్రుల రాక





**ప్రభాతవార్త నరసాపురం :** నరసాపురం వై ఎన్ కళాశాల ప్లాటినం వేడుకకు సిద్ధమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో సరస్వతి దేవి మహాత్మా గాంధీ స్వామి వివేకానంద విగ్రహాలను ప్రారంభిస్తారు. పి శ్రీరామారావు అధ్యక్షతన జరిగే ప్రారంభ సభకు డాక్టర్ సత్యనారాయణరావు స్వాగత ఉపన్యాసం చేస్తారు. మంత్రులు నారా లోకేష్ నిమ్మల రామానాయుడు కందుల దుర్గేష్ బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి మహమ్మద్ షరీఫ్ ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తదితరులు పాల్గొంటారు. ఈ సందర్భంగా కళాశాలను సర్వ శోభితంగా అలంకరించారు. గురువారం ముగ్గుల పోటీ జరిగింది. బీఈడీ కళాశాల ప్రాంగణంలో సభా వేదికను ఏర్పాటు చేశారు.

# మీ మాటలు సత్య దూరం

## -ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పై మండి పడ్డ మాజీ మంత్రి కారుమూరి



**తణుకు జనవరి 9: ( ప్రభాత వార్త ) :** మీడియా సమావేశం నిర్వహించి అబద్దాలు నూరిపిస్తున్నారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాక్రిష్ణపై ధ్వజమెత్తారు మాజీ మంత్రి కారుమూరి. ఈ మేరకు గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశం ప్రారంభంలో ముందుగా తిరుపతి తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారికి సంతాపం తెలిపిన కారుమూరి అనంతరం ఆరిమిల్లి రాధాకృష్ణపై విరుచుకుపడ్డారు. తేతలిలో నిర్వహిస్తున్న పశువధ ఫ్యాక్టరీకి గత వైస్సార్సీపీ హయాంలో నే అనుమతులు ఇచ్చారంటూ నకిలీ పేపర్లు సృష్టించారని ఎమ్మెల్యే ఆరిమిల్లిని ఆరోపించారు. నాహయాంలోనే పర్మిషన్లు ఇచ్చి ఉంటె ఆ ఐదు సంవత్సరాల్లో ఒక్క పశువు కూడా ఎందుకు వద జరగలేదని ప్రశ్నించారు. ఈరెండు నెలల నుండే ఎందుకు రోజూ వందలు వందలు పశువులు వదిస్తున్నారనీ స్థానికులు సైతం గేదెలు ఉన్న వాహనాన్ని పలుమార్లు అడ్డుకున్నారని గుర్తు చేశారు. ఎవరి హయంలో ఫ్యాక్టరీ పశువుల సాగించిందో ప్రత్యక్ష సాక్షులుగా పిలవబడిన ఫ్యాక్టరీ పక్కన గోడౌన్లలో పని చేసే జట్టు కూలీల చేత సాక్షాలు చెప్పించారు. ఈ సందర్భంగా గత ఐదేళ్లు పశు వధ ఫ్యాక్టరీ ఒక్క రోజు కూడా నడవలేదని చెప్పిన హమాలీ జట్టు కూలీలు రెండు నెలలుగా మాత్రం తాము అక్కడ పని చేయలేక పోతున్నామని వాసనతో తిండి తినలేక పోతున్నామని వాపోయారు. తణుకు ప్రజల మనుగడ కంటే ధన దాహమే ఎమ్మెల్యే అరిమిల్లికి ముఖ్యమన్నారు. పేపర్స్ లో 34 ఎకరాల్లో ఫ్యాక్టరీ ఉన్నట్లు తప్పుడు పత్రాలు చూపిస్తున్నారు కానీ ఫ్యాక్టరీ మూడెకరాల 29 సెంట్లు లో మాత్రమే జనావాసాల మధ్య ఉంది ఈ ఒక్క కారణం చాలు అది మూయించటానికి అన్నారు. అనుమతులు లేని ఫ్యాక్టరీకి పోలీసులను కాపలా ఉంచారని ఎద్దేవా చేశారు. అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పకుండా ఎమ్మెల్యే ఆరిమిల్లి డైవర్షన్ పాలిటిక్స్ మాట్లాడుతున్నారన్నారు. అనుమతుల విషయం పక్కనపెట్టి అవస్థలు పడుతున్న ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికిప్పుడు ఫ్యాక్టరీని మూయించే దిశగా చర్యలో తీసుకోవాలని కోరారు. ఒకవేళ తమ ప్రభుత్వంలో అనుమతులు వచ్చినప్పటికీ తాను అధికారులను ఉపయోగించి ఫ్యాక్టరీని మూయించి వేశానని అలాంటి అధికారమే ప్రస్తుత ఎమ్మెల్యే కూడా ఉపయోగించి వెంటనే ఫ్యాక్టరీని మూయించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలంతా ఏకమై ఉద్యమాలు చేయటానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

# బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి.

**ఏలూరు టౌన్,జనవరి 09, ప్రభాత వార్త :** బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. ఏలూరు జీ.ఎన్.టీ రోడ్ లో గల బీఎస్ఎన్ఎల్ భవన్ లో గురువారం జరిగిన టెలికం సలహా కమిటీ సమావేశానికి ఎంపీ మహేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవలను జనరల్ మేనేజర్ శ్రీను వివరించారు. అనంతరం ఎంపీ మహేష్ కుమార్ పార్లమెంట్ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న బిఎస్ఎన్ఎల్ టవర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలవరం నియోజకవర్గంలో కొత్త టవర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీ అధికారులకు సూచించారు. సిబ్బంది కొరత వల్ల కొన్నిచోట్ల ఇబ్బందులు ఉన్నాయని బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ శ్రీను ఎంపీ మహేష్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగుల ఖాళీల వివరాలు, ఇతరత్రా సమస్యలు తనకు నివేదిక రూపంలో అందిస్తే కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. కొత్త టవర్ల ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సలహా కమిటీ సభ్యుల సహకారం తీసుకోవాలని ఎంపీ సూచించారు. అనంతరం బిఎస్ఎన్ఎల్ అధికారులు, కమిటీ సభ్యులు ఎంపీ మహేష్ కుమార్ కు పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాలు కప్పి సన్మానించారు.



సమావేశానికి సలహా కమిటీ సభ్యులు, బిఎస్ఎన్ఎల్ అధికారులు హాజరయ్యారు.

# భాష్యంలో సంక్రాంతి సంబరాలు



పెనుమంట్ర, జనవరి-09, ప్రభాతవార్త: పెనుగొండ భాష్యం పాఠశాలలో విద్యార్థులంతా సంక్రాంతి సంబరాలలో మునిగితేలారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వెంకట అప్పారావు మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి అని అన్నారు. ఈ పండుగ సందర్భంగా తమ చిన్నారులంతా విభిన్న వేషధారణలతో ముద్దులొలుకుతూ సందడి చేశారని అన్నారు. చిన్నారులకు భోగిపళ్ల వేడుక, బొమ్మల కొలువు, గొబ్బెమ్మలు, ముగ్గుల పోటీలు, రకరకాల పిండి వంటల ప్రదర్శన, భోగి మంటలు, బసవన్నల విన్యాసాలు హరిదాసుల గానములతో అచ్చమైన తెలుగింటి సంప్రదాయాలతో అలరించారన్నారు. అనంతరం ఫుడ్ ఫెస్టివల్, ముగ్గుల పోటీలలో విజేతలైన వారికి బహుమతులను అందజేశారు. మనది వ్యవసాయ ఆధారిత దేశం. పంటలు చేతికందే సమయానికి వచ్చే పండుగ సంక్రాంతి అప్పుడు రైతులు పంట అమ్ముకునే సంతోషంగా ఉంటారన్నారు. అందుకే ఈ పండుగను ఘనంగా చేసుకుంటారన్నారు. రైతులకు చాలా ముఖ్యమైన ఆవులు ఎడ్లను అలంకరిస్తారు నాగలికి పూజలు చేస్తారు కొత్త బియ్యంతో పరమాన్నం అటుకులతో పాయసం వంటివి చేస్తూ చనిపోయిన పూర్వీకులకు నైవేద్యంగా సమర్పిస్తారు. రైతులకు అండగా చేదోడు వాదోడుగా ఉండే అన్ని వృత్తి పనుల వారు ఆదరణ పొందే విధంగా ఐకమత్యాన్ని చాటే పండుగ సంక్రాంతి అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భాష్యం విద్యాసంస్థల వెస్ట్ జోన్ ఇంచార్జ్ ఏ శ్రీమన్నారాయణ రెడ్డి, చాంప్స్ ఇంచార్జ్ రాణి రోజాజీ, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.



మొగల్తూరులో ప్రతిభ స్కూల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ నర్సాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ . ఈ కార్యక్రమంలో కొల్లాటి గోపికృష్ణ ,నిప్పులేటీ తారక రామారావు , లాక్కు బాబీ, ముక్కు పుల్లయ్య,వాటాల దుర్గరాజు,మైలాబతుల రాంబాబు,ముక్కు గిరి,వాటాల కృష్ణ మూర్తి,కత్తుల యుగంధర్ మరియు నియోజకవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు జన సైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.
ప్రభాతవార్త నరసాపురం రూరల్

# సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాతి : కలెక్టర్ నాగరాణి



భీమవరం జనవరి 9 ప్రభాతవార్త : సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.గురువారం స్థానిక కలెక్టరేట్ జిల్లా ఖజానా కార్యాలయం నందు సంక్రాంతి సందర్భంగా ఏర్పాటుచేసిన బొమ్మల కొలువును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జ్యోతిని వెలిగించి ప్రారంభించి, ఖజానా కార్యాలయ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి సంబరాలు సాంప్రదాయం ఉట్టిపడేలా వేడుకగా జిల్లా ట్రెజరీ అధికారి ఆడారి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించడాన్ని ప్రశంశించారు. కోలం ముగ్గులను, బొమ్మల కొలువును అలంకరణలను పరిశీలించి చాలా బాగుందని కితాబ్ ఇచ్చి, ఈ అలంకరణలో పాల్గొన్న మహిళా సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు వాళ్ళ అతి పెద్ద పండుగ సంక్రాంతి అని, కుటుంబ సభ్యులందరూ పండగ రోజుల్లో ఒక చోట చేరి ఆనందోత్సహాలతో సాంప్రదాయబద్ధంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అన్నారు. బుద్దిని వృద్ధి చేసుకోవడం అనేది సంక్రాంతి పండుగ లోని ఆంతర్యం అన్నారు. తొలుత సంక్రాంతి సందర్భంగా వంటలు, ముగ్గులు, క్రీడలు పోటీలను నిర్వహించి చివరిగా విజేతలకు బహుమతి ప్రదానం చేయడం జరిగింది. వేడుకలలో జిల్లా ట్రెజరీ అధికారి ఆడారి గణేష్, సహాయ ట్రెజరీ అధికారి అబ్దుల్ హాకీం, ఎస్ టి ఓలు జె. రామారావు, ఇ.హిమబిందు, ఎ.రవివర్మ, పి.హరిబాబు, ఎ.వి. శివాజీ, ట్రెజరీ అసోసియేషన్ అధ్యక్షులు యు.వి.పాండురంగారావు సినియర్ అకౌంటెంట్లు జె.మౌనిక, జ్యోతి, పి. వినీల, పి.విశాలి, జి.చంద్ర శేఖర రావు, సాయి బాలాజీ, ఎ. శ్రీనివాస్ రావు, ఎం.జగదీశ్వర రాజు, యం. సత్యనారాయణ, ప్రసాద్ బాబు, భాస్కర్, శోభన్, సూర్యనారాయణ, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు. వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా రెవిన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డి పి ఆర్ ఓ టి.నాగేశ్వరరావు, జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఈ సుబ్బారావు, బీసీ వెల్ఫేర్ అధికారి గణపతి రావు, డిఎంహెచ్వో భాను నాయక్, ఐ సి డి ఎస్ పి డి మీ సుజాత రాణి, తదితరులు పాల్గొని తిలకించారు.

# వైసీపీ నుండి జనసేనలో భారీగా చేరికలు.



**ప్రభాతవార్త నరసాపురం రూరల్:** మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లి, దారతిప్ప గ్రామాల్లో వైసీపీ నుండి జనసేన పార్టీలో 50 మంది కార్యకర్తలు గురువారం స్థానిక ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, సమక్షంలో చేరారు. ఈసందర్భంగా దారతిప్ప గ్రామంలో ప్రముఖ ఆక్వా రైతు సరిపల్లి సుబ్బరాజు 45 మంది, ముత్యాలపల్లిలో చెన్నూరి శివాజీ నాయకత్వంలో ఐదుగురు జనసేన పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికఎమ్మెల్యే నాయకర్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృ దికి చేస్తున్న కృషిని గుర్తించి వైసీపీ నుండి జనసేనలో చేరినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్, కొల్లాటీ గోపికృష్ణ, నిప్పులేటి తారక రామారావు, వలవల నాని, ఆకన చంద్రశేఖర్ ,బందెల రవీంద్ర, మైల వసంతరావు, గుబ్బల మరాజు, లాక్కు బాబీ, ముక్కు పుల్లయ్య,వాటాల దుర్గరాజు,మైలాబతుల రాంబాబు,ముక్కు గిరి,వాటాల కృష్ణ మూర్తి,కత్తుల యుగంధర్ మరియు నియోజకవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నక్కా నరేష్ కుమార్ కి గౌరవ డాక్టరేట్



**పెనుమంట్ర, జనవరి-09, ప్రభాతవార్త:** మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నక్కా నరేష్ కుమార్ కి గౌరవ డాక్టరేట్ లభించింది. నూతన సంవత్సర సెలబ్రేషన్స్ సందర్భముగా గుడ్ సమరియన్ థియోలాజికల్ సెమినారి ఇంటర్నేషనల్ ఇంచార్జ్ మరియు “ మనం “ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరంలో ఫౌండర్ అండ్ డైరెక్టర్ కె చక్రవర్తి సారధ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ డా. వెన్నెల గద్దర్ చేతుల మీదుగా నక్కా నరేష్ కుమార్ కు హ్యూమానిటీస్, గ్లోబల్ శాంతి లో డాక్టరేట్ మరియు ట్రాన్స్ఫర్మేషన్ లీడర్షిప్ డిగ్రీ లో పట్టాను అందజేశారు. మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నో విలువైన సేవలను సంస్థ ద్వారా చేస్తున్నందు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. నక్కా నరేష్ కుమార్ కు గౌరవ డాక్టరేట్ అవార్డు రావడం పట్ల మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్, అధ్యక్షులు డా.కర్రి మురళి శ్రీనివాస్ రెడ్డి, వ్యవస్థాపకులు జాతీయ, అంతర్జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సాక రాజు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సబితి నందన కుమార్, సంధి జాన్సన్, పెదపాటి సురేష్ బాబు, సాక రవి, పమ్మి చందర్రావు, పమ్మి ఏసు, పమ్మి రాజు, నెల్లి శ్రీనివాస్ మరికొంతమంది అభిమానులు బంధుమిత్రులు శ్రేయోభిలాషులు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

# 30 పెన్షన్లు తనిఖీ

**అత్తిలి - జనవరి 9 ( ప్రభాత వార్త ):**అత్తిలి మండలం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పెన్షన్ వ తనిఖీ లో భాగంగా 4 వ రోజు బల్లిపాడు, గుమ్మంపాడు,వరిగేడు, తిరుపతిపురం గ్రామల నందు మంచానికి పరిమితం అయిన 30 మంది పెన్షనర్లను తనిఖీ చేశారు. తనిఖీలో స్టేట్ టీం డాక్టర్ జాన్ హరీషణ్ గారు, జిల్లా టీం డాక్టర్ సుష్మా , డాక్టర్ క్రాంతి రెడ్డి ,డాక్టర్ కె.నాగరాజు ,ఎంపీడీవో పి.శ్యామ్యూల్ ,విస్తరణ అధికారిఎం. శ్రీనివాసరావు గారు,పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పార్క్ అభివృద్ధికి క్షత్రియ సేవా సమితి, మున్సిపాల్టీ సహకారం



**జంగారెడ్డిగూడెం - ప్రభాతవార్త :** పట్టణంలో వ్యాయామం, నడక, యోగా, క్రీడల అభివృద్ధికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు పెన్మెత్స రంగరాజు, మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణ అన్నారు. జంగారెడ్డిగూడెంలో అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్కులో గురువారం ఆరోగ్య అభిలాషుల సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంబరాలను రంగరాజు ప్రారంభించారు. భోగి మంటలను పెన్మెత్స రంగరాజు, క్షత్రియ సేవా సమితి కార్యదర్శి నంబూరి రామచంద్రరాజు, మాజీ అధ్యక్షుడు గోరింట విజయరామరాజు ప్రారంభించారు. ఈస ందర్భంగా కమిషనర్ కేవీ.రమణ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్తో పాటు పిరమిడ్ దగ్గరలో ఉన్న 40 సెంట్లు, స్థలంలో కూడా పార్కు అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు రంగరాజు మాట్లాడుతూ మున్సిపల్ పార్కులో షటిల్ కోర్టును అభివృద్ధి చేస్తామన్నారు. పలు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య అభిలాషులు క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు రంగరాజు, మాజీ అధ్యక్షుడు గోరింట విజయరామరాజు, కార్యదర్శి నంబూరి రామచంద్రరాజు, కోశాధికారి గొట్టుముక్కల భాస్కరరాజు, కమిషనర్ కేవీ.రమణ, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ముదునూరి నరసింహరాజులను ఘనంగా సత్కరించారు. అనంతరం మహిళా ఆరోగ్యాభిలాషులు తీసుకొచ్చిన పలు రకాల పిండి వంటలను అందరికీ పంచి సంక్రాంతి వేడుకలను జరుపుకున్నారు.

# తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**జంగారెడ్డిగూడెం - ప్రభాతవార్త :** తపాల శాఖ పూర్తి స్థాయిలో ఆన్లైన్ సేవలందిస్తోందని, ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు డివిజన్ ఎస్పీవో శ్రీకరబాబు అన్నారు. గుర్వాయిగూడెం మానవత కళ్యాణ మండపంలో పోస్టల్ ఉద్యోగుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈస ందర్భంగా ఎస్పీవో శ్రీకరబాబు మాట్లాడుతూ డిసెంబరు 11, 12వ తేదిల్లో తపాలా జీవిత భీమాలో అత్యున్నత ప్రతిభకనబర్చిన పోస్టల్ ఉద్యోగులను సన్మానించామన్నారు. జంగారెడ్డిగూడెం పోస్టల్ డివిజన్ పరిధిలో రూ.32లక్షల ప్రీమియం స ఏకరించి ఆంధ్రప్రదేశ్ సర్కిల్ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిందని అభినందించారు. తపాలా శాఖ అధికారులు డి.శ్రీనివాసరావు, కే.శ్రీనివాసరావు, డి.శ్రీకాంత్, డి.దుర్గారావు, కే.రాజేష్, జి.గంగాధరరావు, యూనియన్ నాయకులు తపాల సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ మావుళ్ళమ్మ జాతర కు కలెక్టర్ కు ఆహ్వానం

**భీమవరం జనవరి 9 ప్రభాతవార్త :** శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ కార్యవర్గం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారు 61వ వార్షికోత్సవాలకు గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని ఆహ్వానించారు. ఆహ్వానం అందుకున్న కలెక్టర్ స్పందించి మాట్లాడుతూ భీమవరం పట్టణం నడిబొడ్డున నెల రోజులు పాటు శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 13 నుండి ఫిబ్రవరి నెల 14 వరకు నిర్వహించదడం అభినందనీయం అన్నారు. అమ్మవారి ఆలయం దర్శనానికి స్థానిక భక్తులు కాకుండా, సుదీర్ఘ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు రావడం జరుగుతుందన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఏటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ కార్యవర్గం సభ్యులకు సూచించారు.

# హైటెక్ యుగంలో హరిదాసులు

## - పలుకు లేదు... నడకలేదు



చాట్రాయి, జనవరి9, ప్రభాతవార్త : హైటెక్ యుగంలో హరిదాసులు కూడా తీరు మార్చుకున్నారు. గతంలో కాలినడకతో చెక్కభజన చేస్తూ నామ సంకీర్తన చేసే హరిదాసులు నేడు ద్విచక్ర వాహనంపై మైకు పెట్టుకుని తిరుగుతున్నారు. గతంలో ఇంటికి వచ్చిన సమయంలో బియ్యం వేయగానే గోవిందా అంటూ పలికేవారు. నేడు ఆ పరిస్థితికి భిన్నంగా మారింది. అయితే సంక్రాంతి సాంప్రదాయాలు రోజురోజుకీ కనుమరుగు అవుతున్న సమయంలో మారిన ట్రెండ్ కు అనుగుణంగా ద్విచక్ర వాహనంపై రావడం కూడా సంక్రాంతి సంబరంగా చెప్పుకుంటున్నారు. గతంలో ధనుర్మాసం మొదలు అయిన నాటినుండి ధనస్సు పట్టి భక్తులు నగర సంకీర్తనలు చేస్తూ కోదండ రాముని సంకీర్తనలు పాడుతూ వీధివీధికి తిరుగుతూ ఉండేవారు. దీనికి తోడు ఉదయాన్నే హరిదాసులు సాంప్రదాయమైన దుస్తులు ధరించి హరినామ సంకీర్తనలు చేస్తూ వీధుల్లో తిరుగుతుంటే సందడి వాతావరణం నెలకొనేది. అదేవిధంగా ఇళ్ళ ముందు సంక్రాంతి ముగ్గులు పోటీపడి మరీ వేసి గొబ్బెమ్మలు పెట్టడం ఏ వీధికి వెళ్ళినా దర్శనమిస్తూ ఉండేవి. దీంతో సంక్రాంతి సందడి సంప్రదాయాలు గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా కనపడుతూ ఉండేవి. కానీ ఈ రోజుల్లో హైటెక్ యుగంగా మారిపోవటంతో రాను రాను సంక్రాంతి సాంప్రదాయాలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ముగ్గులు తో పాటు గొబ్బెమ్మలు కూడా రోజురోజుకీ తగ్గిపోతున్నాయి. నగర సంకీర్తన కూడా నామమాత్రంగా కొన్ని గ్రామాల్లో జరుగుతోంది. ధనుస్సు పట్టిన నాటినుండి 30 రోజులు పాటు ముగ్గులు సంక్రాంతి సంప్రదాయాలతో కళకళలాడాల్సిన గ్రామాలు నామమాత్రపు కళతో దర్శనమిస్తున్నాయి.

# రేచర్ల గ్రామంలో సారాయి ఎక్సైజ్ శాఖ దాడులు.



లింగపాలెం జనవరి 8 ప్రభాతవార్త..... రూపాయి దాడులు9 వ తేదీన ప్రోహిబిషన్ & ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ ,ఏలూరు, శ్రీలత మేడమ్ మరియు డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్ & ఎక్సైజ్ ఆఫీసర్ (DPEO) ఏలూరు జిల్లా వారి ఆదేశాలు ప్రకారం చింతలపూడి ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్ పరిది లో గల చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో నాటు సారాయి స్థావరాల పై దాడులు నిర్వహించగా రేచర్ల గ్రామమునకు చెందిన మద్దరసు లక్ష్మి దేవి అను మహిళ వద్ద నుండి (10) లీటర్ల నాటు సారయిను స్వాధీన పరుచుకొని, ఆ మహిళ ను అదుపులో తీసుకొని, స్థానిక ఎక్సైజ్ స్టేషన్ చింతలపూడి నందు కేసు నమోదు చేయడమైనది! అలాగే చింతలపూడి మండలం రేచర్ల, నాగిరెడ్డిగూడెం గ్రామం లో పాత నాటు సారాయి కేసులో నిందితుడు అయిన మద్దరసు లక్ష్మి దేవి మరియు వడిత్య లక్ష్మణుడు అను ఇరువురును 129 %దీచీూా% చట్టం ప్రకారం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ చింతలపూడి వారి ఎదుట హాజరు పరచి బైండ్ ఓవర్ నమోదు చేయడమైనది!ఈ దాడులలో స్థానిక చింతలపూడి ఎక్సైజ్ ఎస్.ఐ.లు ఆర్.వి.ఎల్.నరసింహారావు , అబ్దుల్ ఖలీల్, మరియు సిబ్బంది పాల్గొన్నారు అని ఎక్సైజ్ సి.ఐ పి.అశోక్ తెలిపినారు.





నరసాపురం బిజీబిఎస్ మహిళ కళాశాలలో సంక్రాంతి వేడుకలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ముగ్గుల పోటీ జరిగింది. కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ వాసవి క్లబ్ ప్రెసిడెంట్ నూలి శ్రీనివాస్ కోట్ల బాలకృష్ణ కళాశాల ప్రిన్సిపాల్ మధుశాలిని తదితరులు పాల్గొన్నారు. ప్రభాతవార్త నరసాపురం

# కోడి పందెం లు నిర్వహించవద్దు.



ఆగిరిపల్లి జనవరి 9 ప్రభాతవార్త:సంక్రాంతి పండగ సందర్భంగా కోడి పందాలు పేకాటలు నిర్వహించవద్దని ఆగిరిపల్లి ఎస్సై శుభశేకర్ హెచ్చరించారు. గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సంక్రాంతి పండుగను సాంప్రదాయ పద్ధతులు ఆనంద ఉత్సాహాలతో నిర్వహించుకోండని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని ఆయన అన్నారు.

# అమీత్షాను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలి

## - కాంగ్రెస్ డిమాండ్



ప్రభాతవార్త నరసాపురం : నర్సాపురం నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి వెంకటస్వామి బాబ్జి ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ను పార్లమెంట్లో అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుండి వెంటనే తీసి వేయాలని ఆయన దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ సభ్యులు రాష్ట్రపతి పంపిన లేఖను గురువారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి లేఖను అందజేశారు.. అమిత్ షా వ్యాఖ్యలు చాలా అనవసరం మరియు అవి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ను తీవ్రంగా అవమానించే విధంగా ఉన్నాయన్నారు. ఎంతో బాధ్యతగల పదవిలో ఉన్న అమీషా ఇటువంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఆయన వ్యాఖ్యలు దేశ సమగ్రతకు లౌకిక వ్యవస్థకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని పెర్కొన్నారు. న్యాయవాది బాబ్జి పిసిసి మెంబర్ గాదిరెడ్డి వనమయ్య సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కామన ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.


కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : భీమవరం
2వ అంతస్తు, జె.పి. రోడ్డు, చిన్నమీరాం,
పశ్చిమ గోదావరి జిల్లా-534204.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
శ్రీ గీతా ఎంటర్‌ప్రైజస్, డి.నెం.5-21, మాదేపల్లి, జాలిపూడి పోస్టు, ఏలూరు, ప్రాతినిధ్యం వహిస్తున్న: (ఎ) శ్రీ ప్రసాదవు వెంకటేశ్వర రావు, తండ్రి: శ్రీ ప్రసాదవు నాగభూషణం, 5-21, మాదేపల్లి గ్రామం, జాలిపూడి పోస్టు, ఏలూరు జిల్లా. (బి) శ్రీ ప్రసాదవు సాయి బాబు, తండ్రి: నాగభూషణం, 5-21, మాదేపల్లి గ్రామం, జాలిపూడి పోస్టు, ఏలూరు జిల్లా. (సి) శ్రీ ప్రసాదవు వీర్రాజు, తండ్రి: నాగభూషణం, 5-21, మాదేపల్లి గ్రామం, జాలిపూడి పోస్టు, ఏలూరు జిల్లా.
డియర్ సర్/మేడమ్,

విషయం: సర్ఫేసి చట్టం, 2002 సెక్షన్ 13(8) క్రింద
తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ ప్రకటన.

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్దేశించిన ప్రతిపాదనకు అనుగుణంగా అమ్మకపు నోటీసు ప్రచురణ తేదికి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీచేయబడుచున్నది.

లోను అకౌంట్ శ్రీ గీతా ఎంటర్‌ప్రైజస్, డి.నెం.5-21, మాదేపల్లి, జాలిపూడి పోస్టు ఏలూరు వారిని బకాయి రూ. 7,82,16,828.24/- (అక్షరాల ఏడు కోట్ల ఎనభై రెండు లక్షల పదహారు వేల ఎనిమిది వందల ఇరవై ఎనిమిది రూపాయలు మరియు ఇరవై నాలుగు పైసలు) మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్, స్పెషలైజ్డ్ ఎస్ఎమ్ఇ బ్రాంచ్ ఏలూరు అధీకృత అధికారి 30.09.2016 తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది. 08-02-2017న మీ సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును ఆంధ్రజ్యోతి (తెలుగు) & ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది. 12-02-2017న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. 30.09.2016 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి రూ. 7,82,16,828.24/- (అక్షరాల ఏడు కోట్ల ఎనభై రెండు లక్షల పదహారు వేల ఎనిమిది వందల ఇరవై ఎనిమిది రూపాయలు మరియు ఇరవై నాలుగు పైసలు) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజల నుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటీ. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తేది: 07-01-2025, ప్రదేశం:భీమవరం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్



కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : భీమవరం
2వ అంతస్తు, జె.పి. రోడ్డు, చిన్నమీరాం,
పశ్చిమ గోదావరి జిల్లా-534204.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
మరణించిన ఋణగ్రహీత శ్రీ. బొమ్ముల రామభద్రరావు యొక్క చట్టబద్ధమైన వారసులు:
1. శ్రీ బొమ్ముల సుజాత, భర్త: లేటు శ్రీ రామభద్రరావు (మరణించిన ఋణగ్రహీత), 9-2-85 శివాలయం వీధి, కనకదుర్గ గుడి దగ్గర, తాడేపల్లిగూడెం-534101.
2. శ్రీ బొమ్ముల ఎస్ నాగ సాయి శ్రీ వెంకట రామారావు, తండ్రి: లేటు శ్రీ రామభద్రరావు (మరణించిన ఋణగ్రహీత), 9-2-85, శివాలయం వీధి, కనకదుర్గ గుడి దగ్గర, తాడేపల్లిగూడెం-534101.
3. కుమారి బొమ్ముల మోక్షిత, తండ్రి: లేటు శ్రీ రామభద్రరావు (మరణించిన ఋణగ్రహీత) తరుపున నేచురల్ గార్డియన్ శ్రీ బొమ్ముల సుజాత, 9-2-85, శివాలయం వీధి, కనకదుర్గ గుడి దగ్గర, తాడేపల్లిగూడెం-534101.
4. శ్రీ ఆరేటి ఎస్ కనకదుర్గ ప్రసాద్ (హామీదారు), తండ్రి: సత్యనారాయణ, డి.నెం.1-86-18/9, హౌసింగ్ బోర్డు కాలనీ, రెవెన్యూ వార్డు నెం.11, తాడేపల్లిగూడెం-534101.
డియర్ సర్/మేడమ్,

విషయం: సర్ఫేసి చట్టం, 2002 సెక్షన్ 13(8) క్రింద
తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ ప్రకటన.

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్దేశించిన ప్రతిపాదనకు అనుగుణంగా అమ్మకపు నోటీసు ప్రచురణ తేదికి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీచేయబడుచున్నది.

లోను అకౌంట్ శ్రీ బొమ్ముల రామభద్రరావు, వారిని బకాయి రూ. 30,36,919.09 (అక్షరాల ముప్పై లక్షల ముప్పై ఆరు వేల తొమ్మిది వందల పంతొమ్మిది రూపాయలు మరియు తొమ్మిది పైసలు) మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్, తాడేపల్లిగూడెం బ్రాంచ్ అధీకృత అధికారి 10-10-2023 తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది. 01-02-2024న మీ సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును ఆంధ్రజ్యోతి (తెలుగు) & ది హిందూ (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది.06-02-2024న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. 10-10-2023 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి రూ. 30,36,919.09 (అక్షరాల ముప్పై లక్షల ముప్పై ఆరు వేల తొమ్మిది వందల పంతొమ్మిది రూపాయలు మరియు తొమ్మిది పైసలు) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటీ. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తేది: 09-01-2025, ప్రదేశం:భీమవరం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్


# కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

## - ఎంఈఓ ని సన్మానించిన ఉపాధ్యాయ బృందం



చాట్రాయి, జనవరి 9, ప్రభాతవార్త : చాట్రాయి మండలం కొత్తగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు ముగ్గులు వేయటంతో పాటు సాంప్రదాయ బద్ధమైన ఆటలను ఆడి అందరినీ అలరించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రులు కూడా ఈ సంబరాలలో పాల్గొనడంతో అంబరాన్ని అంటాయి. ఉపాధ్యాయులు కూడా సాంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి పండుగ వాతావరణాన్ని కనబరిచారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి వి బ్రహ్మాచారిని ఉపాధ్యాయులు గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మాచారి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సంక్రాంతి పండుగ వైభవంగా జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం అన్నారు. బంధువులందరితో సంక్రాంతి పండుగను గ్రామీణ ప్రాంతాల్లో ఘనంగా జరుపుకుంటారని ఆయన చెప్పారు. ఏది ఏమైనా పూర్వీకుల నుండి వస్తున్న సాంప్రదాయాన్ని మరువకూడదని అన్నారు.


కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : భీమవరం
2వ అంతస్తు, జె.పి. రోడ్డు, చిన్నమీరాం,
పశ్చిమ గోదావరి జిల్లా-534204.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. శ్రీమతి నెల్లూరి పద్మావతి, భర్త: లేటు నెల్లూరి శివశంకర్, ఫ్లాట్.నెం.9, డోర్ నెం.8-126, ఫ్లాట్ నెం 202, మొదటి అంతస్తు, బ్లాక్-III, శ్రీ లక్ష్మి శ్రీనివాస టవర్స్, వెంకటాపురం గ్రామం, ఏలూరు మండలం, పశ్చిమగోదావరి-534002.
డియర్ సర్/మేడమ్,

విషయం: సర్ఫేసి చట్టం, 2002 సెక్షన్ 13(8) క్రింద
తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ ప్రకటన.

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్దేశించిన ప్రతిపాదనకు అనుగుణంగా అమ్మకపు నోటీసు ప్రచురణ తేదికి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీచేయబడుచున్నది.

లోను అకౌంట్ లేటు నెల్లూరి శివశంకర్ వారిని బకాయి రూ.11,63,126.56/- (అక్షరాల పదకొండు లక్షల అరవై మూడు వేల నూట ఇరవై ఆరు రూపాయలు మరియు యాభై ఆరు పైసలు) మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్, ఏలూరు బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి 17-04-2021 తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది. 06-09-2021న మీ సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును ఆంధ్రజ్యోతి (తెలుగు) & ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది 09-09-2021న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. 17-04-2021 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి రూ.11,63,126.56/- (అక్షరాల పదకొండు లక్షల అరవై మూడు వేల నూట ఇరవై ఆరు రూపాయలు మరియు యాభై ఆరు పైసలు) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు వారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటీ. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తేది: 01-01-2025, ప్రదేశం:భీమవరం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్



కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : భీమవరం
2వ అంతస్తు, జె.పి. రోడ్డు, చిన్నమీరాం,
పశ్చిమ గోదావరి జిల్లా-534204.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. శ్రీమతి. గొట్టిపాటి రత్నకుమారి, భర్త: గొట్టిపాటి వెంకటేశ్వరరావు, 3-126/1, నోవా ఇంజనీరింగ్ కాలేజీ దగ్గర, ఎన్.హెచ్ 16 బైపాస్, వేడిమెల్ల, ఏలూరు-534005.
2. శ్రీ. గొట్టిపాటి వెంకటేశ్వరరావు, తండ్రి: గొట్టిపాటి రంగారావు, నోవా ఇంజనీరింగ్ కాలేజీ దగ్గర, ఎన్.హెచ్ 16 బైపాస్, వేడిమెల్ల, ఏలూరు-534005.
డియర్ సర్/మేడమ్,

విషయం: సర్ఫేసి చట్టం, 2002 సెక్షన్ 13(8) క్రింద
తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ ప్రకటన.

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్దేశించిన ప్రతిపాదనకు అనుగుణంగా అమ్మకపు నోటీసు ప్రచురణ తేదికి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీచేయబడుచున్నది.

లోను అకౌంట్ M/s జి.ఆర్.కె ఆర్గానిక్స్, ప్రొప్రయిటర్: శ్రీమతి గొట్టిపాటి రత్నకుమారి వారిని బకాయి రూ.2,09,62,396.20/- (అక్షరాల రెండు కోట్ల తొమ్మిది లక్షల అరవై రెండు వేల మూడు వందల తొంభై ఆరు రూపాయలు మరియు ఇరవై పైసలు) మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్, ఏలూరు బ్రాంచ్ అధీకృత అధికారి తేది 01-01-2024న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది. 04-03-2024 న మీ సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మక/భౌతిక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును ఈనాడు (తెలుగు) & ది హిందూ (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది 08-03-2024 న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. 01-01-2024 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి రూ.2,09,62,396.20/- (అక్షరాల రెండు కోట్ల తొమ్మిది లక్షల అరవై రెండు వేల మూడు వందల తొంభై ఆరు రూపాయలు మరియు ఇరవై పైసలు) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటీ. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తేది: 01-01-2025, ప్రదేశం:భీమవరం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్


# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవం



ఏలూరు టౌన్,జనవరి 09,ప్రభాత వార్త :స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈరోజు ఉదయం విద్యార్థులు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ స్వామి వివేకానంద తన జీవితాంతం భారతదేశ ఔన్నత్యాన్ని చాటడానికి మరియు యువతను మేల్కొలిపి దేశాభివృద్ధిలో వారిని భాగస్వాములు చేయడానికి కృషి చేశారని అన్నారు.అనంతరం కళాశాల సిపిడిసి మెంబర్ ఎల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వామి వివేకానందుని బోధనల ద్వారా భౌతిక మరియు ఆధ్యాత్మిక వికాసాల్లో సమన్వయం సాధించాల్సిన అవసరం తెలుస్తుందన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రాంబాబు ప్రసంగించారు.తెలుగు అధ్యాపకులు ఎస్ పరమేశ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకట్రావు,కే రమేష్,డాక్టర్ ఎం విజయ్ కుమార్, టీవీఎస్ పద్మావతి,ఎం కృష్ణ చైతన్య,టి వెంకట దుర్గాప్రసాద్, డాక్టర్ పిఆర్ కావ్య శ్రీ,ఎస్ సుస్వలత,డి సుజాత తదితరులు పాల్గొన్నారు.

# కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు

అత్తిలి - జనవరి 9 ( ప్రభాత వార్త ): అత్తిలి మండలం లో సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ హెచ్చరించారు. కోడిపందాలకు స్థలాలు ఇచ్చినా , కత్తులు సమకూర్చునా ,బరులు ఏర్పాటుచేసినా , పేకాట , గుండాట ,కోతాట , అక్రమ మద్యం విక్రయించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోడిపందాలు నిరోధం కోసం మండల , గ్రామ స్థాయి లో కమిటీ లు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఎక్కడైనా కోడిపందాలు నిర్వహిస్తే సమాచారం పంచాయతీ కార్యదర్శి కి గాని , విఆర్ ఓ కు గాని , పోలీస్ స్టేషన్ కు గాని తెలియజేయాలని కోరారు.

# పెనుగొండ - పొదలాడ రహదారులకు మోక్షం, పితాని వెంకట్



పెనుమంట్ర, జనవరి-09, ప్రభాతవార్త: గత ఐదేళ్లలో గుంతల కూడా పూడిక చేయలేని అసమర్ధ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడారని, ప్రజా ప్రభుత్వం కూటమి ప్రభుత్వంలో రహదారులన్నీ గుంతల పూడ్చి కొత్త రోడ్లు నిర్మాణం చేపట్టామని మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ అన్నారు. గురువారం రూ. 1.00 కోటి నిర్మించే పెనుగొండ-పొదలాడ రహదారి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను తీర్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి చేసేందుకు నడుం బిగించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్క శ్యామల సోని శాస్త్రి, దొమ్మేటి దేవి, వేండ్ర రాము, కౌరు శీను, వెలగల శ్రీనివాసరెడ్డి, పిల్లి చాముండి కుడిపూడి శ్రీనివాస్ నూలి చిన్న గణేష్ షేక్ చోటు బాబు తదితరులు పాల్గొన్నారు.

# అత్తిలి మండలము లో సంక్రాంతి సంబరాలు.

అత్తిలి - జనవరి 9 ( ప్రభాత వార్త ):తణుకు శాసన సభ్యులు ఆరిమిల్లి.రాధాకృష్ణ ఆ ధ్వర్యంలో శనివారం రోజున ఉదయం 7.30 గంటల నుండి అత్తిలి బాయ్స్ హైస్కూల్ నందు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తారు. ఉదయం 7.00 గం.ల నుండి రంగ వల్లుల పోటీలలో పాల్గొనదలచిన వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. స్త్రీలకు వివిధ రకాల లో ఆటల పోటీలు నిర్వహిస్తారు. గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానం చేస్తారని తెలిపారు.

# ఈనెల 20 తేదీ నుండి రీ-సర్వే పనులు ప్రారంభం

పోడూరు(పాలకొల్లు ), జనవరి-09, ప్రభాతవార్త: పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామములో 20వ తేదీ నుండి రీ-సర్వే పనులు ప్రారంభించబడునని పాలకొల్లు తాసిల్దార్ వై. దుర్గ కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రీ-సర్వేపై దగ్గులూరు గ్రామ ప్రజలకు, రైతులకు10 తేదీన ఉదయం 10.00 గం.లకు దగ్గులూరు గ్రామము నందు గ్రామసభ నిర్వహించి అనంతరం గ్రామంలో గ్రామస్తుల అవగాహన కొరకు ర్యాలీ నిర్వహించబడునని తెలిపారు. గ్రామసభ మరియు ర్యాలీ నందు దగ్గులూరు గ్రామ ప్రజలు, రైతులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొనవలసినదిగా ఆయన కోరారు.

# సొసైటీలో ఎరువులను తనిఖీ చేసిన ఏవో .



అత్తిలి - జనవరి 9 ( ప్రభాత వార్త ):అత్తిలి మండలం లోని వరిగేడు, తిరుపతిపురం గ్రామలోని సహకార సంఘం ఎరువుల గోడౌన్ ను మండల వ్యవసాయాధికారి టి కే. రాజేష్ తనిఖీ చేశారు. మండలం లోని అన్ని ఎరువుల దుకాణాల లో ఎరువులు సమృద్ధి గా ఉన్నాయని తెలిపారు. ఎరువుల డీలర్లందరు ఎరువుల అమ్మకాలు ఎప్పటికప్పుడు ఈపోస్ మెషిన్ నందు నమోదు చేయలని కోరారు.

# వేణుగోపాలస్వామి కి విశేషం అభిషేకం .





అత్తిలి - జనవరి 9 ( ప్రభాత వార్త ):అత్తిలి గ్రామంలో వేంచేసియున్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారికి ధనుర్మసము ముక్కోటి ఏకాదశి ముందు రోజు అనగా దశమి రోజున స్వామివారికి అమ్మవారికి విశేషముగా పంచామృతములతో, పళ్ళ రసములతో,సుగంధ ద్రవ్యాలతో, అభిషేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సహస్రనామార్చన కార్యక్రమాలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి కృష్ణమాచార్యులు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలి



పోడూరు, జనవరి-09, ప్రభాతవార్త: మండలంలోని రైతులంతా ఈ-పంట నమోదు చేసుకోనుటకు రైతు సేవ రైతు సేవా కేంద్రానికి వెళ్లి తమ వివరాలు పొందుపరచుకోవాలని పోడూరు మండల వ్యవసాయ అధికారి జి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని కవిటం గ్రామంలో వరి నాట్లను పరిశీలించి రైతులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఫసల్ బీమా యోజన పథకం ఈనెల 15వ తేదీ వరకు పొడిగించడం జరిగిందన్నారు. దాల్వ పంటకు సంబంధించి ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం ద్వారా ఎకరాకు రూ. 615/-లతో కస్టమర్ సర్వీస్ సెంటర్, పోస్ట్ ఆఫీస్, సొసైటీ వల్ల వద్ద భీమా చేయించుకోవాలన్నారు.

# కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం .

అత్తిలి - జనవరి 9 ( ప్రభాత వార్త ):పిఠాపురం విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం వారి నేతృత్వంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నవమపీఠా అధిపతి డాక్టర్ ఉమర్ అలీషా ఆశీస్సులతో అత్తిలి గ్రామ ఆశ్రమ శాఖలో ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ను అత్తిలి పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భాస్కర రావు ప్రారంభించారు. ఆకివీడు గ్రామానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ దండు పద్మావతి సహకారం తో ఏర్పాటు చేశారు. పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భాస్కర్ రావు మాట్లాడుతూ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ మానవసేవయే మాధవ సేవగా భావించి అనేక కార్యక్రమాల చేపట్టడం అభినందనీయమన్నారు. కన్నాపురానికి చెందిన కట్టా లక్ష్మి మాట్లాడుతూ మహిళా సాధికారతకు స్వావలంబనకు పీఠం ఎంతగానో తోడ్పడుతుందని తెలియజేశారు.కార్యకర్త యర్రంశెట్టి శివన్నారాయణ మాట్లాడుతూ ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ద్వారా మానవాళికి ఎనలేని సేవలో చేస్తుందని తెలియజేశారు. అత్తిలి ఆశ్రమ శాఖ కమిటీ సభ సభ్యులు, అత్తిలి గ్రామం పురజనులు పాల్గొన్నారు.

# కోడిపందాలు, గుండాట, పేకాట ఆడితే కేసులు తప్పవు



పోడూరు(పెనుగొండ ), జనవరి-09, ప్రభాతవార్త: మండలంలో రాబోయే సంక్రాంతి దృష్ట్యా కోడిపందాల ను అరికట్టాలని మండల తాసిల్దార్ అనిత, పెనుగొండ ఎస్సై కె. గంగాధర్ కోడి పందెలు నిర్వహించే నిర్వాహకులకు నోటీసులు అమలు చేస్తామని తెలిపారు. మండలంలో ఎక్కడ కూడా ఎటువంటి ఆ సాంఘి కార్యక్రమాలు జరగకుండా చూడాలని, రెవెన్యూ సిబ్బందిని బృందాలుగా నియమించినట్లు తెలిపారు. ఎక్కడైనా కోడిపందాలు, పేకాట, గుండాట నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు జూదాలు జోలికి వెళ్లకుండా సంక్రాంతి పండుగ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు.

## జగన్...,తప్పుడు ప్రచారం, తప్పుడు రాతలు రాజకీయం మానుకో రొబ్బి



పెనుమంట్ర, జనవరి-09, ప్రభాతవార్త: జగన్...,తప్పుడు ప్రచారం, తప్పుడు రాతలు రాజకీయం మానుకో అని నరసాపురం పార్లమెంటు దేవాంగ బిసి సాధికార సమితి కన్వీనర్ రొబ్బి భాస్కర్ రావు హెచ్చరించారు. పెనుమంట్రలో గురువారం ఆయన మాట్లాడుతూ మీహయం లో తిరుపతి రుయా దుస్సంఘటన లో 13 మంది వరకు పేదలు ప్రాణాలు కోల్పోయారు, అప్పటి మీముఖ్యమంత్రి జగన్ గారు రాజీనామా చేశాడా? అని ప్రశ్నించారు. ఎంతో మంది అభాగ్యులు విషవాయువు పీల్చి ప్రాణాలు పోగొట్టుకున్నారు, ఎప్పుడైనా ఆలోచించారా అని అన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు దుర్ఘటనలో సుమారు 40 మంది పైగా చనిపోయారు అప్పుడు మీరు రాజీనామా ఎందుకు చెయ్యలేదన్నారు. కచ్చులూరు పడవ ప్రమాదంలో 60 మంది చనిపోయారు. కల్తీ సారా తాగి జంగారెడ్డి గూడెం లో 30 మంది చనిపోయారన్నారు. ఇప్పుడు చంద్రబాబుని రాజీనామా సమంజసమా? అని అన్నారు.

## 'బూమరాంగ్' టెర్రిఫిక్ ఫస్ట్ లుక్

పలు భాషలలో 34 చిత్రాలకు డీవోపీగా పనిచేసిన ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఆండ్రూ బాబు, అను ఇమ్మాన్యుయేల్, శివ కందుకూరి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. బిగ్ మూవీ మేకర్స్ లిమిటెడ్, ల్వీ3 ఆర్ట్స్ బ్యానర్లపై లండన్ గణేష్, డా. ప్రవీణ్ రెడ్డి వూట్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సితార ఫిల్మ్స్ లిమిటెడ్ లైన్ ప్రొడక్షన్‌ని నిర్వహిస్తోంది. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌ను విక్టరీ వెంకటేష్ లాంచ్ చేశారు. బూమరాంగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రం కర్మ ఇతివృత్తాన్ని రెండు సమాంతర కథాంశాలతో ఎడ్జ్ ఆఫ్ ది సీట్ థ్రిల్లర్‌గా ఉంటుందని హామీ ఇస్తుంది. ఈ టెర్రిఫిక్ ఫస్ట్ లుక్‌లో అను ఇమ్మాన్యుయేల్



షాక్ స్థితిలో, ఆమె తల నుండి రక్తం కారుతూ, క్రిమినల్ మాన్షన్‌లో వెంబడిస్తున్నట్లు చూపిస్తుంది. ఈ చిల్లింగ్ ఎట్మాస్పియర్ కుక్కలు, నిర్జీవ శరీరాల ప్రెజెన్స్ మరింత ఉత్కంఠను పెంచుతుంది. లండన్‌లోని బ్రెత్ టేకింగ్ ప్రదేశాలలో చిత్రీకరించబడిన బూమరాంగ్, ఒక అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ కోసం ఆండ్రూ బాబు సినిమాటోగ్రఫీ కూడా అందిస్తున్నారు, అనుప్ రూబెన్స్ సంగీతం సమకూర్చారు. కోటగిరి వెంకటేశ్వర రావు ఎడిటర్, దీలీర్ కిరణ్ ఆర్ట్ డైరెక్టర్. తారాగణం: అను ఇమ్మాన్యుయేల్, శివ కందుకూరి, వైవా హర్ష, వెన్నెల కిషోర్, ఎస్ నివాసిని, షాని సాల్మన్, మహేంద్ర తదితరులు. సాంకేతిక సిబ్బంది: ఫిల్మ్ ప్రొడక్షన్ కంపెనీ: బిగ్ మూవీ మేకర్స్ లిమిటెడ్, మై3 ఆర్ట్స్, నిర్మాతలు: లండన్ గణేష్, డా. ప్రవీణ్ రెడ్డి వూట్ల, లైన్ ప్రొడక్షన్స్: సితార ఫిల్మ్స్ లిమిటెడ్ డైరెక్టర్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: ఆండ్రూ బాబు, సంగీతం: అనూప్ రూబెన్స్, ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వ రరావు, ఆర్ట్ డైరెక్టర్: డిఆర్‌కె కిరణ్, సాహిత్యం: రామజోగయ్య శాస్త్రి, శ్రీమణి, కృష్ణ.

## 'నిన్ను నన్ను కన్న ఆడదిరా' సాంగ్

ఇక్కడికి అతిథిగా వచ్చిన సీతక్కకి, మీడియాకి నా నమస్కారం. ఈపాట చేయడానికి ముఖ్య కారణం మనం ప్రస్తుతం బయట చూస్తున్న పరిస్థితులు. కేన్సర్ కంటే దారుణంగా వ్యాపిస్తుంది ఈ రేప్ అనే వ్యాధి. నాకు ఈ పాట వినగానే యమలీల సినిమాలో పాట గుర్తొచ్చింది. దర్శకుడు రమణా రెడ్డి ఇక్కడ నుండి అమెరికా వెళ్లి మన దేశానికి ఏమైనా చేయలని అనుకుని తిరిగి వచ్చి ముందుగా ఈ పాటతో మొదలు పెట్టాడు. పాట విన్న వెంటనే నేను ఈ పాటని మన రాష్ట్రానికి, ఆడవారికి డెడికేట్ చేయాలి అనుకున్నాము. ఈ పాట పూర్తిగా అన్ని ఛానల్స్, ఆడియో కంపెనీలకు ఉచితం. కేవలం మంచి అనేది అందరికీ వెళ్ళాలి అనే ఉద్దేశంతో చేశాం. ఈ పాట మూడు మతాల వారు ఒక మెసేజ్‌తో ఇస్తే బాగ వెళ్తుంది అని ఈ విధంగా షూట్ చేయడం జరిగింది. అలాగే ఈ పాటలో నటించేందుకు ముంబై నుండి వచ్చినందుకు హీరోయిన్ కామ్నాకి ధన్యవాదాలు. నా సోదరి సమానురాలు సీతక్కకి ప్రత్యేక ధన్యవాదాలు. సీతక్క మాట్లాడుతూ, ఒక అద్భుతమైన ఆలోచనతో సమాజంలో జరిగే దురాభిప్రాయంతో ఉన్న ఈ పని చేయకూడదు అనే ఉద్దేశంతో వచ్చిన అందరికీ కృతజ్ఞతలు. రమణ రెడ్డికి, ఆలీకి, చిన్న వయస్సులో పెద్ద బాధ్యత కలిగిన కామ్నాకి కృతజ్ఞతలు. కామంతో కళ్ళు మూసుకునిపోయి మృగంలా ప్రవర్తించే వారిలో మార్పు రావాలి. కులం, మతం, వృత్తితో సంబంధం లేకుండా అత్యాచారాలు జరుగుతున్నాయి. స్నేహితుడు అని నమ్మి వచ్చిన వారిని, వయస్సుతో సంబంధం లేకుండా అలాంటి అత్యాచారాలు చేస్తున్నారు. ఇప్పటికే దీనిని అరికట్టడానికి ప్రభుత్వం తరుపున ప్రయత్నం చేస్తున్న సమయంలో ఈ పాట ఒక మంచి తొలి అడుగులా కనిపిస్తుంది. అత్యాచారం చేసే వారి వల్ల వారి సొంత కుటుంబం కూడా ఎన్నో అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పాటలు వల్ల సమాజానికి మార్పు రావడానికి చాలా వేగంగా ప్రజలలోకి వెళ్తుంది. ఈ పాట అందరిలో మార్పును



తీసుకొస్తుంది అని కోరుకుంటున్నాను. ప్రజలందరికీ ఈ పాట వెళ్లేవిధంగా సహాయ పడాలి. అలాగే చివరిగా అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. నిను నన్ను కన్న ఆడదిరా దర్శకుడు నిర్మాత రమణారెడ్డి మాట్లాడుతూ, ఇక్కడికి వచ్చిన మంత్రి సీతక్కకి, నటుడు ఆలీకి, నటి కామ్నాకి, మీడియా వారికి పేరుపేరునా నా నమస్కారం. ఈ పాట సమాజానికి మంచి చేసే విధంగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్కే న్యూస్ అధినేత బొల్లా రామకృష్ణ, నటుడు శ్రీనివాస్, నటి మంజులలతో పాటు శ్రీమతి జుబేదా ఆలీ తదితరులు.

## 'గాంధీ తాత చెట్టు' ట్రైలర్!



దర్శకుడిగా ప్రపంచస్థాయి గుర్తింపు సాధించిన ప్రముఖ దర్శకుడు సుకుమార్ బండ్రెడ్డి తనయురాలు సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం గాంధీ తాత చెట్టు. పద్మావతి మల్లాది దర్శకురాలు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, గోపీ టాకీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి శ్రీమతి తబితా సుకుమార్ సమర్పకురాలు. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధురావు నిర్మాతలు. ఇప్పటికే ఈ చిత్రం పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శింపబడి ఎన్నో అవార్డులు కైవసం చేసుకుంది. ఉత్తమ బాల నటిగా సుకృతి వేణి కూడా పురస్కారం పొందారు. జనవరి 24న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను సూపర్‌స్టార్, ప్రిన్స్ మహేష్‌బాబు తన సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. గాంధీ తాత చెట్టు ట్రైలర్ విడుదల చేయడం సంతోషంగా ఉంది. అందరి మనసులను హత్తుకునే సినిమాలా ఇది అనిపిస్తుంది. సుకృతికి మరియు ఈ సినిమా టీమ్ అందరికి నా అభినందనలు అంటూ ప్రిన్స్ మహేష్‌బాబు తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు. ట్రైలర్ చూస్తుంటే గాంధీ పేరు పెట్టుకున్న ఓ అమ్మాయి.. ఆయన బాటను, సిద్దాంతాలను అనుసరిస్తూ, తన తాతకుఇష్టమైన చెట్టును, తన ఊరును ఎలా రక్షించుకుంది అనే కథాంశంతో సినిమా తెరకెక్కినట్లుగాతెలుస్తుంది. గాంధీగా సుకుమార్, కుమార్తె సుకృతి వేణి ఈ సినిమాలో నటించారు.

## 24న 'హత్య' విడుదల

ప్రస్తుతం థ్రిల్లర్ జానర్ చిత్రాలకు మంచి డిమాండ్ ఉందన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే 'మధ' అంటూ సైకలాజికల్ థ్రిల్లర్‌తో అందరినీ మెప్పించిన శ్రీ విద్య బసవ 'హత్య' అనే మరో థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకులను మెప్పించటానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం జనవరి 24న రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఈ సినిమాను మహాకాళ్ పిక్చర్స్ పతాకంపై ఎస్ ప్రశాంత్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ధన్య బాలకృష్ణ, పూజా రామచంద్రన్, రవి వర్మ ప్రధాన పాత్రల్లో నటించారు. గురువారం ఈ మూవీ టీజర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ప్రముఖ నటుడు రవివర్మ చేతుల మీదుగా టీజర్ విడుదలైంది. ఈ సందర్భంగా, చిత్ర దర్శకురాలు శ్రీవిద్య బసవ మాట్లాడుతూ నా తొలి చిత్రం మధ సినిమాను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లిన మీడియాకు, ఆదరించిన అందరికీ ముందుగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఐదేళ్ల తర్వాత ఇప్పుడు నేను హత్య సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను అన్నారు. నటుడు రవివర్మ మాట్లాడుతూ, నటుడిగా ముందు నుంచి వైవిధ్యమైన సినిమాలు చేయటానికే ప్రాధాన్యమిస్తూ వచ్చాను. అందుకనే ప్రేక్షకుల ఆదరణ ఇప్పటి వరకు దక్కుతుంది. మధ సినిమా టీజర్ చూడగానే నేను శ్రీవిద్యకు కాల్ చేశాను. నేను కూడా సినిమాలో భాగం అవుతానని అన్నాను. చాలా చిన్న పాత్ర ఉందని చెప్పింది. నాకు నేనుగా వెళ్లి ఆ సినిమాలో యాక్ట్ చేశాను. అప్పుడు ఆమెతో ప్రారంభమైన ఆ జర్నీ ఇప్పుడు ఈ సినిమాలో ప్రధాన పాత్రలో నటించేలా




చేసింది అన్నారు. నటి పూజా రామచంద్రన్ మాట్లాడుతూ, నాకు కొడుకు పుట్టిన తర్వాత నటించిన తొలి సినిమాఇది. చాలా మంది నాకు సినిమాలు ఆఫర్ చేసిన నో చెబుతూ వచ్చాను. అయితే విద్యతో మాట్లాడిన తర్వాత ఫుల్ లెంగ్త్ క్యారెక్టర్ కాకపోయినా తప్పకుండా చేస్తానని చెప్పి మరీ యాక్ట్‌చేశాను. నాది కీ రోల్. సినిమానంత మార్చేసేచాలా ముఖ్యమైన పాత్రలో నటించాను. చాలా కాలం తర్వాత హత్య వంటి డిఫరెంట్ మూవీతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన డైరెక్టర్ శ్రీవిద్యకి థాంక్అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ నరేష్ కుమారన్.పి మాట్లాడుతూ, శ్రీవిద్య బసవ మంచి టాలెంటెడ్ డైరెక్టర్. ఏదీ ఒక పట్టాన ఒప్పుకోదు. కావాల్సిన ఔట్‌పుట్‌ను రాబట్టకుంటుంది. రవివర్మగారికి, పూజా రామచంద్రన్, ధన్య బాలకృష్ణకి థాంక్స్. ఎడిటర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, మా డైరెక్టర్ శ్రీవిద్య బోల్డ్ డైరెక్టర్. బోల్డ్ డిసిషన్స్ తీసుకుంటారు. ఆమెకథను హ్యాండిల్ చేసిన విధానం ఎంతో ఎంగేజింగ్‌గా ఉంది. ప్రతీ ఒక్కరూ ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుంది.




## కథను నమ్ముకునే 'తల్లి మనసు' తీశాం..

మంచి కథే సినిమాకు ప్రాణం. మొదట్నుంచి ఆ కథను నమ్ము కునే నేను సినిమాలను తీశాను.. తల్లి మనసు సినిమా కూడా ఇంటిల్లిపాది చేసే విధంగా చక్కగా రూపుదిద్దుకుంది అని చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య స్పష్టంచేశారు. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్ర ధారులుగా వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకత్వంలో ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై ముత్యాల సుబ్బయ్య తనయుడు ముత్యాల అనంత కిషోర్ నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను సైతం పూర్తి చేసుకుని ఈ నెల 24న విడుదలకానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్ లోని తమ సంస్థ కార్యాలయంలో ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ, "ప్రముఖ హీరోలందరితో సినిమాలుచేశాను. దర్శకుడిగా 50 సినిమాలను తీశాను. మంచి కథలను ఎంచుకోవడమే కాదు వాటికి తగ్గ మంచి టైటిల్స్ పెట్టి, ప్రేక్షకుల ఆదరణతో నా సినీ ప్రయాణం సాగింది. నా యాభై సినిమాలలో అద్భుత మైన సక్సెస్ సినిమాలేకాదు కొన్ని ఫెయిల్యూర్స్ కూడా లేకపోలేదు. అయినప్పటికీ ఏరోజు ఏదో ఒక సినిమా చేసెయ్యాలని, చుట్టేయాలని అనుకోలేదు. ఏదో ఒక కోణంలో సమాజానికి పనికి వచ్చే పాయింట్‌తో పాటు సెంటిమెంట్, కామెడీ, డ్రామా వంటి అంశాలను మేళవించి సినిమాలు చేశాను.


చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య

## 'డాకు మహారాజ్' ఒక పూర్తి ప్యాకేజ్ లా ఉంటుంది

నందమూరి అభిమానులతో పాటు, తెలుగు సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురు చూస్తున్న చిత్రం డాకు మహారాజ్. వరుస ఘన విజయాలతో దూసుకుపోతున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. సంక్రాంతి కానుకగా జనవరి 12న డాకు మహారాజ్ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రచార కార్యక్రమాలలో మరింత జోరును పెంచింది చిత్ర బృందం. ఈ క్రమంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన కథానాయిక శ్రద్ధా శ్రీనాథ్, సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. **బాలకృష్ణ గారి గురించి?** ఎన్నో ఏళ్ళ నుంచి సినీ పరిశ్రమలో ఉన్నాను, నేనొక బిగ్ స్టార్‌ని అనే అహం బాలకృష్ణలో కొంచెం కూడా ఉండదు. సెట్స్‌లో అందరితో సరదాగా ఉంటారు. తనకంటే చిన్నా పెద్దా అని చూడకుండా దర్శకుడికి ఆయన ఎంతో గౌరవం ఇస్తారు. సినిమా కోసం దర్శకుడు ఏం చెప్తే అది చేయడానికి ఎప్పుడూ సిద్ధంగాఉంటారు. **డాకు మహారాజ్ సినిమాలో నటించడం ఎలా ఉంది?** నేను ఇప్పటివరకు కొన్ని విభిన్న సినిమాలు చేశాను. అయితే ఈ చిత్రం మాత్రం ఒక పూర్తి ప్యాకేజ్ లా ఉంటుంది. ఇలాంటి నేను ఇప్పటి వరకు చేయలేదు. కామెడీ, యాక్షన్, ఎమోషన్ అన్నీ ఉంటాయి. పైగా బాలకృష్ణ సినిమా అంటే ఎక్కువ మంది ప్రేక్షకులకు నా ప్రతిభను చూపించే అవకాశం ఉంటుంది. **మీ పాత్ర ఎలా ఉండబోతుంది?** నా పాత్ర పేరు నందిని. చాలా సాఫ్ట్‌గా ఉంటుంది. ఎంతో ఓపిక ఉంటుంది. అదే సమయంలో ఎప్పుడు మాట్లాడాలో స్పష్టంగా తెలుసు. నా పాత్రలో ఎంతో డెప్త్ ఉంటుంది. **డాకు మహారాజ్ మీ సినీ కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపనుంది?** ఈ సినిమాపైనా, ఇందులో నేను పోషించిన నందిని పాత్ర పైనా ఎంతో నమ్మకంగా ఉన్నాను. నందిని పాత్రతో ప్రేక్షకులకు మరింత చేరువ కానున్నాను. **ఈ సినిమా ప్రయాణంలో మీకు ఛాలెంజింగ్‌గా అనిపించింది ఏంటి?** నటిగా ఈ సినిమా నుంచి ఎంతో నేర్చుకున్నాను. ముఖ్యంగా ఇందులో డైలాగ్‌లు కరెక్ట్ మెజర్‌లో ఉంటాయి. డబ్బింగ్ చెప్పడానికి ఎక్కువ సమయం తీసుకున్నాను. **మీ పాత్ర పరంగా జెర్సీ, డాకు మహారాజ్ సినిమాల్లో ఏది బెస్ట్ అంటే ఏం చెప్తారు?** రెండూ వేటికవే ప్రత్యేకం. జెర్సీలో నేను పోషించిన సారా పాత్ర నా మనసుకి బాగా నచ్చిన పాత్ర. ప్రేక్షకులు కూడా ఎంతో ఆదరించారు. ఇప్పుడు డాకు మహారాజ్‌లోని నందిని పాత్ర కూడా ప్రేక్షకులకు ఆ స్థాయిలో చేరువ అవుతుందనే నమ్మకం ఉంది. **సితార ఎంటర్టైన్మెంట్స్ గురించి?** సితార ఎంటర్టైన్మెంట్స్ నాకు జెర్సీ వంటి మెమరబుల్ ఫిల్మ్‌ని ఇచ్చింది. నాపై నమ్మకం ఉంచి, ఇప్పుడు డాకు మహారాజ్‌లో మరో మంచి పాత్ర ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. సితార ఎన్నో మంచి మంచి సినిమాలను నిర్మిస్తూ ఉంటుంది.


కథానాయిక శ్రద్ధా శ్రీనాథ్

## 'రాచరికం' ట్రైలర్ లాంచ్

అప్సరా రాణి, విజయ్ శంకర్, వరుణ్ సందేశ్ ప్రధానపాత్రల్లో 'రాచరికం' అనే చిత్రం తెరకెక్కింది. ఈశ్వర్ నిర్మాతగా చిల్ బ్రోస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై ఈ మూవీని నిర్మించారు. సురేశ్ లంకలపల్లి, ఈశ్వర్ వాసె ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన కంటెంట్, పాటలు, పోస్టర్లతో అందరిలోనూ అంచనాలను పెంచేసింది. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను స్టార్ డైరెక్టర్ మారుతి రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఈ మూవీ ట్రైలర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఇందులో అప్సరా రాణి, విజయ్ శంకర్, వరుణ్ సందేశ్ కనించిన తీరు, డిఫరెంట్ లుక్స్, నటించిన విధానం చాలా కొత్తగా ఉంది. విలేజ్ పొలిటికల్ రివేంజ్ డ్రామాగా రాబోతున్న ఈ మూవీ ట్రైలర్ చూస్తే రోమాలు నిక్కబొడుచుకుంటాయి."రాచకొండ ఒక అడవి లాంటిదబ్బా.. ఈడ బలంతో పోరాడే పులులు, బలగంతో పోరాడే ఏనుగులు, ఎత్తుకు పై ఎత్తు వేసే గుంట నక్కలు, కాసుకుని కాటేసే విష సర్పాలు ఉంటాయి. వాటి మధ్య జరిగే పోరులో రక్త పాతాలే తప్పా రక్త సంబంధాలు ఉండవు అంటూ సాగిన ఈ ట్రైలర్ ఆద్యంతం అద్భుతంగా ఉంది. విజువల్స్, యాక్షన్, బీజీఎం ఇలా అన్నీ నెక్స్ట్ లెవెల్లో ఉన్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ వేంగి, ఆర్య సాయి కృష్ణ కెమెరా వర్క్, రామ్ ప్రసాద్ మాటలు ఈ ట్రైలర్‌కి ప్లస్ అయ్యాయి. ఈ సినిమాను ఫిబ్రవరి 1న విడుదల చేయనున్నారు. నటీనటులు: అప్సర రాణి, విజయ్ శంకర్, వరుణ్ సందేశ్, హైపర్ ఆది, రంగస్థలం మహేష్, విజయ రామరాజు, శ్రీకాంత్ అయ్యంగార్, మహబూబ్ బాష, రూపేష్ మర్రాపు, ప్రాచీ థాకర్, లత, ఈశ్వర్ తదితరులు. సాంకేతిక బృందం: బ్యానర్: చిల్ బ్రోస్ ఎంటర్టైన్మెంట్, నిర్మాత: ఈశ్వర్, దర్శకత్వం: సురేష్ లంకలపల్లి, ఈశ్వర్ వాసె, ఎడిటర్: జేపీ, డీఓపీ: ఆర్య సాయి కృష్ణ, సంగీతం: వేంగి, పీఆర్‌ఓ: సాయి సతీష్.



## 'హైందవ' గూస్‌బంప్స్ టైటిల్ గ్లింప్స్ రిలీజ్

యాక్షన్ హల్క్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అకల్ట్ థ్రిల్లర్ బిఎస్ఎస్12, డెబ్యూటెంట్ డైరెక్టర్ లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మూన్‌షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై మహేష్ చందు నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్‌లతో చాలా క్యురియాసిటీ క్రియేట్ చేశాయి. సంయుక్త ఫీమేల్ లీడ్‌గా నటిస్తున్న ఈ హైబడ్జెట్ మూవీ కథ శతాబ్దాల నాటి దశావతార ఆలయం చుట్టూ వుంటుంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌తో వచ్చిన మేకర్స్ బ్రెత్ టేకింగ్ గ్లింప్స్ ద్వారా సినిమా టైటిల్‌ను లాంచ్ చేశారు. గ్లింప్స్ ఒక దట్టమైన అడవిలో సెట్ చేయబడిన టెర్రిఫిక్ విజువల్ తో ఓపెన్ అయింది. ఒక దుండగుల బృందం పవిత్రమైన దశావతార ఆలయానికి నిప్పు పెట్టడం ద్వారా దానిని నాశనం చేయడానికి ప్రయత్నిస్తుంటారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ బైక్ నడుపుతూ పవర్ ఫుల్ ఎంట్రీ ఇచ్చారు. సింహం, అడవి పంది వెంటరావడం, డేగ (గరుడ) పైకి ఎగురడం కనిపిస్తోంది. ఆలయ చెరువులోని చేపలు కోపంతో దూకుతున్నాయి, తాబేలు గమనించడం ఆసక్తికరంగా వుంది. హీరో చేతిపై ఉన్న పచ్చబొట్టు ఆలయంలోని నాగదేవత (ఆదిశేష అవతారం)కి అద్దం పడుతుంది. ఆలయాన్ని ధ్వంసం చేసే ప్రయత్నాన్ని హీరో అడ్డుకోవడంలో పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్ అదిరిపోయింది. ఒక పవర్ ఫుల్ మూమెంట్ లో అతను ఒక ఎద్దుల బండిని తగులబెట్టాడు, విలన్‌లను దారంతో బంధిస్తాడు, మంటలు పవిత్రమైన విష్ణు నామాలు ఆకారాన్ని ఏర్పరుస్తాయి. ఈ మూలాంశం సింహం, అడవి పంది ముఖాలపై కూడా కనిపిస్తుంది, ఆకాశంలో విష్ణువు బహుళ రూపాలు కనిపిస్తాయి. చివరగా, హిందూయిజం సారాంశంతో ప్రతిధ్వనించే హైందవ టైటిల్‌ను రివిల్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే ఈ చిత్రానికి ఇది నిజంగా గొప్ప పాన్‌ఇండియా టైటిల్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ రగ్గడ్‌లో పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు, అతని మాచో అవతార్ అదిరిపోయింది. అతని స్క్రీన్ ప్రెజెన్స్ కట్టిపడేసింది. విజువల్స్ అద్భుతంగాఉన్నాయి, ప్రతి క్షణం ఇంటెన్స్‌ని పెంచే శివేంద్ర కెమెరావర్క్ బ్రిలియంట్‌గా వుంది. లియోన్ జేమ్స్ కంపోజ్ చేసిన పవర్ ఫుల్ బ్యాక్‌డ్రాప్ స్కోర్‌తో ఆధ్యాత్మిక వాతావరణం ఎలివేట్ చేసింది, రామ కృష్ణ కీర్తనలు ట్రాన్స్ లాంటి అనుభూతిని ఇచ్చాయి. విష్ణు అవతారాలు, నామాలు బ్యాక్ డ్రాప్‌లో డైరెక్టర్ లుధీర్ బైరెడ్డి డైరెక్షన్, విజన్ కట్టిపడేసింది. మూన్ షైన్ పిక్చర్స్ అత్యద్భుతమైన సిజి వర్క్, అత్యున్నతస్థాయి నిర్మాణం సినిమాను ఎలివేట్ చేశాయి. ఎడిటర్ కార్తీక శ్రీనివాస్ ఆర్, ఆర్ట్ డైరెక్టర్ శ్రీనాగేంద్ర తంగాల నైపుణ్యం ప్రతి ఫ్రేమ్‌లో కనిపించింది. ప్రస్తుతానికి, 35శాతం షూటింగ్ పూర్తయింది, గూస్‌బంప్‌లను అందించిన గ్లింప్స్ ఈ హైబడ్జెట్ పాన్‌ఇండియా చిత్రం నుంచి రాబోయే కంటెంట్ కోసం ఎదురుచూసేలా చేసింది. హైందవ టైటిల్ గ్లింప్స్ చాలా క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. నటీనటులు: బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సంయుక్త. సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: లుధీర్ బైరెడ్డి, నిర్మాత: మహేష్ చందు, బ్యానర్: మూన్‌షైన్ పిక్చర్స్, సమర్పణ: శివన్ రామకృష్ణ, డీవోపీ: శివేంద్ర, సంగీతం: లియోన్ జేమ్స్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్. ఆర్ట్: శ్రీనాగేంద్ర తంగాల, పబ్లిసిటీ డిజైనర్: అనంత్ కంచెర్ల, పీఆర్వో: వంశీశేఖర్.



# మోక్షానికి సోపానం వైకుంఠ ఏకాదశి




ఏడాదికి 24 ఏకాదశులు వస్తాయి. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు. సూర్యుడు ధనుస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణం వరకు జరిగే 'మార్గం' మధ్య ముక్కోటి ఏకాదశి వస్తుంది. ఈ రోజున వైకుంఠ వాకిళ్ళు తెరుచుకుని ఉంటాయని వైష్ణవాలయాలలో గల ఉత్తర ద్వారం దగ్గర భక్తులు తెల్లవారు జామునే భగవద్దర్శనార్థం వేచి ఉంటారు. ఈ రోజు మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శన మిస్తాడు కనుక దీనికి ముక్కోటి ఏకాదశి అనే పేరు వచ్చిందంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమమైన పవిత్రతను సంతరించుకున్నందువల్ల దీన్ని ముక్కోటి ఏకాదశి అంటారని కూడా చెబుతారు. ముక్కోటి ఏకాదశి నాడే హాలాహలం, అమృతం రెండూ పుట్టాయి. ఈ రోజునే శివుడు హాలాహలం మింగాడు. మహాభారత యుద్ధంలో భగవద్గీతను కృష్ణుడు అర్జునునికి ఇదే రోజున ఉప దేశించాడని విశ్వాసం ఉంది.గీతోపదేశం జరిగిన రోజు కనుక 'భగవద్గీత' పుస్తకదానం చేస్తారు.

**వైకుంఠ ఏకాదశి ఎప్పుడు జరుపుకుంటారు...?** వైకుంఠ ఏకాదశిని ప్రతి సంవత్సరం శుక్ల పక్షం లేదా హిందూ క్యాలెండర్‌లోని మార్గశిర లేదా మార్గళి మాసంలోని పదకొండవ చంద్ర రోజున జరుపు కుంటారు. ఈ రోజున చంద్రుడు వృషభరాశిలో ఉంటాడు.సూర్యుడు ధనస్సు రాశిలో సంచరిస్తాడు. వీరి ప్రభావం 5 రాశుల వారిపై ఎక్కువగా కనిపిస్తుంది. ఇందులో మేషం, కర్కాటకం, తుల, ధనుస్సు, మీన రాశుల వారు ఉంటారు.

**మురాసురుడి కథ:** కృతయుగంలో ముర అనే రాక్షసుడు దేవతలను, సత్పురుషులను బాధించేవాడు. దేవతలు తమ గోడును విష్ణుమూర్తికి విన్నవించి, రక్షించమని ప్రార్థించారు. విష్ణువు మురాసురుడిపై దండెత్తి, మొదట రాక్షస సైన్యాన్ని సంహరించాడు. కాని మురాసురుడు మాత్రం తప్పించుకొని వెళ్లి, సాగ రగర్భంలో దాక్కున్నాడు. మురాసురుణ్ని బయటకు రప్పించే ఉపాయాన్ని విష్ణువు ఆలోచించి, ఒక గుహ లోకి వెళ్లాడు. విష్ణువు నిద్రిస్తున్నాడని భ్రమించిన మురాసురుడు, విష్ణువును వధించడానికి అదే అను వైన సమయమని కత్తిని ఎత్తాడు. అంతే! వెంటనే మహాలక్ష్మి దుర్గ రూపంలో అక్కడ ప్రత్యక్షమై, మురాసురుణ్ని సంహరించింది. విష్ణువు లేచి ఆమెను మెచ్చుకొని, ఆమెకు 'ఏకాదశి' అనే బిరుదునిచ్చాడు! అప్పటినుంచి ఏకాదశీ వ్రతం ప్రాచుర్యం పొందింది.

**పండగ ఆచరించు విధానం:** ఈరోజు పూర్తిగా ఉపవసించాలి; తులసి తీర్థం తప్ప ఏదీ తీసుకోకూడదు. ద్వాదశి నాడు అతిథి లేకుండా భుజించకూడదు. ఈనాడు ఉపవసించినవారు పాప విముక్తులవుతారంటారు. ఉపవాసం వల్ల జీర్ణాశయానికి విశ్రాంతి లభించడం ఆరోగ్యప్రదం. ఆధ్యాత్మిక సాధకుల ఆరోగ్య సుస్థిరతకు ఉపవాసమెంత దివ్యౌస్రం. ఔషధం సేవించేటప్పుడు అనుపానంగా చేయవలసిన పత్యమే ఉపవాసం. 'లంఖణం పరమౌషధమ్'మనే నానుడి తెలిసిందే. ఉప అంటే దగ్గర, వాసం అంటే ఉండటం; దైవానికి దగ్గర వాసమే ఉపవాసంలోని ఆశయం. పూజ, జపం, ధ్యానం లేదా ఉపాసన మొదలైన సాధనల ద్వారా మనసును మాధవుడిపై లగ్నం చేయాలి. ఏకాదశి



**వ్రత నియమాలు :** 1. దశమి నాడు రాత్రి నిరాహారులై ఉండాలి. 2. ఏకాదశి రోజు మొత్తం ఉపవాసం ఉండాలి. 3. అసత్య మాడరాదు. 4. స్త్రీ సాంగత్యం పనికి రాదు. 5. చెడ్డ పనులు, దుష్ట ఆలోచనలు చేయకూడదు. 6. ఆ రోజు రాత్రంతా జాగారం చేయాలి. 7. అన్నదానం చేయాలి. అందువేత ముక్కోటి ఏకాదశి రోజున నిష్ఠతో పూజ నియమాలు ఆచరించే వారికి పుణ్యఫలముతో పాటు కార్యానుసిద్ధి చేకూరుతుందని జ్యోతిష్య నిపుణులు అంటున్నారు. ఇంకా వైకుంఠ ఏకాదశి రోజున నిష్ఠనియమాలతో వ్రతమాచరించే వారికి మరో జన్మంటూ ఉండదని పురాణాలు చెబుతున్నాయి. ముక్కోటి ఏకాదశిన మరణించేవారికి వైకుంఠవాసం సిద్ధిస్తుందని, స్వర్గంలోని తలుపులు వారికోసం తెరిచే ఉంటాయని శాస్త్రాలు పేర్కొంటున్నాయి. ముల్లోకా లను నడిపించే విష్ణుమూర్తిని ముక్కోటి ఏకాదశిన స్తుతించే వారికి మోక్షం ప్రాప్తిస్తుంది. ఇకపోతే... వైకుంఠ ఏకాదశి రోజున జాజిపువ్వులతో అల్లినమాలను విష్ణు మూర్తికి సమర్పించినట్లైతే సర్వపాపాలు తొలగి పోతా యని పురాణాలు చెబుతున్నాయి. జాజిమాలను విష్ణు మూర్తి పటానికి వేసి, పాయసం, తీపి పదా ర్థాలు, ఆకుపచ్చని పండ్లను నైవేద్యం సమర్పించి శ్రీహరిని స్తుతించడం శుభప్రధమని పండితులు చెబుతున్నారు. ఆ రోజున మధ్యాహ్నం 12 గంటల్లోపు పూజను పూర్తి చేయాలి. దీపారాధనకు ఎర్రటి ప్రమిదలను ఉపయోగించాలి. వెలిగించే వత్తులు తామర వత్తులుగా, వాటి సంఖ్య ఐదుగా ఉండాలి.కొబ్బరి నూనెను వాడాలి. ముక్కోటి ఏకాదశి నాడు చేసే విష్ణు పూజ, గీతా పారాయణం, గోవింద నామస్మరణం, పురాణ శ్రవణం మోక్ష ప్రాప్తి కలిగిస్తాయి. ఇవన్నీ చేయక పోయినా.. ఓం నమోనారాయణాయ అనే మంత్రాన్ని 108 సార్లు జపించడం ద్వారా మీరనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తవుతాయి. ఇంకా ఏకాదశి రోజు విష్ణు, వేంకటేశ్వర స్వామి ఆలయాలను దర్శించు కోవచ్చు.ఇంకా వైకుంఠ ఏకాదశి రోజున నిష్ఠనియ మాలతో వ్రతమాచరించే వారికి మరో జన్మంటూ ఉండదని పురాణాలు చెబుతున్నాయి. ముక్కోటి ఏకాదశిన మరణించేవారికి వైకుంఠవాసం సిద్ధిస్తుంద ని, స్వర్గంలోని తలుపులు వారికోసం తెరిచే ఉంటా యని శాస్త్రాలు పేర్కొంటున్నాయి. ముల్లోకాలను నడిపించే విష్ణుమూర్తిని ముక్కోటి ఏకాదశిన స్తుతించే వారికి మోక్షం ప్రాప్తిస్తుంది.

**వైకుంఠ ద్వారం:** శ్రీరంగం లోని శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు 21 రోజులు జరుగుతాయి. దీనిలో మొదటి భాగాన్ని పాగల్ పట్టు (ఉదయం పూజ) అని రెండవ భాగాన్ని ఇర పట్టు (రాత్రి పూజ) అని పిలుస్తారు. విష్ణువు అవతారమైన రంగనాథస్వామిని ఆరోజు వజ్రాలతో చేసిన వస్త్రాల్ని అలంకరించి వెయ్యి స్తంభాల ప్రాంగణంలోనికి వైకుంఠ ద్వారం గుండా తీసుకొని వచ్చి అక్కడ భక్తులకు దర్శన మిస్తారు. ఈ ద్వారం గుండా వెళ్ళిన భక్తులు వైకుంఠం చేరుకుంటా రని భక్తుల నమ్మకం. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో కూడా ఇదే మాదిరిగా కాకుండా ముందు దైవదర్శనం; తదనంతరం వైకుంఠ ద్వారా ప్రవేశానికి అనుమతి స్తారు. ఈ ఏకాదశికి ముందురోజు అనగా దశమినాటి రాత్రి ఏకాంత సేవానంతరం బంగారు వాకిలి మూసి వేస్తారు. పిదప తెల్లవారు జామున వైకుంఠ ఏకాదశి నాడు సుప్రభాతం మొదలు కొని మరునాడు అనగా ద్వాదశినాటి రాత్రి ఏకాంత సేవ వరకూ శ్రీవారి గర్భాల యానికి ఆనుకొని యున్న వైకుంఠ ద్వారాన్ని తెరచి వుంచుతారు. ఈ రెండు రోజులూ భక్తులు శ్రీవారి దర్శనం తర్వాత ముక్కోటి ప్రదక్షిణ మార్గంలో వెళ్తారు. వైకుంఠ ఏకాదశి రోజున ప్రతిఒక్కరూ బ్రాహ్మి ముహూర్తంలో లేచి స్నానాదులు పూర్తిచేసుకోవాలి. భక్తి శ్రద్ధలతో వైష్ణవ ఆలయాలు దర్శించాలి. ముఖ్యంగా మహా విష్ణువును ఉత్తర ద్వారం ద్వారా దర్శించు కుంటే ఆయన అనుగ్రహంతో పాటు శుభాలు కలుగుతాయి. ఈరోజు విష్ణు సహస్రనామ పారా యణం చేయడం వల్ల సమస్త పాపాలు తొలగి భగవంతుడి అనుగ్రహం కలుగు తుంది. ఈరోజు ఉపవాసం ఉండి ఎవరైతే మహా విష్ణువును ఆరాధిస్తారో.. ఉత్తరద్వార దర్శనం చేసుకొని విష్ణు సహస్రనామ పారాయణం చేస్తారో వారికి దైవ అనుగ్రహం కలిగి మోక్షానికి మార్గం ఏర్పడుతుంది. "సర్వేజనా సుఖినోభవంతు"

- రేపాక రఘునందన్

## తిరుప్పావై

**26వ పాశురము**



మాలే! మణివణ్ణా ! మార్గళి
నీరాడువాన్,
మేలైయార్ శెయ్వనకళ్
వేండువన
కేట్టియేల్, ఇలత్తైయెల్లామ్
నడుంగ ముఱల్వన,
పాలన్నవణ్ణత్తు ఉన్పాఞ్ఞ
శన్నియమే,
పోల్వనశంగమ్ గళ్ పోయే
ప్పాడుడై యనవే,
శాలప్పెరుమ్ పఱైయే
పల్లాండిశైప్పారే,
కోళవిళక్కే కొడియే వితానమే,
ఆలినిలైయాయ్ ! అరుళేలో
రెమ్బావాయ్.

ఆశ్రితులను కాపాడువాడా. మణినిపోలిన శరీర కాంతి గలవాడా. మంచి స్వభావము కలవాడా. మార్గశిర స్నానము చేయుటకు మాకు కావలసిన వస్తువులు కోరి వచ్చినాము. ఈ వ్రతము పూర్వము పెద్దలు ఆచరించినారు. ప్రపంచము వణుకునట్లు ధ్వనిచేయునది, పాలను పోలిన వర్ణముగల పాంచజన్యమును పోలిన అనేక శంఖములు, పెద్దదైన ఖిపరఖి యనువాద్యము మంగళగానము చేయు భాగవతులు, మంగళదీపములు, ధ్వజమున్ను మేలుకట్టును మాకు ఇమ్ము అని గోపికలు శ్రీకృష్ణుణ్ణి ప్రార్థిస్తున్నారు. ఫలం: "పరమపదం లభిస్తుంది"

## ల్యాప్‌టాప్‌ని ఎలా క్లీన్ చేస్తున్నారు ?



పిల్లలు, పెద్దలు అని లేరు.. ఈ రోజుల్లో ల్యాప్టాప్ వినియోగం మారింది. అయితే దీన్ని ఉపయోగించడం తోనే సరిపోదు.. ఆనందం క్లీన్ చేసుకోవడమూ ముఖ్యమే. ఈ కోసం కొంతమంది తెలిసో, తెలియకో కొన్ని పొరపాట్లు చేస్తారు. అది ల్యాపీ పనితీరును దెబ్బతీస్తుందని నిపుణులు చెబుతున్నారు. మరి, ఇంతకీ ఏంటా పొరపాట్లు? తెలుసుకొని సరిదిద్దుకుందాం రండి..

**ఆ టవల్ వద్దు!** ల్యాపీ మనకు, క్లీన్ చేసినా చేయకపోయినా.. స్క్రీన్ మాత్రం రోజూ తుడవడం అలవాటు. అయితే ఈ కోసం కొంతమంది కిచెన్ టవల్, పేపర్ న్యాప్కిన్లు.. వాడుకుంటారు. నిజానికి ఇవి కాస్త గరుకుగా ఉండటం వల్ల స్క్రీన్‌పై సన్నని గీతలు పడే అవకాశం ఉంటుంది. అందుకే ఇలా జరగకూడదంటే, ల్యాపీ స్క్రీన్‌ను మైక్రోఫైబర్ క్లాత్‌తో శుభ్రం చేయడం ఉత్తమం. ల్యాప్‌టాప్ కీబోర్డు సందుల్లో దుమ్ము ఎక్కువగా చేరడం మనం గమనించచ్చు. దీన్ని తొలగించడానికి చాలామంది హెయిర్బ్, టూత్, వంటి గరుకైన ప్రకటితో కూడిన బ్రష్ వాడుతుంటారు. అయితే



దీనితో శుభ్రం చేయడం వల్ల కీబోర్డ్ కీస్ అటూ ఇటూ కుతూ డ్యామే అయ్యేజ్ అస్కారమే ఎక్కువ పదులుగా కూడా తయారవుతాయి. కాబట్టి ఇలాంటి క్రిస్టియన్ బదులుగా మృదువుగా ఉంటే మేయ్ బ్రష్ లేదా సన్నటి పాయింట్ ఉన్న కంప్యూటర్ బ్రష్ వాడితే కీబోర్డ్ డ్యామేజ్ కాకుండా దుమ్మును వదిలించుకోవచ్చు.

**వాటితో చేయవద్దు!** నీటికి అర్థాలు టీవీ స్క్రీన్ శుభ్రం చేసే లిక్విడ్నే ల్యాప్‌టాప్ క్లీనింగ్ కోసం చాలామంది వాడుకుంటారు. అయితే వీటిలోని రసాయనాల వల్ల ల్యాపీ స్క్రీన్ కోటింగ్ దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి వీటికి బదులుగా బయట మార్కెట్లో ల్యాప్‌టాప్ కోసం ప్రత్యేకమైన క్లీనింగ్ లిక్విడ్స్ దొరుకుతున్నాయి. వాటిని ఉపయోగించవచ్చు. అది కూడా నేరుగా స్ప్రే చేయకుండా.. మైక్రోఫైబర్ క్లాత్పై స్ప్రే చేసి.. దాంతో ల్యాపీని క్లీన్ చేయడం ఉత్తమం. అలాగే ల్యాప్టాప్ క్లీన్ చేస్తున్న ప్రతిసారీ విద్యుత్ కనెక్షన్ లేకుండా చూసుకోవాలి. అది కూడా వాడిన వెంటనే కాకుండా.. ఉపయోగించే ముందు, అంటే వేడెక్కక ముందు క్లీన్ చేయడం మంచిది.

## కంపెనీలు కోరుకునే నైపుణ్యం !

కొవిడ్ పరిణామాల కాలంలో పని విధానంలో చాలా మార్పులే వచ్చాయి. కృత్రిమ మేధస్సు వినియోగమూ పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో మారుతోన్న అవసరాలకు తగ్గట్లు నైపుణ్యాలూ మారితేనే కదా మనం ఉద్యోగంలో నిలదొక్కుకునేది. మరి కంపెనీలు ఎలాంటి వారికి ప్రాధాన్యత ఇస్తాయో తెలుసా.. అందరూ ఒకేలా ఆలో చిస్తే



ఫలితాలూ ఒకేలా ఉంటాయి. పరిధులు దాటి ఆలోచించినప్పుడే కదా అద్భుతాలు సృష్టించేది! అందుకే కంపెనీలు క్రియేటివ్ థింకింగ్ ఉన్నవారిని నియమించు కునేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ చేసిన తాజా సర్వే తెలిపింది. కొత్తగా ఆలోచించడం, సమస్యలను పరిష్కరించడం, పరిస్థితులకు తగినట్లు మారగలిగే తత్త్వం.. వంటి నైపున్యాలు ఉన్న వారిని ఎంపిక చేసుకోవడానికే సంస్థలు మొగ్గు చూపుతున్నాయట. ఈ పోటీ ప్రపంచంలో సవాళ్లను తట్టుకుని నిలబడగలగాలంటే సక్రియేటివిటీ చాలా అవసరం. ఇది మనకు చేసే పనిలో సంతృప్తినీ ఇస్తుంది. వ్యక్తిగతంగానూ, వృత్తిపరంగానూ ఎదగడానికీ సాయపడుతుంది. అందుకే ఎప్పుడూ కొత్త ఆలోచనలను పంచుకోవడానికీ సంకోచించకండి. కొత్త ప్రాజెక్టుల బాధ్యతలు తీసుకోవ డానికీ వెనకా డొద్దు. అప్పుడే కదా మన నైపు ణ్యాలూ పెరిగేది. కెరియర్‌లో దూసుకెళ్లేది. చూసుకోండి మరి!

## పాతవే ఫ్యాషన్ ట్రెండ్

ఈ ఏడాది నవవధువులను గమనించారా? పాతతరం బ్లవుజులకే ఎక్కువ మొగ్గు చూపారు. మోడరన్ పెళ్లికూతుళ్లు... పెళ్లి విషయంలోనూ ఆధునికంగా ఆలోచించాలి కదా? బామ్మల, పాతకాలం నాటి ఫ్యాషన్ల గురించి ఎందుకు ఆలోచిస్తున్నారు? ఎవరబ్బా అని అంతగా ఆలోచించకండి. పెళ్లికూతురిని చేసేటప్పుడు శోభిత ధూళిపాళ పొడవు చేతుల బ్లవుజునే ఎంచుకుందా? ఆ మొన్న అదితీరావు హైదరీ, అంబానీల కోడలు రాధికా మర్చంట్ కూడా అంతే! ఈ ఏడాదే పెళ్లిబంధంలోకి అడుగుపెట్టిన రకుల్ ప్రీత్ కూడా తన లెహెంగాకి పొడవు చేతుల జాకెట్నే వేసుకుంది. ఇప్పటిదా ఈ ఫ్యాషన్! తొంభైల నాటిది: ఆధునికతకు నిలువుటద్దంలా ఉండే వీళ్లు... ఈ స్టైల్‌పై మనసు పడ్డారెందుకు? అంటే.. దీనివెనక చిన్న ఆలోచన ఉందంటారు ఫ్యాషనిస్టులు. ఆలోచనలు ఎంత వేగంగా, గొప్పగా వెళుతున్నా... తమదైన రోజున సంప్రదాయానికే ఓటేస్తున్నారు నేటి యువతులు. ఒక్కోరకం స్టైల్ ఒక్కొక్కరికి నప్పుతుందనేది మనకు తెలుస్తుంది. అయితే ఇది ఫుల్ స్లీవ్స్ కి మాత్రం వర్తించదట. ఇది ఏ శరీరాకృతి వారికైనా నప్పుతుందట. పైగా తక్కువ నగలు పెట్టి... వాటినే ప్రభావవంతంగా కనిపించేలా చేయాలనుకుంటోంది నేటి తరం. సాదా బ్లవుజనుకోండి... శోబిత, అదితీల్లా కాస్త భారీగా కనిపించే నెక్లెస్ పెట్టిన కళ వచ్చేస్తుంది. అవసరమైతే ఒక గాజు, వంకీల సాయం తీసుకోవచ్చు. అదీ వద్దు అనుకుంటే చేతులకు అందమైన డిజైన్ వేస్తే చాలు. చీరకే కొత్త వన్నె వచ్చేస్తుంది. పైగా ఏ చీర ఎంపిక. బ్లవుజు తీరేదైనా అదునాతన లుక్ తేవడం ఈ స్టైల్ ప్రత్యేకత. అంటే... సంప్రదాయానికి ఆదునిక వన్నెలద్దినట్లే చలి... వేడుకల వేళ కాస్త వెచ్చదనమూ అందుతుంది. ఇంత విషయం కాబట్టే.. సెలెబ్రిటీల నుంచి



సామాన్యుల వరకూ ఫుల్ బ్లవుజ్ మీద మనసు పారేసుకున్నారు. మరి మీ సంగతేంటి?

## కిచిడి పులగం



**కావలసినవి :** బియ్యం: ఒక కప్పు, పెసరపప్పు: అరకప్పు, ఉల్లిగడ్డ: ఒకటి, టమాట: ఒకటి, పచ్చిమిర్చి: ఆరు, మిరియాలు: అర టీస్పూన్, ఆవాలు, జీలకర్ర: ఒక టీస్పూన్ చొప్పున, పసుపు: పావు టీస్పూన్, నూనె: రెండు టేబుల్ స్పూన్లు, కరివేపాకు: రెండు రెబ్బలు, ఉప్పు: తగినంత.

**తయారీ :** బియ్యం, పెసరపప్పు కడిగి విడివిడిగా గంటసేపు నానబెట్టుకోవాలి. కుక్కర్‌లో నూనె వేసి.. వేడయ్యాక ఆవాలు, జీలకర్ర, మిరియాలు, తరిగిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, కరివేపాకు వేయాలి. బాగా వేగాక పసుపు కలపాలి. నానబెట్టిన పెసరపప్పు, బియ్యం, తగినంత ఉప్పు జోడించి రెండు నిమిషాలు బాగా కలిపి మూడు కప్పుల నీళ్లుపోసి.. మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికిస్తే నోరూరించే పులగం సిద్ధం.

## తువ్వాలా? హెయిర్ డ్ర్యయ్యరా?

తలను సహజంగానే ఆరబెట్టుకోవాలి లేదంటే కురులు రాలిపోతాయంటారు కొందరు. లేదు లేదు తువ్వాలుతో తుడిస్తే జుట్టు గడ్డిలా కనిపిస్తుంది. పైగా ఆరడానికి చాలా సమయం తీసుక ఉంటుంది కాబట్టి డ్రయ్యరే మేలంటారు మరికొందరు. ఇంతకీ రెండిట్లో ఏది ఎంచుకవోడం మేలు?

ఈ వాదన నాణేనికి మరోవైపు లాంటిదే.సరిగా వాడటం తెలియకపోతే రెండింటితోనూ సమస్యలొస్తాయి. కాబట్టి.. ఒక్కదానిపైనే ఆధారపడొద్దు. రెండింటి ప్రయోజనాలు అందుకోవడం మేలంటారు నిపుణులు. తువ్వాలుతో తుడుచుకోవడం మంచిదే! అయితే అది గరుకుగా ఉండేదైతే మూడు తోపాటు కురుల కుదుళ్లపైనా చెడు ప్రభావం చూపుతుంది. కాబట్టి, ఉపయోగించేది మెత్తని కాటన్ టవలేనా అన్నది చూసుకోవాలి. ఇదైతే త్వరగా నీటిని పీల్చుకుంటుంది. అయితే దీంతోనైనా గట్టిగా రుద్దడం, దులుపుతున్నట్లుగా చేయడం లాంటివి వద్దు. నీరు కారడం పూర్తిగా ఆగిపోయాక డ్రయ్యర్‌తో ఆరబెడితే సరి. జుట్టు కుచ్చులుగా కనిపిస్తుంది. అయితే డ్రయ్యర్‌ని మాడుకి మరీ దగ్గరగా ఉంచొద్దు. హీట్ కాకుండా కూల్ మోడ్‌లో పెట్టి వాడితే ఇంకా మంచిది. ఆరబెట్టడం సులువు అవుతుందనో, అలల్లా కనిపిస్తుందనో కొందరు దువ్వెనతో దువ్వుతూ డ్రయ్యర్‌తో అరబెడు తుంటారు. ఇదీ ప్రయాదమే. తడిగా ఉన్న కురులు త్వరగా ఊడేప్రమాదం ఉంది. చాలావరకూ ఆరాక మాత్రమే దువ్వెన తలలో పెట్టాలి. లజలుబు వస్తుందనీ కొందరు డ్రయ్యర్లవైపు మొగ్గు చూపుతారు. ఇప్పుడెలాగూ వేసవే! వేగంగానే ఆరుతుంది కాబట్టి, సహజ పద్ధతికే ఓటేయడం మేలు.



## వారాంతాల్లో సరదాగా..

**ఇల్లు, ఉద్యోగం, ఇతరత్రా వ్యాపాకలతో క్షణం తీరిక లేకుండా గడిపేస్తున్నారా! ఒక్క నిమిషం ఆగండి.** అవన్నీ ఎప్పుడూ ఉండేవే కదా. వారాంతాల్లో అయినా సరదాగా మీ భాగస్వామితో అలా ఏ డిన్నర్‌కో, విహారయాత్రకో వెళ్లిరండి. ఏంటి ప్రత్యేకించి చెబుతున్నారు అనుకుంటున్నారా.. అందుకూ ఓ కారణం ఉంది. అదేంటంటే మనకిష్టమైన వారితో సమయం గడపటం వల్ల ఆనందాన్ని కలిగించే డోపమైన్ హార్మోన్ ఎక్కువగా ఉత్పత్తి అయి. అది మెదడులో ప్రత్యేకమైన రసాయ నిక ముద్రను ఏర్పరుస్తుందట. అది బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని తాజా పరిశోధ నల్లో



తేలింది. అయితే భాగస్వామి నుంచి విడిపోయిన ప్పుడు.. ఆ ముద్ర నెమ్మదిగా మాయమవుతుందట. కాబట్టి మనం భాగస్వామితో మాట్లాడే ప్రతి మాట ప్రతి పనీ ఒకరకంగా చెప్పాలంటే మన ప్రవర్తన వాళ్ల మెదడుపై చాలా ప్రభావం చూపిస్తుంది. కాబట్టి వాళ్ల మనసులో ప్రేమ ముద్రను అలానే ఉంచాలా, చెరపాలా అన్నది మన చేతుల్లోనే ఉంది.


## రంగవల్లి





శివాని
హైద్రాబాద్

19 చుక్కలు
10 వచ్చేవరకు





- సి.హెచ్.మాధవి
సరూర్‌నగర్
హైద్రాబాద్

19 చుక్కలు
5 వరసలు
ఇటు అటు
వదిలి 5 వరకు




## ఓపెన్ ఎటిపి టెన్నిస్ టోర్నీలో..
# నిశేష్ సంచలన విజయం

**ఢిల్లీ:** ఏఎస్బీ క్లాసిక్ ఆక్లాండ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో తెలుగు సంతతి అమెరికన్ టీనేజర్ నిశేష్ బసవరెడ్డి సంచలనం సృష్టించాడు. అక్లాండ్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 19 ఏళ్ల నిశేష్ 6-4, 5-7, 6-4తో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ 23వ ర్యాంకర్, చిలీకి చెందిన అలెజాంద్రో టబిలోను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. రెండు గంటల 25 నిముసాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిశేష్ తొమ్మిది ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండు సార్లు బ్రేక్ చేశాడు.గత నెలలో ప్రొఫెషనల్‌గా మారిన నిశేష్ ఈ టోర్నీ తొలి రౌండ్‌లో6-2,6-2తో 85వ ర్యాంకర్, అర్జెంటీనాకు చెందిన కమ్సానా పై గెలిచాడు. మరోవైపు అడిలైడ్ ఓపెన్‌ఏటీపీ-250 టోర్నీపురుషుల డబుల్స్ విభాగంలో భారత్‌కు చెందిన శ్రీరామ్ బాలాజీ- మెక్సికోకు చెందిన మిగెల్ వరేలా జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లో6-3,3-6,11-13తో నాలుగోసీడ్, ఫిన్లాండ్‌కుచెందిన హ్యారీ హెలియోవారా-బ్రిటన్‌కు చెందిన హెన్రీప్యాటెన్ ద్వయం చేతిలో పోరాడి ఓడిపోయింది.

## బాక్సింగ్‌లో కీలక మార్పులు
### కొత్తగా బరువు విభాగాల అమలు



**ఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ కొత్త తీసుకొచ్చిన బరువు విభాగాలను భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) అమలు చేయబోతున్నది. జాతీయ పురుషుల టోర్నీ ద్వారా కొత్త కేటగిరీలతో పోటీలను నిర్వహిస్తున్నది. గతంలో ఉన్న 13 విభాగాలను వరల్డ్ బాక్సింగ్ పదింటికి కుదిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందులో కొత్త బరువు విభాగాలు 50కి (ఫ్లై వెయిట్), 55కి (బాటమ్ వెయిట్), 60కి (లైట్ వెయిట్), 65కి (వెల్టర్ వెయిట్), 70కి (లైట్ మిడిల్‌వెయిట్), 75కి (మిడిల్ వెయిట్), 80కి (లైట్ హెవీ వెయిట్), 85కి (క్రూజర్ వెయిట్), 90కి (హెవీ వెయిట్), 90+కి (సూపర్ హెవీ వెయిట్)గా ఉన్నాయి. వీటిలో ఆరు 55కి, 60కి, 65కి, 70కి, 80కి, 90కిలను ఒలింపిక్ కేటగిరీలుగా పేర్కొన్నారు. అంతర్జాతీయ బాక్సింగ్ అసోసియేషన్ (ఐబీఏ) గుర్తింపు కోల్పోయిన తర్వాత గత ఎప్రిల్‌లో వరల్డ్ బాక్సింగ్ కొత్తగా మొదలైంది. ఇప్పటికే 60 మంది సభ్యుల మద్దతు కూడగట్టిన వరల్డ్ బాక్సింగ్ ఐఓసీ గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నది.

# మహిళల ప్రీమియర్ లీగ్ షురూ

### రెండు దశల్లో 23 మ్యాచ్‌లు
### బరోడా, లక్నోలో జరిగే అవకాశం
### ఫిబ్రవరి 6, 7 తేదీల్లో ప్రారంభం

**ఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మూడో ఎడిషన్‌కు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇంత వరకూ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ రెండు సీజన్లు పూర్తయ్యాయి. ఇప్పుడు ఇది మూడవ ఎడిషన్‌కు సిద్ధమైంది. బరోడా ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. దీనికి సంబంధించి వేలం ప్రక్రియ ఇటీవలనే పూర్తయింది. వేలం తర్వాత, బీసీసీఐ కూడా డబ్ల్యూపీఎల్ వేదికలను షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. తాజా నివేదిక ప్రకారం, ఈ టోర్నమెంట్ ఫిబ్రవరి 6 లేదా 7 నుంచి ప్రారంభమవుతుంది. ఈ టోర్నీ వేదికలపై తుది నిర్ణయం తీసుకున్నారు. ఈసారి బరోడా, లక్నోలలో మ్యాచ్‌లు ఆడవచ్చు. అయితే తేదీ, వేదికపై భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ఇంకా ఎలాంటి అధికారిక నిర్ణయాన్ని తీసుకోలేదు. దీనికి సంబంధించి బీసీసీఐ, డబ్ల్యూపీఎల్ మూడవ సీజన్ కోసం బరోడా, లక్నోలను షార్ట్‌లిస్ట్ చేసింది. టోర్నీని నిర్వహించేందుకు యూపీ క్రికెట్ అసోసియేషన్, బరోడా క్రికెట్ అసోసియేషన్‌తో చర్చలు ప్రారంభించింది. త్వరలో ఈ రెండు నగరాలను కూడా భారత బోర్డు అధికారికంగా వేదికలుగా ప్రకటించనుంది. నివేదిక ప్రకారం, డబ్ల్యూపీఎల్ రెండవ దశ బరోడాలో ప్లాన్ చేసింది. టోర్నమెంట్ చివరి మ్యాచ్ మార్చి 8 లేదా 9 న ఆడవచ్చు. బరోడా దీనికి ఆతిథ్యం ఇవ్వవచ్చు. బరోడా ఇటీవల కోటంబి స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలను కల్పించింది. ఆ తర్వాత ఈ మైదానంలో భారత్, వెస్టిండీస్ మహిళల జట్లు 3 వన్డే మ్యాచ్‌లు ఆడింది. ఇది కాకుండా, సీనియర్ మహిళల టీ20 టోర్నమెంట్‌లో చాలా మ్యాచ్‌లు కూడా ఈ మైదానంలో జరిగాయి. కొన్ని రంజీ ట్రోఫీ మ్యాచ్‌లు కూడా జరిగాయి. ప్పుడు భారత దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీ కొన్ని నాకౌట్ మ్యాచ్‌లు కూడా ఆతిథ్యం ఇచ్చింది. కొత్త సౌకర్యాలను పరీక్షి ంచడానికి, విజయ్ హజారే ట్రోఫీ సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను కూడా బరోడాలో నిర్వహించవచ్చు. అందుకే ఇప్పుడు బీసీసీఐ దీన్ని డబ్ల్యూపీఎల్ వేదికగా ఎంపిక చేసింది. టోర్నమెంట్ మొదటి సీజన్ పూర్తిగా ముంబైలో ఆడింది. రెండో సీజన్‌లో బెంగళూరు, ఢిల్లీలో మ్యాచ్‌లు జరిగాయి. కాగా డబ్ల్యూపీఎల్ 2025లో, టోర్నమెంట్‌లోని 5 జట్లు ఛాంపియన్‌లు కావాలనే ఉద్దేశ్యంతో ఉన్నాయి. గత ఛాంపియన్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఉంది. బెంగళూరు తన టైటిల్‌ను తిరిగి పొందాలని పట్టుదలతో ఉండగా, ఇతర జట్లు ఈ టైటిల్‌ను గెలుచుకోవాలనుకుంటున్నాయి. ఇందుకోసం రెండు దశల్లో మొత్తం 23 మ్యాచ్‌లు జరగనున్నాయి.



# ఓపెన్ వరల్డ్‌లో మిశ్రమ ఫలితాలు
## ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ
### ప్రణయ్, మాళవిక శుభారంభం.. ఆకర్షి, అనుపమ ఓటమి

ఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. కౌలాలంపూర్‌లో జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఆంధ్రప్రదేకు చెందిన సాత్విక్, మహారాష్ట్ర ప్లేయర్ చిరాగ్ శెట్టి 21-10, 16-21, 21-5తో చైనీస్ తైపీ మింగ్ చెలు-టాంగ్ కాయ్ వెలపై గెలుపొందారు. 56 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ తొలి గేమ్‌ను నెగ్గినా, రెండో గేమ్‌లో తడబడింది. అయితే నిర్ణాయక మూడో గేమ్‌లో సాతిక్వ్-చిరాగ్ చెలరేగి ప్రత్యత్యర్థి జోడీ ఆట కట్టించారు. సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకోగా, ప్రియాన్షు రజావత్ తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టాడు. ప్రణయ్ 21-12, 17-21, 21-15తో కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్‌పై విజయం సాధించగా, ప్రియాన్షు 11-21, 16-21తో ఏడో సీడ్, చైనాకు చెందిన ఫెంగ్ లీ చేతిలో ఓడిపోయాడు. కాగా మహిళల సింగిల్స్‌లో మాళిక బన్సోద్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా, అనుపమా, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. మాళవిక 21-15, 21-16తో మలేషియాకు చెందిన గో జిన్ వెపై విజయం సాధించగా, ఆకర్షి 14-21, 12- 21తో డెన్మార్క్‌కు చెందిన జూలీ జేకెట్సన్ చేతిలో, అనుపమ 17-21, 21-18, 8-21తో థాయ్‌లాండ్‌కు చెందిన ఫోర్న్‌ఫనీ చోచువోంగ్ చేతిలో ఓటమి పాలయ్యారు.

# ఛాంపియన్స్ ట్రోఫీయే లాస్ట్ ఛాన్స్
## రోహిత్, కోహ్లీకి బిసిసిఐ వార్నింగ్





**ఢిల్లీ:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి ఇప్పుడు బ్యాడ్ టైమ్ నడుస్తోంది. ఆర్నెళ్ల కింద టీ20 వరల్డ్ కప్ గెలవగానే వీళ్లను అందరూ ఆకాశానికెత్తేశారు. లెజెండ్స్ అంటూ ప్రశంసించారు. పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెబితే డెసిషన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పుడు మెచ్చుకున్న వాళ్లే ఇప్పుడు ఇతర ఫార్మాట్ల నుంచి తప్పుకోమంటూ ప్రెజర్ పెడుతున్నారు. టీమ్ వరుస వైఫల్యాలకు తోడు ఇద్దరూ బ్యాటింగ్‌లో దారుణంగా ఫెయిల్ అవుతుండటంతో రిటైర్ అవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. దీంతో మరికొన్ని నెలల్లో భారత క్రికెట్‌లో అనూహ్య మార్పులు చోటుచేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సిరీస్‌లో ఫెయిలైన రోహిత్, కోహ్లీకి బీసీసీఐ గట్టిగా హెచ్చరికలు పంపింది. ఎంత పెద్ద ఆటగాళ్లైనా టీమ్ తర్వాతేనని, జట్టు అవసరాలు, గెలుపే ముఖ్యమని బోర్డు పెద్దలు స్పష్టం చేశారు. తోపు ప్లేయర్లు అయినా జట్టు తర్వాతేనని క్లారిటీ ఇచ్చినట్లు వెల్లడైంది. వచ్చే నెలలో జరగబోయే చాంపియన్స్ ట్రోఫీనే చివరి అవకాశమని, అందులో గానీ సరిగ్గా పెర్ఫార్మ్ చేయకపోయినా, రిజల్ట్ తారుమారైనా కఠిన చర్యలు ఉంటాయని గట్టిగా హెచ్చరించారట. సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ కూడా ఈ జోడీపై సీరియస్ అయ్యాడని సమాచారం. కాగా ఆస్ట్రేలియా టూర్‌లో రోహిత్, కోహ్లీ ఫెయిల్ అయ్యారు. సరిగ్గా ఆడట్లేదు, టీమ్ కూడా వరుస వైఫల్యాల్లో ఉండటంతో హిట్‌మ్యాన్‌ను ఆఖరి టెస్ట్‌లో జట్టు నుంచి తొలగించారు. దీంతో అతడికి సపోర్ట్‌గా విద్యాబాలన్, ఫర్హాన్ అక్తర్ లాంటి పలువురు బాలీవుడ్ సెలెబ్రిటీలు సోషల్ మీడియాలో పోస్టులు చేయడం, పీఆర్ క్యాంపెయినింగ్ లాంటివి జోరుగా నడవడం బీసీసీఐపై ప్రెజర్ పెట్టాయని తెలిసింది. దీంతో ఈ విషయం మీదా బోర్డు పెద్దలు గుర్రుగా ఉన్నారని వినిపిస్తోంది. త్వరలో జరిగే మీటింగ్‌లో దీనిపై మరింత డిస్కస్ చేయనున్నారని, రోహిత్, కోహ్లీకి ఈ విషయంలోనూ వార్నింగ్స్ తప్పవని తెలుస్తోంది.


# వాణిజ్యం

# 'చూసింది చాలు.. వచ్చి పని చెయ్'

**న్యూఢిల్లీ, జనవరి 9:** అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ చేరాలంటే దేశ యువత వారానికి 70 గంటలు చొప్పున పనిచేయాలంటూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలు ఇటీవల పెద్ద చర్చకు దారితీసిన సంగతి విదితమే. తాజాగా ఎల్ అండ్ టి చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఆదివారాలు కూడా పనిచేయాలని ఆయన ఉద్యోగులకు సూచించారు. 'ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు. వారానికి 90 గంటలు పనిచేయాలి. అవసరమైతే ఆదివారాలు కూడా వదులుకోవాలి. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని భార్యలకు చెప్పాలి. ఆదివారాలు మీతో పనిచేయించలేకపోతున్నందుకు చింతిస్తున్నాను. మీతో అలా పనిచేయించగలిగితే నాకు సంతోషం. ఎందుకంటే నేను ఆదివారాలు పనిచేస్తున్నాను' అంటూ వారితో మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు నెట్టింట్లో వైరల్ కాగా, నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశారు. భార్య ప్రస్తావన తీసుకువస్తూ ఆయన మాట్లాడిన మాటలను కొందరు తీవ్రంగా విమర్శించారు. నారాయణ మూర్తి ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లో ఉత్పాదకత తక్కువని అన్నారు. అందుకే దేశ యువత మరిన్ని గంటలు అధికంగా శ్రమించాలన్నారు. రెండోప్రపంచయుద్ధం తర్వాత జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎలాగైతే కష్టపడ్డా యో, మనకూ అలా శ్రమించాలని అన్నా రు. అభివృద్ధి చెందిన దేశాలో పోటీ పడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పని చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై భిన్న స్పందనలు వ్యక్తమయ్యాయి. కొందరు ఉద్యోగ జీవితంలో ఉండే ఇబ్బందులను లేవనెత్తగా, మరికొందరు నారాయణ మూర్తి అభిప్రాయాన్ని స్వాగతించారు.



# ఐటి, ఫైనాన్షియల్ షేర్ల ఒత్తిడి




**ముంబై, జనవరి 9:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలతో దేశీయ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిసాయి. ఐటి, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాలు ఒత్తిడి కనిపించింది. ముఖ్యంగా అమెరికన్ డాలర్ రోజురోజుకూ బలపడుతుండడం, బాండ్ల రాబడి పెరగడంతో మన ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఇది మన మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 500 పాయింట్లకుపైగా నష్టంతో 78వేల దిగువకు చేరగా, నిఫ్టీ కూడా 23,600 పాయింట్ల స్థాయిని కోల్పోయింది. రెండురోజుల్లో ఇన్వెస్టర్ల సంపద రూ.7 లక్షల కోట్లు క్షీణించి రూ.435 లక్షల కోట్లకు పరి మితమైంది. సెన్సెక్స్ ఇంట్రాడేలో దాదాపు 600 పాయింట్లు నష్టపోయింది. చివరికి సెన్సెక్స్ 528.28 పాయింట్లు నష్టపోయి 77,620.21 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 162.45 పాయింట్ల నష్టంతో 23,526.50 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయివిలువ రూ.85.88 గా ఉంది. టాటా స్టీల్, జొమాటో, ఎల్‌అండ్‌టి, టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఏసియన్ పెయింట్స్ వంటి షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 2682 డాలర్లకు చేరింది.

# మహిళల కోసం ఎల్ఐసి బీమా సఖి యోజన

**ముంబై, జనవరి 9:** దేశవ్యాప్తంగా సాధికారత లక్ష్యంగా జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ బీమా సఖి యోజన పేరుతో ప్రతిష్టాత్మ కంగా ప్రారంభించబడింది. 2024 డిసెంబర్ 9న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ పథకం బీమా సఖీలుగా పేర్లే ఏజెంట్లుగా మారడానికి మహిళలకు శిక్షణ ఇస్తారు. దాంతో వారికి ఉపాధి అవకాశాలను అందించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యత, బీమాపై అవగాహనను పెంపొందించడం బీమా సఖి యోజన ప్రాథమిక లక్ష్యం. పథకం ప్రారంభించిన మొదటి సంవత్సరంలో 1,00,000 మంది మహిళలు,వచ్చే మూడేళ్ల లో 2,00,000మంది మహిళలను ఈ పథ కంలో భాగం చేయడం దీనిలక్ష్యం. ఫలితం గా గ్రామీణ, పట్టణ ప్రాంతాలవారికి బీమా ను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు, సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది.ఈ పథకంలో చేరినవారు మూడు సంవత్స రాల పాటు ప్రత్యేకశిక్షణ పొందుతారు. ఈసమయంలో వారికి నెలవారీ స్టైఫండ్ అందిస్తారు. మొదటి ఏడాది స్టైపెండ్ రూ.7 వేలు, రెండో ఏడాది రూ.6 వేలు, మూడో ఏడాది రూ.5 వేలు. దాంతో పాటు నిబంధనలకు అనుగు ణంగా ఇన్‌సెంటివ్‌లు అందిస్తారు.

# టాటా నుంచి ఫిక్స్డ్ డిపాజిట్ స్కీమ్

**ముంబై, జనవరి 9:** ప్రతిఒక్కరూ డబ్బును ఏదైనా సురక్షితమైన వాటిలో ఇన్వెస్ట్ చేసి ఆదాయం పొందాలని చూస్తారు. ఫిక్స్డ్ డిపాజిట్లలో డబ్బులు వేస్తే ఎక్కువ వడ్డీ వస్తుందనే ఆశతో ఫిక్స్డ్ డిపాజిట్లలో పెట్టే వారు కూడా చాలా మంది ఉన్నారు. అయితే ఏ బ్యాంకు ఎక్కువగా వడ్డీని ఇస్తుందో తెలియదు. ఇందుకు సంబంధించి దేశంలోనే నమ్మకమైనా ప్రముఖ కంపెనీ టాటా ఫిక్స్‌డ్ డిపాజిట్ సర్వీస్‌ను అందుబాటులోకి తెచ్చింది. టాటా అనగానే మనకు దివంగత వ్యాపారవేత్త రతన్ టాటా గుర్తుకొస్తారు. అతనివల్ల భారతదేశం ఎన్నోరకాలుగా లబ్ధి పొందింది. మనము ఉపయోగించే అన్ని ఉత్పత్తులలో టాటా ఖచ్చితంగా ఎక్కడో ఒకచోట ఉంటుంది. వాటన్నింటినీ మనకు అందించిన వ్యక్తి రతన్ టాటా. ప్రజలందరినీ సమానంచేయాలనే ఉద్దేశ్యంతో అతను అన్ని వ్యాపారంలో తక్కువ ధర ఉత్పత్తులను ప్రవేశపెట్టాడు. అదే విధంగా టాటా న్యూ పేరుతో ఓ యాప్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో అన్ని టాటా వ్యాపారాలు ఉంటాయి. అయితే తాజాగా మరొక సర్వీస్ ఇప్పుడు పరిచయం చేసింది. దీని ప్రకారం ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో రూ.1000 పెట్టుబడిని ప్రారంభిస్తే 9.1% వరకు వడ్డీ ఇవ్వనున్నట్లు సమాచారం. టాటా మ్యూచువల్ ఫండ్‌లు ఇప్పటికే మార్కెట్‌లో ఉండగా, టాటా రిటైల్ కంపెనీ 9.1% వడ్డీ రేటుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు అఫీషియల్ ప్రకటన చేసింది. డిజిటల్ మార్కెట్‌లో బలమైన పట్టుతో టాటా న్యూ కస్టమర్లకు క్యాష్ సేవింగ్ అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్ సేవలకు సంబంధించిన చాల రకాల ఆర్థిక ఉత్పత్తులు, రిటైల్ పేమెంట్ సౌకర్యాలను అందిస్తుంది. దీని ప్రకారం, మీరు సేవింగ్స్ అకౌంట్ తెరవకుండానే టాటా న్యూ ద్వారా వివిధ బ్యాంకుల్లో డబ్బును డిపాజిట్ చేయవచ్చు. డిపాజిట్‌చేసిన డబ్బుపై 9.1% వడ్డీ రేటుతో ప్రముఖ ఆర్థిక సంస్థల ఎఫ్‌డి పథకాల్లో కస్టమర్లు పెట్టు బడి పెట్టవచ్చని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. టాటా డిజిటల్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ (ఫైనాన్షియల్ సర్వీసెస్) గౌరవ్ హజ్రతీ మాట్లాడుతూ మేము చాలా నమ్మకమైన బ్యాంకుల ద్వారా పెట్టుబడిదారులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించాము. మీరు కేవలం 1,000 రూపాయలతో కూడా ఈ పథకంలో పెట్టుబడి పెట్టవచ్చు అని చెప్పారు. అదే విధంగా కస్టమర్లు వివిధ పెట్టుబడి అప్షన్లతో బ్యాంకులు ఇంకా చిన్న ఫైనాన్స్ బ్యాంకింగ్ పథకాలలో పెట్టుబడి పెట్టవచ్చు. దీని ప్రకారం, సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్ వంటి నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఎన్‌బిఎఫ్‌సి)లో సెలక్షన్ చేసుకోవచ్చు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.